www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

'ఒక దేశం.. ఒకే ఎన్నిక' నియంతృత్వమే



ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

రామ్‌నాథ్ కోవింద్ కమిటీకి టీఎంసీ చీఫ్ మమత లేఖ

2

శుక్రవారం | 12-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 285

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి మ. 2.25 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ మ.3.19 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా.6.54-8.20, దుర్ముహూర్తం: ఉ.9.05-9.49, మ.12.46-1.30, అమృతఘడియలు: ఉ.9.32-10.59, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 5.55

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దోస్త్‌కు సర్వీస్

ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై మాజీ మంత్రి మిత్రుడి పాగా





అసంపూర్తిగా ఉన్న ఔటర్ జంక్షన్

- రోడ్డుకు సేకరించిన భూమి అన్యాక్రాంతం
- రూ. 150 కోట్ల విలువ చేసే భూమిలో తిష్ట
- బీఆర్ఎస్ మాజీ మంత్రి అండతో అక్రమాలు
- 2018 నుంచి యథేచ్ఛగా క్రయవిక్రయాలు
- సర్వీస్ రోడ్డు లేక ప్రజలకు తీవ్ర ఇక్కట్లు
- ఘట్‌కేసర్‌లో ఔటర్ జంక్షన్ వద్ద భూమాయ
- స్థలాల అక్రమాలపై విచారణకు డిమాండ్

ఘట్‌కేసర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని ఇప్పటికీ సంబంధిత యజమానులే అనుభవిస్తున్నారు. రూ.150 కోట్లకు పైగా విలువైన సర్కారు భూమి అన్యాక్రాంతమైనా పట్టించుకున్న నాథుడే లేడు! ఎందుకంటే భూ యజమాని గత ప్రభుత్వంలోని కీలక మంత్రికి స్నేహితుడు! మిత్రుడి మేలు కోసం ఆ మంత్రి కూడా తన శక్తిమేరకు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి! సాక్షాత్తూ మంత్రిగారే అండగా నిలవడంతో ఆ వ్యక్తి, అతని కనుసన్నల్లో నడిచే మిగిలిన వారు చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌కే తూట్లు పొడిచారు! సర్వీసు రోడ్డు నిర్మించాల్సిన 14,036 చదరపు గజాల భూమిలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, పరిశ్రమలు వెలిశాయి. ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులు దర్జాగా అనుభవిస్తుండగా.. రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు!! ఈ భూబాగోతం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం ఘట్‌కేసర్ రెవెన్యూ పరిధిలోని

మిగతా 12వ పేజీలో...

ధరణి

నిషేధిత జాబితాలో భూములు మాయం!

- ధరణి పోర్టల్ వచ్చాక ఆక్రమణలు
- నిషేధం నుంచి పట్టా భూమిగా మార్పు
- వాటి ద్వారా రూ.వేల కోట్ల కుంభకోణాలు
- ప్రభుత్వ గుర్తింపు.. ధరణి కమిటీ దృష్టి
- ఆయా భూముల వివరాలు ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- అనుమానాస్పద లావాదేవీలను పరిశీలించాలని నిర్ణయం
- సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయికి కమిటీ

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో నమోదు చేసిన అనేక భూములు గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆక్రమణలకు గురైనట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. వేలాది కోట్ల రూపాయల కుంభకోణం దీని ద్వారా జరిగిందని నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. దీని వెనక ఎవరున్నారు!? వారికి సహకరించిన అధికారులు ఎవరు!? అన్న దానిపై ధరణిపై నియమించిన కమిటీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు నిషేధిత జాబితాలో ఉండి అన్యాక్రాంతమైన ఆయా భూముల వివరాలు అందజేయాలని అధికారులను సదరు కమిటీ ఆదేశించింది. ఈ కమిటీ తొలి సమావేశం గురువారం జరిగింది. కమిటీ కన్వీనర్, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ అధ్యక్షతన సభ్యులు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, భూ పరిపాలన పూర్వ ప్రధాన

మిగతా 13వ పేజీలో...



వడ్డీ తక్కువ.. షరతులు ఎక్కువ!

- తక్కువ వడ్డీకే అప్పులు తీసుకోవాలన్న సీఎం
- కానీ.. జైకా, ఏడీబీ రుణాలు అంత సులభం కాదు
- వాటి షరతులను తట్టుకోలేమంటున్న అధికారులు
- బడ్జెట్ అప్పుల్లో లెక్కిస్తే ఇబ్బందికరమే
- కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం నెరపాల్సిందే
- తెచ్చిన అప్పులను మౌలిక సదుపాయాలకే వాడాలి
- పథకాలకు మళ్లిస్తే తదుపరి అప్పుల నిలిపివేత!

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీసుకోవాలి.. కానీ, చాలా తక్కువ వడ్డీకి ఇచ్చే సంస్థల వద్ద తీసుకోవాలి! ఇదీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ యోచన. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు స్పష్టం చేశారు. జాతీయ ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి కాకుండా అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలు ఇప్పించాలని ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలైతే తక్కువ వార్షిక వడ్డీలతో రుణాలు ఇస్తాయని ప్రస్తావిస్తున్నారు. ఈ ఆలోచన మంచిదేనని ఆర్థిక నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. కానీ, అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలు తీసుకోవడం అంత సులభం కాదని చెబుతున్నారు. ఆ సంస్థల షరతులు, నిబంధనలు, కొర్రీలను సర్కారు తట్టుకుంటుందా? అడుగడునా నివేదికలు సమర్పించడం సాధ్యమవుతుందా? మౌలిక సదుపాయాలకు కాకుండా ప్రభుత్వ పథకాలకు మళ్లించే అవకాశాలు ఉండవు కదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒక ఇంటిని నిర్మించుకోవడానికి

మిగతా 13వ పేజీలో...

అబద్ధాల ముందు అభివృద్ధి ఓడింది



- కాంగ్రెస్ దుష్ప్రచారం నమ్మి పనిచేసిన వారిని తిరస్కరించారు
- పనులకంటే ప్రచారంపై దృష్టిపెడితే గెలిచేవాళ్లం
- గిరిజనులకు ఎంతో చేశాం.. అయినా పూర్తి మద్దతివ్వలేదు
- పార్టీ శ్రేణులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు
- కేసీఆర్ వంటి గొప్ప నాయకుడు మనకున్నారు
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిత్యం అభివృద్ధి అంటూ పనులపై దృష్టిపెట్టడానికన్నా ప్రచారానికి ప్రాధాన్యత ఇచ్చి ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేవాళ్లమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నోటికొచ్చిన హామీలు ఇవ్వడంతోపాటు కాంగ్రెస్ వాళ్ల తప్పుడు ప్రచారాన్ని నమ్మిన ప్రజలు బాగా పనిచేసిన నాయకులను కూడా తిరస్కరించారని తెలిపారు. గురువారం తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందులో మాజీ మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎంపీ మాలోతు కవిత, పార్టీ నేతలు

మిగతా 12వ పేజీలో...

కార్యకర్తలే ఓడించారు!

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల వ్యాఖ్యలు
- అభ్యర్థిని మార్చమన్నా వినలేదంటూ డోర్నకల్ నేతలు, కార్యకర్తల నిరసన
- కార్యకర్తల పట్ల నేతల వైఖరి మారాలి
- మానుకోట సన్నాహక భేటీలో కడియం

12



ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేతో మంత్రులు సీతక్క, జూపల్లి, భట్టి, కొండా సురేఖ, పొన్నం

14 సీట్లు పక్కా!

- లోక్‌సభ ఎన్నికల పోరు మొదలైనట్లే.. ప్రచార వ్యూహాలకు పదును పెట్టండి
- తెలంగాణ కో ఆర్డినేటర్లతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 14 స్థానాలను కాంగ్రెస్ పక్కాగా గెలిచే అవకాశం ఉందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పోటీ చేయబోయే ఎంపీ అభ్యర్థుల పేర్లను త్వరితగతిన అధిష్ఠానానికి నివేదించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల పోరు ప్రారంభమైనట్లేనని, ఇక ప్రచార వ్యూహాలకు పదును పెట్టాలని నేతలకు సూచించారు. గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ లోక్‌సభ కో ఆర్డినేటర్లతో ఖర్గే సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో పార్టీలోని వివిధ స్థాయిల్లోని నేతలు చేయాల్సిన కార్యక్రమాలకు సంబంధించి నేతలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఖర్గే, లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సంబంధించి నేతలకు

మిగతా 3వ పేజీలో...

సీఎం క్యాంప్ ఆఫీసుగా పాయ్‌గా ప్యాలెస్?



- పరిశీలించిన సీఎస్, అధికారులు.. భవన పటిష్ఠత, సౌకర్యాలపై ఆరా
- ఆరో నిజాం పాలనలో నిర్మాణం.. గతంలో యూఎస్ కాన్సులేట్ ఇక్కడే

13

హెచ్ఎండీఏ ప్రక్షాళన

- మార్పులు, చేర్పులు చేపడుతున్న దానకిశోర్
- డిప్యూటేషన్‌పై వచ్చినవారు సొంత శాఖలకు
- ఎస్టేట్ ఆఫీసర్ బాధ్యత జాయింట్ కమిషనర్‌కు
- మెట్రోపాలిటన్ కమిషనర్ ఓఎస్డీ తొలగింపు

hmda Growing Global

మిగిలిన ఇద్దరూ రాజీనామా బాటలో!?

- వైదొలగే యోచనలో టీఎస్‌పీఎస్సీ సభ్యులు
- కమిషన్ చైర్మన్ పదవి కోసం ఢిల్లీలో పైరవీలు!

12

సమస్యలా? మతమా?

- తేల్చుకోవాలని ప్రజలకు చెబుతాం
- మత ప్రాతిపదికన బీజేపీ ప్రచారం రాజ్యాంగ వ్యతిరేకం
- 'హిందుత్వ' అంశం ఆ పార్టీ సొత్తు కాదని వివరిస్తాం
- బడ్జెట్ సమావేశాల తర్వాత ఇండియా కూటమి ప్రచారం
- రామ మందిర ప్రారంభానికి వ్యూహాత్మకంగానే దూరం
- 140 స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయం: సీనియర్‌నేత

న్యూఢిల్లీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆచితూచి ఆలోచించిన తర్వాతే అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి హాజరుకాకూడదని కాంగ్రెస్ అగ్ర నేతలు నిర్ణయించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇది ముమ్మాటికీ బీజేపీ- ఆరెస్సెస్ కార్యక్రమమేనని స్పష్టం చేశాయి. ఆహ్వానాలు సహా పలు అంశాల్లో ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్ నేతలు చురుగ్గా పాల్గొనడమే నిదర్శనమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు గురువారం వెల్లడించారు. ఆలయ ప్రారంభాన్ని రాజకీయం చేసేందుకు స్వయంగా ప్రధాని మోదీనే ప్రయత్నించారని, జనవరి 22న ఇంటింటా దీపాలు వెలిగించమని ప్రజలకు పిలుపునిచ్చారని ఆయన గుర్తు చేశారు. తమ పార్టీ నేతలు హాజరైనా వారిని విమర్శిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. "మందిర ప్రారంభానికి వెళ్లడంపై మేధావులతో చర్చించాం. మందిరాన్ని బీజేపీ ఎలాగూ ప్రచారాస్త్రం చేస్తుంది. కాబట్టి ప్రారంభానికి దూరంగా ఉండడమే సముచితమని వారు చెప్పారు. వెళ్లినా, వెళ్లకున్నా

మిగతా 2వ పేజీలో...

31 నుంచి పార్లమెంట్

బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 9 వరకు నిర్వహణ
- మహిళా రైతులపై వరాల జల్లుకు చాన్స్

2





సీతమ్మ సాగర్ పనులు ఆపండి

- ప్రాజెక్టు సీఈపై చర్యలు తీసుకోండి: కేంద్రం

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని అమ్మగారిపల్లి వద్ద గోదావరిపై తలపెట్టిన 'సీతారామ ఎత్తిపోతల పథకం- సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు' నిర్మాణ పనులను తక్షణమే ఆపేయాలని కేంద్రం ఆదేశించింది. అంతేకాక, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్(సీఈ) శ్రీనివాస్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రాజెక్టును ఉల్లంఘనల కేటగిరీలో టర్మ్ అండ్ రిఫరెన్స్ జారీ చేయడానికి అవసరమైన ప్రతిపాదన సమర్పించాలని కోరింది. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఓ లేఖ రాసింది. నిజానికి, పర్యావరణ అనుమతి తీసుకోకుండా సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారని దాఖలైన పిటిషన్‌ను విచారించిన ఎన్జీటీ ప్రాజెక్టు పనులను ఆపాలని ఇదివరకే ఆదేశించింది. పనులు నిలిపివేశారో లేదో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఓ కమిటీని కూడా వేసింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదికపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎన్జీటీ మరో కమిటీని వేసింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా పనులు కొనసాగుతున్నాయని గుర్తించిన ఎన్జీటీ తీవ్రంగా స్పందించింది. ప్రాజెక్టు పనులు నిలిపివేసి, సీఈపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

రాజుకుంటున్న మునిసిపల్ రగడ

- రాష్ట్రవ్యాప్తంగా 29 మునిసిపాలిటీల్లో అవిశ్వాస నోటీసులు
- వర్ధన్నపేట చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పైనా..
- బెల్లంపల్లి చైర్‌పర్సన్‌పై నేడు అవిశ్వాసం
- బీఆర్ఎస్‌కు 18 మంది కౌన్సిలర్ల గుడ్‌బై
- ఇప్పటికే ఆర్మూరు, నల్లగొండ హస్తగతం
- మలుపులు తిరుగుతున్న పుర రాజకీయం
- ఈ నెలాఖరుకు నాలుగేళ్ల పాలన పూర్తి
- గవర్నర్ వద్దే మునిసిపల్ చట్టసవరణ బిల్లు
- ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌పైనా అవిశ్వాసం!



వరంగల్ ఆర్డీవో వాసుచంద్రకు అవిశ్వాస నోటీసు అందజేస్తున్న వర్ధన్నపేట మునిసిపల్ కౌన్సిలర్లు

3

*401# కాల్స్‌తో జాగ్రత్త!

- మీ కాల్స్ ఇంకొకరికి వెళ్లిపోతాయి
- సైబర్ నేరగాళ్ల కాల్‌ఫార్వార్డింగ్ మోసం
- ప్రజలకు టెలికామ్ శాఖ హెచ్చరిక



న్యూఢిల్లీ, జనవరి 11: 'హలో'.. నమస్తే సార్/మేడమ్.. మేము మీ టెలికామ్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నాం.. మా సేవలను మీరు ఆనందిస్తున్నారా..? నెట్‌వర్క్ సమస్యలు ఏమైనా ఉన్నాయా..? ఉంటే.. మీ మొబైల్‌లో *401# తర్వాత మేము సూచించిన మొబైల్ నెంబర్ టైప్ చేసి డయల్ చెయ్యండి. మీ సమస్య పరిష్కారం అవుతుంది" అని ఎవరైనా ఫోన్ చేసి మీకు చెబితే... తొందరపడకండి.. అలా చెయ్యమని ఏ టెలికామ్ సంస్థ మిమ్మల్ని కోరదు. సైబర్ నేరగాళ్ల నయా మోసం ఇది. ఒక వేళ అపరిచిత వ్యక్తి చెప్పినట్టుగా *401# తర్వాత గుర్తు తెలియని నంబర్ టైప్ చేసి డయల్ చేస్తే అంతే సంగతి. మీ సిమ్‌కు రావాల్సిన ఫోన్ కాల్స్ ఆ గుర్తు తెలియని నంబర్‌కు వెళ్లేందుకు అవసరమైన కాల్ ఫార్వార్డ్‌కు మీకు తెలియకుండా మీరు అనుమతించినట్టే. ఇక, ఆ కాల్స్‌ను రిసీవ్ చేసుకున్న వాళ్లు వాటితో సులువుగా మోసాలకు పాల్పడతారు. మీరు బుక్కైపోతారు జాగ్రత్త.. ఈ *401# మోసం పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టెలికామ్ శాఖ గురువారం ఓ హెచ్చరిక జారీ చేసింది. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. వినియోగదారులు తమ ఫోన్ సెట్టింగ్స్‌లో కాల్ ఫార్వార్డింగ్ ఆప్షన్ ఇనేబుల్‌లో ఉంటే వెంటనే డిసేబుల్ చేసుకోవాలని సూచించింది.

31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!

- ఫిబ్రవరి 9 వరకు నిర్వహణ

న్యూఢిల్లీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు రంగం సిద్ధమవుతుంది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. 31న బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాల్లో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఈ బడ్జెట్‌లో మహిళా రైతులపై కేంద్రం వరాలు జల్లు కురిపించే అవకాశం కనిపిస్తుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద మహిళా రైతులకు ఇచ్చే నగదు సాయాన్ని ఈ బడ్జెట్‌లో రెట్టింపు చేయనున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) ఏ క్షణమైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

లోకం తీరు



లోపరహితంగా లోక్‌సభ ఎన్నికలు

- తగిన చర్యలు తీసుకోండి: ఈసీ

న్యూఢిల్లీ, జనవరి 11: రానున్న సార్వత్రిక ఎన్నికలను లోపరహితంగా నిర్వహించడానికి అన్ని చర్యలూ తీసుకోవాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. మార్చి-ఏప్రిల్‌లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఇక్కడ ప్రారంభమైన రెండు రోజుల సదస్సులో సీఈసీ మాట్లాడారు. ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల శాసనసభల ఎన్నికలలో ఎదురైన అనుభవాలను చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2024 ఎన్నికలకు సన్నాహకంగా గత ఆరు నెలలుగా సదస్సులు, శిక్షణలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్న విషయాన్ని ఎన్నికల సంఘం కమిషనర్ అనూప్ చంద్రపాండే ప్రస్తావించారు.

'ఒక దేశం.. ఒకే ఎన్నిక' నియంతృత్వమే

- రామ్‌నాథ్ కోవింద్ కమిటీకి మమత బెనర్జీ లేఖ



కోల్‌కతా, న్యూఢిల్లీ, జనవరి 11: 'ఒక దేశం.. ఒకే ఎన్నిక' ఆలోచనను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది నియంతృత్వమేనని విమర్శించారు. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్'తో తాము ఏకీభవించడం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు జమిలి ఎన్నికలపై అధ్యయనానికి కేంద్రం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఉన్నతస్థాయి కమిటీ కార్యదర్శి డాక్టర్ నితేశ్ చంద్రకు గురువారం లేఖ రాశారు. ఈ విధానం భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణానికి వ్యతిరేకమని, ప్రజాస్వామ్య ముసుగులో నియంతృత్వాన్ని అనుమతించే వ్యవస్థగా ఇది మారుతుందని పేర్కొన్నారు.

సీట్ల పంపకాలపై కూటమి సమావేశానికి వెళ్లం: టీఎంసీ

లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై కాంగ్రెస్ కూటమి కమిటీతో జరిగే సమావేశానికి తమ ప్రతినిధులను పంపబోమని, తమ వైఖరిని ఇప్పటికే మహాకూటమికి తెలియజేశామని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) వర్గాలు గురువారం వెల్లడించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన భాగస్వామ్య పక్షాలతో సీట్ల పంపకాలపై కమిటీ చర్చలు జరుపుతోంది. ఈ సమావేశాల కోసం కాంగ్రెస్.. తమ పార్టీ నేతలను సంప్రదించిందని, ఈ చర్చలకు తమ ప్రతినిధులను పంపించడానికి ఆసక్తిగా లేమని టీఎంసీ వర్గాలు తెలిపాయి.

బంగ్లా ప్రధానిగా హసీనా ప్రమాణ స్వీకారం



ఢాకా, జనవరి11: బంగ్లాదేశ్ ప్రధానిగా అవామీ లీగ్ పార్టీ నేత షేక్ హసీనా (76) గురువారం ఇక్కడ ప్రమాణ స్వీకారం చేశారు. దేశ 12వ ప్రధానిగా ఆమె చేత అధ్యక్షుడు మహమ్మద్ షహాబుద్దీన్ ప్రమాణం చేయించారు. దీంతో ఆమె అయిదుసార్లు ప్రధాని పదవిని చేపట్టినట్టయింది. దీంట్లో వరుసగా నాలుగు సార్లు ప్రధాని కావడం విశేషం. తొలిసారిగా 2009లో ప్రధాని అయ్యారు. ప్రస్తుతం ప్రపంచంలోనే ఎక్కువ కాలంపాటు అధికారంలో కొనసాగుతున్న మహిళా ప్రభుత్వాధినేతగా గుర్తింపు పొందారు. ఆమెతో పాటు 25 మంది మంత్రులు, 11 మంది సహాయ మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు.

అఫ్ఘానిస్థాన్‌ను వణికించిన భూకంపం

ఇస్లామాబాద్, జనవరి 11: అఫ్గానిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలను గురువారం భూకంపం వణికించింది. ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదైంది. మధ్యాహ్నం భూమి కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల్లోని వారు భయంతో పరుగులు తీశారు. పాకిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపించింది. అయితే రెండు దేశాల్లోనూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తెలుస్తోంది. అఫ్గానిస్థాన్‌లోని హిందూ కుష్ పర్వత శ్రేణిలో 213 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు పాక్ వాతావరణ శాఖ పేర్కొంది. కాగా గత మూడు నెలల కాలంలో అఫ్గానిస్థాన్‌లో మూడోసారి భారీ భూకంపం సంభవించింది. అఫ్గానిస్థాన్‌లో భూకంపం నేపథ్యంలో న్యూఢిల్లీ, ఉత్తరాదిలోని కొన్ని ప్రాంతాల్లో స్వల్ప ప్రకంపనలు వచ్చినట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ పేర్కొంది. కాగా గత అక్టోబరులో అఫ్గానిస్తాన్‌లో రెండు శక్తివంతమైన భూకంపాలు సంభవించడంతో 2వేల మందికిపైగా మరణించారు. 9వేలకు పైగా గాయాలపాలయ్యారు.

యూట్యూబ్ ఇండియాకు సమన్లు

- జారీ చేసిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ
- తల్లులు-కుమారులపై అసభ్య వీడియోల పోస్టింగ్‌తోనే!

న్యూఢిల్లీ, జనవరి 11: కొందరు తల్లీ-కొడుకులు చేసిన అసభ్యకర వీడియోలపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ (ఎన్‌సీపీసీఆర్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీటిని పోస్ట్ చేసిన ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ మాధ్యమం యూట్యూబ్ ఇండియాకు సమన్లు జారీ చేసింది. ఆ సంస్థ ఇండియా హెడ్ (ప్రభుత్వ వ్యవహారాలు- ప్రజా విధానాలు) మీరా ఛట్ ఈ నెల 15న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. సమన్లపై స్పందించకుంటే అరెస్టు తప్పదని హెచ్చరించింది. అశ్లీల కంటెంట్ తొలగింపుపై చేపట్టిన చర్యలు వెల్లడించాలని.. సంబంధిత వీడియోల జాబితాతో రావాలని నిర్దేశించింది. అసభ్య వీడియోల పోస్టింగ్.. పోక్సో చట్టం ఉల్లంఘనే అని, అశ్లీల వీడియోలు మైనర్లు చూసేలా ఉండడం పిల్లల భద్రతకు తీవ్ర హానికరమని ఎన్‌సీపీసీఆర్ చీఫ్ ప్రియాంక్ కానుంగో ఆందోళన వ్యక్తం చేశారు. తల్లీ- మైనర్ కుమారుడికి చెందిన ఓ అసభ్య వీడియో యూట్యూబ్‌లో అప్‌లోడ్ కావడం.. అది ఇతర సోషల్ మీడియాలలో వైరల్ అవడం ఎన్‌సీపీసీఆర్ దృష్టికి వచ్చింది. పిల్లలపై దుష్ప్రభావం చూపే ఇలాంటి అంశాలు వారి ఎదుగుదలకు తీవ్ర ముప్పని భావించిన ఎన్‌సీపీసీఆర్ రంగంలోకి దిగింది. ఇలాంటి విషయాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలని పేర్కొంటూ.. కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. మరోవైపు తల్లీ-కొడుకుకు సంబంధించిన అసభ్య వీడియోను అప్‌లోడ్ చేసినందుకు యూట్యూబ్ ఇండియా ప్రతినిధులపై ముంబై సైబర్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది.

భారత్‌లోకి 416 మంది మయన్మార్ సైనికులు

- గత రెండు నెలల్లోనే చొరబాటు: ఆర్మీ చీఫ్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 11: పొరుగు దేశమైన మయన్మార్ నుంచి గత రెండు నెలల్లో 416 మంది సైనికులు భారత్‌లోకి ప్రవేశించారు. ఈ విషయాన్ని భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే గురువారం వెల్లడించింది. మయన్మార్‌లో కొంతకాలంగా కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ మిలటరీ పాలనపై తిరుగుబాటు జరుగుతున్న విషయం తెలిసిందే. సైనిక పాలనను కూలదోసి.. ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి అక్కడి ప్రజాస్వామ్య అనుకూల తిరుగుబాటు సంస్థలు పోరాడుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి సైనికులు పారిపోయి భారత్‌లోకి చొరబడుతున్నారు. మయన్మార్‌లోని పరిణామాలను భారత సైన్యం నిశితంగా గమనిస్తోందని పాండే తెలిపారు. మనదేశంలోకి ప్రవేశించిన 416 మంది సైనికులను తిరిగి వారి స్వదేశానికి పంపినట్లు ఆయన ప్రకటించారు. కాగా, జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి, పూంచ్ ప్రాంతాల్లో ఉగ్రవాదులకు, ఉగ్రవాద కార్యకలాపాలకు సాయం చేయడంలో మన విరోధులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ఆర్మీ చీఫ్ ఆరోపించారు.

చప్పుడు చేయని సూపర్ సానిక్!

కొత్త తరం విమానం ఎక్స్-59.. రూపొందించిన నాసా, లాఖీడ్ మార్టిన్

- శబ్దాన్ని నియంత్రించే డిజైన్.. 75 డెసిబిల్స్‌కు పరిమితం
- వేగం గంటకు 1,509 కిలోమీటర్లు
- రేపు వేకువజామున 2.30కి టెస్ట్ రైడ్
- నాసా వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారం

(సెంట్రల్ డెస్క్)



కాలం గడుస్తున్న కొద్దీ మానవ సమాజం వేగం పెరుగుతోంది. గగనతల ప్రయాణాన్నే తీసుకుంటే.. హెలికాప్టర్లు వచ్చాయి.. వాటిని మించిన విమానాలు వచ్చాయి.. వాటిని తలదన్నే విధంగా ధ్వనిని మించిన వేగంతో దూసుకెళ్లే సూపర్ సానిక్‌లు కూడా వచ్చేశాయి. సూపర్ సానిక్‌లు వేగంలో రికార్డులు సృష్టించాయిగానీ.. విపరీతమైన చప్పుడుతో కొత్త సమస్యనూ తీసుకొచ్చాయి. అవి ప్రయాణించే మార్గంలో భూమ్మీద ఉన్న జనం వాటి మోత భరించలేకపోవటంతోపాటు ఇళ్లు, భవనాల కిటికీల అద్దాలు కూడా పగిలిపోయే పరిస్థితి తలెత్తింది. దీంతో సూపర్ సానిక్‌లు తాత్కాలికంగా రిటైరయ్యాయి. ప్రస్తుతం వాటిని తిరిగి రంగంలోకి తీసుకురావటానికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) సంకల్పించింది. శబ్దం సమస్యను పరిష్కరించే కొత్త విమానాన్ని సిద్ధం చేసింది. దాని పేరు ఎక్స్-59. ఈ కొత్తతరం సూపర్ సానిక్‌ను యావత్ ప్రపంచం సాక్షిగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు (భారతీయ కాలమానం ప్రకారం శనివారం తెల్లవారు జామున 2.30 గంటలకు) ప్రయోగాత్మకంగా నడపనుంది. ఇది విజయవంతమైతే విమానయాన రంగంలో మరో కొత్త అధ్యాయం మొదలవుతుంది.


2016లో ప్రాజెక్టు ప్రారంభం

2016లో 'క్వైట్ సూపర్ సానిక్ టెక్నాలజీ' (క్వెస్ట్ - QueSST) పేరుతో పెద్దగా చప్పుడు చేయని సూపర్ సానిక్ విమానాన్ని తయారుచేసే ప్రాజెక్టుకు నాసా శ్రీకారం చుట్టింది. దానిని రూపొందించే కాంట్రాక్టును అమెరికా కంపెనీ లాఖీడ్ మార్టిన్ కంపెనీకి 2018లో అప్పగించింది. ఈ కాంట్రాక్టు విలువ 24.75 కోట్ల డాలర్లు (రూ.2,056 కోట్లు) చాలా రహస్యంగా 'స్కంక్ వర్క్స్' డివిజన్‌లో విమానం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. ప్రతీ దశలో నాసాలోని పలు విభాగాలు అనేక పరీక్షలు జరిపాయి. మార్పులు చేర్పులు జరిగాయి. ఎక్స్-59గా నామకరణం చేసిన ఈ సూపర్ సానిక్ విమానం.. ఇంతకుముందటి సూపర్ సానిక్ విమానాల కన్నా సైజులో చిన్నది. దీని పొడవు 95 అడుగులు కాగా, వెడల్పు 30 అడుగులు. బరువు 14,700 కిలోలు. దీంట్లో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీకి చెందిన ఎఫ్4-14 ఇంజిన్‌ను అమర్చారు. విమానం వేగం గంటకు 1,509 కిలోమీటర్లు. సాధారణ సూపర్ సానిక్ విమానాల నుంచి వెలువడే శబ్దం (సానిక్ బూమ్) 110 డెసిబిల్స్ కాగా, ఎక్స్-59 నుంచి 75 డెసిబిల్స్ కన్నా పెద్ద శబ్దం రాదని నాసా ప్రకటించింది. శబ్దాన్ని తగ్గించటం కోసమే ప్రత్యేకంగా తయారైన ఎక్స్-59 ఆకారం కూడా సాధారణ విమానాలకు భిన్నంగా ఉంటుంది. ఎక్స్-59 ముందుభాగం సన్నగా తీగలాగా ఉంటుంది. విమానం పొడవులో దాదాపు సగం ఈ భాగమే. విమానం ముందుభాగంలో పుట్టే షాక్‌వేవ్స్, వెనక భాగంలో పుట్టే షాక్‌వేవ్స్‌తో కలిసిపోకుండా ఈ ఏర్పాటు చేశారు. ముందుభాగం సన్నగా ఉండటం వల్ల అక్కడ కాక్‌పిట్ (పైలట్ కూర్చునే చోటు) ఏర్పాటుకు అవకాశం లేదు. విమానం మధ్యలో ఈ ఏర్పాటు చేశారు. అయితే, పైలట్ ఎదుట అన్ని విమానాల్లో ఉన్నట్టుగా అద్దం ఉండదు. దానికి బదులు ఒక తెర ఉంటుంది. దానిపై విమానం ఎలా వెళ్తుందో కనిపిస్తుంది. ఇందుకోసం ఎక్స్-59 ముందు సన్నటి భాగంలో రెండు శక్తిమంతమైన కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి విమానం ముందున్న పరిస్థితులను రికార్డు చేసి ప్రత్యక్షప్రసారం చేస్తుంటాయి. ఆ దృశ్యాలను తెర మీద చూస్తూ పైలట్ విమానాన్ని నడపాల్సి ఉంటుంది. అమెరికాలో ఇప్పటికే ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల మీద ఎక్స్-59 టెస్ట్ రైడ్ జరగనుంది. దీని తర్వాత.. విమానం నుంచి వెలువడిన శబ్దం గురించి ఆయాప్రాంతాల ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారు. కారు తలుపు వేస్తే ఎంత శబ్దం వస్తుందో.. అంతకు మించిన శబ్దం ఎక్స్-59 నుంచి రాకపోవచ్చని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత వాటిని, విమానయాన రంగ నియంత్రణ సంస్థలకు (రెగ్యులేటర్లకు) నాసా అందిస్తుంది. వాటిని అధ్యయనం చేసిన అనంతరం, సూపర్ సానిక్ వాణిజ్య విమానాల మీద ప్రస్తుతం ఉన్న నిషేధాన్ని కొనసాగించాలా? వద్దా? కొత్త నిబంధనలు తీసుకురావాలా? అన్నదానిపై నియంత్రణ సంస్థలు నిర్ణయం తీసుకుంటాయి.

2035 నాటికి వినియోగంలోకి..

నాసా చేపట్టే ప్రయోగం విజయవంతం అయినా కూడా ఎక్స్-59 విమానయాన రంగంలోకి రావటానికి మరో పదేళ్లకు పైగా పట్టే అవకాశం ఉంది. 2035 నాటికి గానీ ఇది అందుబాటులోకి రాకపోవచ్చని లాఖీడ్ మార్టిన్ స్కంక్ వర్క్స్ మేనేజర్ గతంలో చెప్పటం విశేషం. ఎందుకంటే, సూపర్ సానిక్ విమానాలతో శబ్దం ఒక్కటే సమస్య కాదు.. భారీ ఎత్తున వెలువడే కర్బన ఉద్గారాలు, పెద్ద మొత్తంలో ఖర్చయ్యే ఇంధనం కూడా సవాళ్లే. ప్రస్తుతానికి నాసా వీటి మీద దృష్టి పెట్టటం లేదు. ముఖ్యమైన సమస్య అయిన శబ్దాన్ని తగ్గించిన తర్వాత మిగిలిన వాటిని పరిష్కరించే యోచనలో ఉంది. ఎక్స్-59 టెస్ట్ రైడ్‌ను నాసా ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. నాసా యాప్, వెబ్‌సైట్, స్ట్రీవింగ్ సర్వీస్‌లలో లైవ్‌ను చూడవచ్చని పేర్కొంది.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో పరిశోధనలు



ధ్వని తరంగాల వేగం గంటకు 1,235 కి.మీ.లు. దీనినే ఒక మ్యాక్ అని కూడా పిలుస్తారు. ఒక మ్యాక్‌ను మించిన వేగంతో ప్రయాణించే విమానాలను సూపర్ సానిక్ విమానాలంటారు. రెండో ప్రపంచయుద్ధ కాలంలో వీటి మీద పరిశోధనలు మొదలయ్యాయి. 1950-60ల నాటికి ఇవి ఉనికిలోకి వచ్చాయి. ప్రధానంగా సైనిక, పరిశోధన అవసరాలకు వీటిని వినియోగించారు. 1968 డిసెంబరు 31వ తేదీన తొలిసారిగా పౌర విమానయాన రంగంలోకి ఓ సూపర్ సానిక్ విమానం ప్రవేశించింది. దాని పేరు ట్యుపొలెవ్ టీయూ-144. దీనిని నాటి సోవియట్ యూనియన్ తయారు చేసింది. బ్రిటన్-ఫ్రాన్స్ సంయుక్తంగా రూపొందించిన కాంకార్డ్ అనే మరో సూపర్ సానిక్ విమానం మరుసటి ఏడాది అందుబాటులోకి వచ్చింది. శబ్ద కాలుష్యం, వాతావరణ కాలుష్యం, తయారీకి భారీ వ్యయం, విపరీతంగా ఉండే నిర్వహణ ఖర్చు మొదలైన కారణాలతో పౌరవిమానయాన రంగంలో సూపర్ సానిక్‌లు ఎక్కువ కాలంపాటు కొనసాగలేదు. 1978లో ట్యుపొలెవ్ టీయూ-144, 2003లో కాంకార్డ్ సేవలు నిలిచిపోయాయి. సూపర్ సానిక్‌ల సమస్యలను పరిష్కరించి వాటిని పౌర విమానయాన రంగంలోకి తీసుకురావటంపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయి. కాగా యుద్ధవిమానాలన్నీ సూపర్ సానిక్ విమానాలే.


హిందూమతంపై కాంగ్రెస్ వ్యతిరేకత బహిర్గతం

మోదీపైన ఆ పార్టీ నేతలకు అసూయ, ద్వేషం

ఇప్పుడు దేవుడినే వ్యతిరేకిస్తున్నారు: బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠ కార్యక్రమానికి తమ పార్టీ అగ్రనేతలు హాజరు కావడం లేదన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబట్టింది. ఇది భారతదేశ సంస్కృతి, హిందూ మతం పట్ల ఆ పార్టీకి అంతర్లీనంగా ఉన్న వ్యతిరేకతను బహిర్గతం చేసిందని ఆరోపించింది. ప్రధాని మోదీపై అసూయ, ద్వేషంతో పాటు ఆత్మన్యూనతా భావం వంటి కారణాలతో దేశాన్ని వ్యతిరేకించే స్థాయికి కాంగ్రెస్ వెళ్లిందని, ఇప్పుడు ఏకంగా దేవుడినే వ్యతిరేకిస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది ధ్వజమెత్తారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, అత్యున్నత విలువలకు అయోధ్యలోని రామమందిరం ప్రతీకగా పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్‌కు, అలాంటి భావజాలమే ఉన్న దాని మిత్రపక్షాలకు అతివాద రాజకీయాలే ముఖ్యమన్నారు. మరోవైపు కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయాన్ని కర్ణాటక సీఎం సిద్దరామయ్య సమర్థించారు. మతపరమైన కార్యక్రమాన్ని బీజేపీ నేతలు రాజకీయ వ్యవహారంగా మార్చారని ఆరోపించారు. దీనికి నిరసనగా ఆలయ ప్రతిష్ఠను నాలుగు శంకరాచార్య మఠాల పీఠాధిపతులు బహిష్కరించారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధాన్ని రాజేశాయి. హిందుత్వకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకమేనని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు సీటీ రవి మండిపడ్డారు. "సోమనాథ్ ఆలయాన్ని సర్దార్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్, కేఎం మున్షీ పునర్నిర్మించారు అప్పుడు ప్రధానిగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ, ఆ ఆలయాన్ని సందర్శించనే లేదు. అలాంటప్పుడు ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వం అయోధ్యకు ఎలా వెళ్తుంది? ముందు తమకు ఆహ్వానం అందలేదన్నారు. అది అందిన తర్వాత దానిని అంగీకరించడానికి నిరాకరిస్తున్నారు" అని రవి ధ్వజమెత్తారు.

రామమందిర ప్రతిష్ఠకు అడ్వాణీ: వీహెచ్‌పీ



రామ జన్మభూమి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ అగ్రనేత అడ్వాణీ(96) అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కానున్నారని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అలోక్ కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వస్తానని అడ్వాణీ చెప్పారని, అవసరమైతే ఆయన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తాను కూడా అయోధ్యకు రావడానికి ప్రయత్నిస్తానని పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీ చెప్పారన్నారు. రామమందిరం ట్రస్టు ఆహ్వానాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు తిరస్కరించడంపై అలోక్ స్పందించారు. ప్రధాని మోదీని ఆహ్వానించిన విధంగానే ప్రతిపక్ష నేతలకూ ఆహ్వానాలు పంపామన్నారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు అన్ని పార్టీల అధ్యక్షులనూ ఆహ్వానించామని తెలిపారు. అయోధ్యకు రావాలా, వద్దా అనే విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అలోక్ పేర్కొన్నారు.

సమస్యలా? మతమా?

(మొదటి పేజీ తరువాయి)



మాకు వచ్చే ప్రయోజనం లేదని భావించే గైర్హాజరవుతున్నాం. మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు 2017లోనే తీర్పునిచ్చింది. బీజేపీ దానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. మందిరాన్ని బీజేపీ ఎన్నికల అంశం చేస్తే.. ప్రజలు కోల్పోయిన సామాజిక, ఆర్థిక న్యాయం గురించి మేం ప్రస్తావిస్తాం" అని ఆ సీనియర్ నేత చెప్పుకొచ్చారు. మత భావోద్వేగాలను సృష్టించడం రాజ్యాంగ వ్యతిరేకమని ప్రచారం చేస్తామన్నారు. బీజేపీకి మతం తప్ప ప్రజల సమస్యలు తెలియవని చెబుతామని తెలిపారు.

ప్రజల్లో చర్చకు పెడతాం..

రామ మందిరాన్ని బీజేపీ అంశంగా చేసుకుంటే.. సమస్యల పరిష్కారం ముఖ్యమా? మతం పేరుతో మోసపోవడం ముఖ్యమా? అని ప్రజల్లో చర్చకు పెడతామని సీనియర్ తెలిపారు. మత ప్రాతిపదికన ఓటు వేసే పరిస్థితులు దేశంలో పూర్తిగా లేవని విశ్లేషించారు. ఉత్తరాదిలోని కొన్ని ప్రాంతాల్లో తప్ప మిగతాచోట్ల హిందుత్వ పేరుతో బీజేపీకి ప్రయోజనం లభించే అవకాశాలు తక్కువేనని చెప్పారు. హిందుత్వ బీజేపీ సొత్తు కాదని కూడా ప్రచారం చేస్తామని ఆయన అన్నారు. 'మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ గెలవకున్నా ఓట్లు తగ్గలేదు. ఇక్కడ బీజేపీకి గతంలో వచ్చినన్ని ఎంపీ సీట్లు ఈసారి కష్టమే. ఈసారి మైనారిటీలు ఇండియా కూటమికి సంఘటితంగా ఓటు వేస్తారు. బీసీలు, దళితులు కూడా మా వైపు మొగ్గుచూపుతున్నారు. బిహార్‌లో బలమైన ఆర్‌జేడీ, జేడీ(యూ), కాంగ్రెస్ కూటమిని దెబ్బతీయలేరు. యూపీలో ఎస్పీ, కాంగ్రెస్, బీఎస్పీ కలిస్తే బీజేపీ సీట్ల సంఖ్య గతంలో కంటే తగ్గిపోతుంది' అని చెప్పుకొచ్చారు. 'ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, గోవా తదితరచోట్ల ఆప్, కాంగ్రెస్ కలిస్తే బీజేపీ సీట్లు తగ్గుతాయి. మిత్రపక్షాల పట్ల సుహృద్భావంతో వ్యవహరిస్తున్నాం. పేచీ పెట్టకుండా కలిసి పోటీ చేసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి సీటుపై ఆచరణీయ వైఖరితో వెళ్తున్నాం. గెలుస్తామన్న ధీమా ఉన్నచోటనే వనరులను ఉపయోగిస్తాం. సాధ్యమైనంత త్వరలో మా సీట్లను నిర్ణయిస్తాం. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు పూర్తి కాగానే ఇండియా కూటమి నేతలు దేశవ్యాప్త ప్రచారం ప్రారంభిస్తారు. బీజేపీతో ముఖాముఖి, ఇతర ప్రాంతీయ పార్టీలతో పోటీ పడే 255 సీట్లపై దృష్టి కేంద్రీకరించి అందులో సగానికిపైగా గెలుచుకునేందుకు ప్రయత్నిస్తాం" అని సీనియర్ నేత తెలిపారు. కనీసం 140 స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. దక్షిణాదిన ఎంత ప్రయత్నించినా బీజేపీ గెలుపు కష్టమని.. కర్ణాటకలో పదిసీట్లు వస్తే మహా ఎక్కువని అన్నారు. తెలంగాణలో నాలుగు సీట్లను నిలబెట్టుకోలేదని, అక్కడ పోటీకి నాయకులే లేరని చెప్పారు. తమిళనాడు, కేరళలో బీజేపీ సాధించేది శూన్యమని చెప్పారు.

నిబంధనలు పాటించలేదు.. అంతా రాజకీయాలే

- రామాలయ ప్రారంభోత్సవానికి వెళ్లం: నిశ్చలానంద

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావడానికి పూరీ గోవర్ధన మఠం పీఠాధిపతి నిశ్చలానంద సరస్వతి నిరాకరించారు. ఈ కార్యక్రమంలో అవసరమైన నిబంధనలు ఏమీ పాటించలేదని పేర్కొన్నారు. రాజకీయ కోణంలో సాగుతున్న ఈ కార్యక్రమానికి తాము దూరంగా ఉంటామని ప్రకటించారు. "గర్భగుడిలో ఉండి ప్రధాని మోదీ విగ్రహాన్ని తాకుతారు. ఇందులో రాజకీయ కోణం ఉంది. రాముడి ప్రతిష్ఠను హుందాగా నిర్వహించాలి. మేము దీన్ని వ్యతిరేకించట్లేదు. అలాగని ఈ కార్యక్రమానికి హాజరు కావట్లేదు" అని స్పష్టం చేశారు. ఈ విషయంలో తన అభిప్రాయాలు మాత్రమే చెప్పానని, అంతా సజావుగా సాగాలని కోరుకుంటున్నామని నిశ్చలానంద పేర్కొన్నారు.

సరయూ నది ఒడ్డున 'రామాయణ ఆధ్యాత్మిక వనం'

- వనవాసంలో శ్రీరాముడి ప్రయాణ విశేషాలతో ప్రాజెక్టు

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్యను సందర్శించే భక్తులు నగరంలోని సరయూ నది ఒడ్డున నిర్మితమవుతున్న 'రామాయణ ఆధ్యాత్మిక వనాన్ని' సందర్శించడం ద్వారా శ్రీరాముడి 14ఏళ్ల వనవాసం గురించి మరిన్ని విశేషాలు తెలుసుకోవచ్చు. రామాయణ వైభవాన్ని ప్రదర్శించే ఓపెన్ ఎయిర్ మ్యూజియంను తలపించేలా ఈ వనం పర్యావరణహితంగా ఉండనుంది. అయోధ్య మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దీన్ని సిద్ధం చేస్తున్నారు. శ్రీరాముడు, రామాయణం, అయోధ్యతో పాటు సరయూ నది కూడా హిందూమతం నుంచి విడదీయరాని భాగమని అయోధ్య పునరాభివృద్ధి ప్రాజెక్టు చీఫ్ ప్లానర్ దిక్షు కుక్రేజా అన్నారు. నది ఒడ్డు వెంబడి ప్రతిపాదిత ఆధ్యాత్మిక వనాన్ని రామాయణం ఇతివృత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందు లో రాముడు వనవాస సమయంలో చేసిన ప్ర యాణాన్ని ప్రత్యేకంగా వివరించినట్లు తెలిపారు. ఈ వనం భక్తులతో పాటు పర్యాటకులను, ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తుందని చెప్పారు.

22న అయోధ్యకు 100 చార్టర్డ్ విమానాలు: సీఎం యోగి

రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించే జనవరి 22న సుమారు 100 వరకూ చార్టర్డ్ విమానాలు అయోధ్య విమానాశ్రయంలో ల్యాండ్ అవుతాయని భావిస్తున్నామని యూపీ సీఎం యోగి అన్నారు. గత ఏడాది డిసెంబరు 30న ప్రధాని ప్రారంభించిన మహర్షి వాల్మీకి విమానాశ్రయం సామర్థ్యానికి ఇదో పరీక్షగా పేర్కొన్నారు. రాష్ట్రానికి నాలుగో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇచ్చినందుకు మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ కుటుంబ సభ్యులకు అయోధ్య ఆహ్వానం

- జగ్జీవన్‌రాం, కాన్షీరాంల వారసులకు కూడా..
- సీఎంలలో ఒక్క యోగికి మాత్రమే

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం, కాన్షీరాంల కుటుంబ సభ్యులకు నిర్వాహకులు ఆహ్వానాలు పంపారు. ఈ నెల 22న జరగనున్న ఈ ఉత్సవానికి రావాల్సిందిగా కోరుతూ ఆహ్వానాలు పంపిన ప్రముఖుల వివరాలను విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మినహా ఏ ఇతర ముఖ్యమంత్రికీ ఆహ్వానం పంపలేదు. అన్ని పార్టీల అధ్యక్షులకు ఆహ్వానాలు పంపినా ఏ ఒక్క కేంద్ర మంత్రికిగానీ, రాష్ట్ర మంత్రికిగానీ, ఇతర రాజకీయ నాయకులకుగానీ ఇందులో చోటు దక్కలేదు. రామజన్మభూమి ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన కరసేవకుల కుటుంబ సభ్యులకు ఆహ్వానాలు అందాయి. అయోధ్యలోని అన్ని పార్టీల ప్రతినిధులను ఆహ్వానించారు.

'మునిసిపల్' రగడ

29 మునిసిపాలిటీల్లో అవిశ్వాస నోటీసులు.. వర్ధన్నపేట చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

- బెల్లంపల్లి చైర్‌పర్సన్‌పై నేడు అవిశ్వాస సమావేశం
- బీఆర్‌ఎస్‌కు 18 మంది కౌన్సిలర్ల రాజీనామా
- ఇప్పటికే ఆర్మూరు, నల్లగొండ కాంగ్రెస్ కైవసం



వరంగల్ ఆర్డీవోకు అవిశ్వాస నోటీసు అందజేస్తున్న వర్ధన్నపేట మునిసిపల్ కౌన్సిలర్లు

హైదరాబాద్/ మంచిర్యాల/ వర్ధన్నపేట/ ఖమ్మం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మునిసిపాలిటీల్లో అసమ్మతి రగడ రాజుకుంటోంది. మెజారిటీ మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఉండగా.. చాలా చోట్ల కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశ పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 142 మునిసిపాలిటీల్లో ఈ నెలాఖరుకు నాలుగేళ్ల పాలన పూర్తవుతోంది. ఇప్పటికే 29 మునిసిపాలిటీల్లో అసమ్మతి వర్గం అవిశ్వాస నోటీసులు అందజేసింది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన గత ప్రభుత్వం నాలుగేళ్ల వరకు అవిశ్వాస నోటీసులు ఇవ్వకుండా కట్టడి చేసేందుకు మునిసిపల్ చట్టసవరణ చేసి గవర్నర్ కు పంపింది. అయితే ఆ చట్టం రాజభవన్ గడప నుంచి బయటికి రాలేదు. జనవరి నెలాఖరుకు అన్నీ మునిసిపాలిటీలలో నాలుగేళ్ల పాలన ముగుస్తోంది. చైర్మన్లు, వైస్ చైర్మన్లపై చాలా చోట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసులు ఇస్తున్నారు. ఇప్పటికే ఆర్మూరు, నల్లగొండ మునిసిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సూర్యాపేట మునిసిపాలిటీలోనూ చైర్మన్, వైస్ చైర్మన్ పోకడలను వ్యతిరేకిస్తూ మెజారిటీ సభ్యులు అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని మునిసిపాలిటీల్లో అసంతృప్త కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పుర రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. చాలాచోట్ల అసంతృప్తులను బుజ్జగించేందుకు బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. మెజారిటీ కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ వైపు మొగ్గుచూపే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మూడేళ్లుగా అభివృద్ధి పనుల్లో తమను భాగస్వాములను చేయలేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు అసమ్మతితో రగిలిపోతున్నారు.

> **ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం!**
>
> బీఆర్ఎస్‌కు చెందిన ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యకు పదవీ గండం ఎదురుకాబోతోంది. ఆయన్ను పదవి నుంచి తప్పించేందుకు రంగం సిద్ధమవుతోంది. మొత్తం 13మంది డైరెక్టర్లు గాను 11మంది డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార అధికారి విజయకుమారికి గురువారం లేఖ అందించారు.

బెల్లంపల్లిలో 18 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా

బెల్లంపల్లి మునిసిపాలిటీలోనూ అసమ్మతి రగడ రాజుకుంది. మునిసిపాలిటీలో మొత్తం 34 వార్డులు ఉండగా బీఆర్ఎస్ నుంచి 22 మంది, కాంగ్రెస్ తరఫున 12 మంది గెలిచారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ గెలవడంతో అవిశ్వాసం ముప్పు తప్పించుకునేందుకు బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్ జక్కుల శ్వేత కాంగ్రెస్‌లో చేరారు. చైర్‌పర్సన్ ఒంటరిగా వెళ్లడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆమెపై అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్‌కు నోటీసు ఇచ్చారు. రెండు పార్టీల కౌన్సిలర్లు వేర్వేరుగా క్యాంపునకు వెళ్లారు. శుక్రవారం అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సమావేశానికి ఒకరోజు ముందు బీఆర్ఎస్‌కు చెందిన 18 మంది కౌన్సిలర్లు రాజీనామా చేశా రు. కాగా, చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతన్‌పల్లి మునిసిపాలిటీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వా సం పెట్టేందుకు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు.

వర్ధన్నపేటలో..

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మునిసిపాలిటీ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, వైస్ చైర్మన్ కోమండ్ల ఎలేందర్‌రెడ్డిపై 9 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. గురువారం కౌన్సిలర్లు కలెక్టరేట్‌కు చేరుకోగా కలెక్టర్ ప్రావీణ్య అందుబాటులో లేకపోవడంతో వరంగల్ ఆర్డీవో వాసుచంద్రకు అవిశ్వాసం నోటీసులను అందజేశారు. అవిశ్వాసానికి మద్దతు తెలిపిన వారిలో బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీజేపీకి చెందిన ఒక కౌన్సిలర్ ఉన్నారు. మునిసిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు.

మంచిర్యాల మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

మంచిర్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మునిసిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కలెక్టర్ ఆదేశాల మేరకు మంచిర్యాల ఆర్డీవో రాములు గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా బీఆర్ఎస్ నుంచి 26, కాంగ్రెస్ తరఫున 10 మంది గెలుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు విజయం సాధించడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 16 మంది కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 26కు చేరింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. నాలుగేళ్లపాటు చైర్మన్, వైస్ చైర్మన్లుగా పదవులు అలంకరించిన పెంట రాజయ్య, గాజుల ముకేష్‌గౌడ్ మరో సంవత్సరం కాలపరిమితి ఉండగానే పదవులు కోల్పోయారు.

26 నుంచి హైదరాబాద్ సాహిత్యోత్సవం

- సత్వ నాలెడ్జ్ సిటీ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహణ

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి సాహిత్య సమాలోచనలకు, వైవిధ్యభరితమైన చర్చలకు నిలయమైన 14వ హైదరాబాద్ సాహిత్యోత్సవాన్ని(హెచ్ఎల్ఎఫ్) ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు 'హైదరాబాద్ లిటరరీ ట్రస్ట్' ప్రతినిధులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ సాహిత్య సంబురాలకు హైటెక్‌సిటీలోని సత్వ నాలెడ్జ్ సిటీ వేదిక కానున్నట్లు గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా హెచ్ఎల్ఎఫ్ కరపత్రాన్ని తెలంగాణ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఆవిష్కరించారు. హెచ్ఎల్ఎఫ్ డైరెక్టర్ టి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది నార్వేను అతిథి దేశంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆ దేశానికి చెందిన సాహితీ దిగ్గజాలు, సామాజికవేత్తలు సాహిత్యోత్సవంలో పాల్గొంటారని చెప్పారు. అలాగే భారతీయ భాషల నుంచి 'ఒడియా' రచయితలను కూడా ఆహ్వానించామన్నారు. సాహిత్యోత్సవంలో ప్రఖ్యాత రచయిత అమిష్ త్రిపాఠి, ఎంపీ శశిథరూర్‌తోపాటు నగరంలోని ప్రఖ్యాత పరిశోధనా సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటారని తెలిపారు.

ఏసీబీకి చిక్కిన జనగామ డీఎంహెచ్‌వో

- ఫార్మసిస్ట్ వద్ద 50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

జనగామ టౌన్, జనవరి 11: ఉద్యోగం ఇస్తానని ఓ ఫార్మసిస్ట్ వద్ద రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా జనగామ జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ ప్రశాంత్ ఏసీబీకి గురువారం పట్టుబడ్డారు. ఈ ఘటనలో డీఎంహెచ్‌వో ప్రశాంత్‌తోపాటు ఆయన కార్యాలయంలో పని చేసే ఓ జూనియర్ అసిస్టెంట్‌ను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. స్రవంతి అనే యువతి 2021 నుంచి 2023 అక్టోబరు వరకు ఓబుల్‌కేశ్వాపూర్ పీహెచ్‌సీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఫార్మసిస్ట్‌గా పని చేసింది. శాశ్వత ఉద్యోగి ఆ స్థానానికి రావడంతో గత అక్టోబరులో ఆమెను విధుల నుంచి తప్పించారు. అయితే, డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి వచ్చిన పిలుపు మేరకు స్రవంతి అక్కడికి వెళ్లగా రూ.లక్ష ఇస్తే తిరిగి ఉద్యోగం వేస్తామని జూనియర్ అసిస్టెంట్ ద్వారా డీఎంహెచ్‌వో చెప్పించారు. అయితే, రూ.50 వేలు మాత్రమే ఇవ్వగలనన్న స్రవంతి వారం క్రితం డీఎంహెచ్‌వోకు ఆ మొత్తాన్ని ఇచ్చింది. కానీ పోస్టింగ్ ఇవ్వకపోవడంతో నిలదీయగా మిగిలిన రూ.50 వేలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. దీంతో స్రవంతి ఏసీబీని ఆశ్రయించగా.. అధికారుల సూచన మేరకు ఆమె రూ.50వేల నగదుతో గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లారు. డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్ సూచన మేరకు ఆ డబ్బును కార్యాలయంలోని ఓ బల్లపై పెట్టిన వెంటనే ఏసీబీ అధికారులు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

మహువాపై కేసు నమోదు చేయనున్న సీబీఐ?

న్యూఢిల్లీ, జనవరి 11: లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు బహుమతులు తీసుకున్నారన్న ఆరోపణపై అనర్హత వేటుకు గురయిన తృణమూల్ మాజీ ఎంపీ మహువా మొయిత్రాపై సీబీఐ కేసు నమోదు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే లోక్‌పాల్ ఆదేశాల మేరకు ఈ విషయమై దర్యాప్తు ప్రారంభించింది. తొలుత విచారణ చేసిన లోక్‌సభ ఎథిక్స్ కమిటీ కూడా దర్యాప్తు జరపాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో ఎథిక్స్ కమిటీ సమర్పించిన నివేదిక కాపీని తమకు ఇవ్వాలని సీబీఐ..లోక్‌సభ సెక్రటేరియట్‌ను కోరింది. దీనిపై లోక్‌సభ అధికార వర్గాలు ఇంకా స్పందించలేదు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం ముందస్తు అనుమతి తీసుకోవడంతోపాటు, ఈ నివేదిక కూడా ఉంటే లోక్‌పాల్ అంగీకారం అవసరం లేకుండానే సీబీఐ కేసు నమోదు చేయగలుగుతుంది.

జనసేనలోకి ముద్రగడ పద్మనాభం!

కాకినాడ(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైసీపీని కాదని... టీడీపీ/జనసేనల్లో ఒక పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ముద్రగడను వైసీపీలో చేర్చుకుని టికెట్ ఇవ్వాలని జగన్ భావించారు. అయితే, సిటింగ్ ఎమ్మెల్యేలను కాదని, కొత్తఇన్‌చార్జులను ప్రకటించారు. ఈ తరుణంలో జగన్‌ను కలిసేందుకు యత్నించగా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ముద్రగడ మనస్తాపానికి గురయ్యారు. దీంతో జనసేనలో చేరేందుకు నిర్ణయించారని అనుచరులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను బుజ్జగించడానికి రాజ్యసభకు పంపుతామని వైసీపీ ప్రతిపాదిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రామ మందిరంతో బీజేపీ రాజకీయం: ఏచూరి

న్యూఢిల్లీ, జనవరి 11: రామ మందిరం నిర్మాణం పేరుతో బీజేపీ నిస్సిగ్గుగా రాజకీయం చేస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. గురువారం ఎక్స్‌లో పోస్టు పెడుతూ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. మోదీ కాషాయ జెండాను పట్టుకున్న ఫొటోను బ్యాక్‌గ్రౌండ్‌లో పెట్టారు. ఏదో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేసి రామ మందిరం పనులు చేపట్టినట్టు గొప్పలు చెప్పుకొంటున్నారని ఆరోపించారు. కేవలం ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికే ప్రజల విశ్వాసాలను, మతపర మనోభావాలను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

14 సీట్లు పక్కా!

కీలక సూచనలు చేశారు. ప్రచారంతో పోల్ మేనేజ్‌మెంట్, ప్రజలతో మమేకం ఎలా అవ్వాలన్నదానిపై మార్గనిర్దేశనం చేశారు. ఎన్నికల విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కలిసికట్టుగా పనిచేసినట్లుగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలోని అన్నివర్గాలను కలుపుకొని పార్టీని బలోపేతం చేసుకుంటూ ముందుకెళ్లాలని ఆదేశించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మెజారిటీ స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సోనియాగాంధీని తెలంగాణలో పోటీ చేయాలని అభ్యర్థించినట్లు చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే లోక్‌సభ ఎన్నికలలో పునరావృతమవుతాయన్నారు. నల్లగొండ లోక్‌సభ స్థానాన్ని 3లక్షల మెజారిటీతో కాంగ్రెస్ గెలుచుకుంటుందని మంత్రి ఉత్తమ్ ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 14 సీట్లలో పార్టీకి విజయవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ 70 సీట్లలో గెలుపొందుతుందని తానే మొదట చెప్పానన్నారు. రాష్ట్రంలోని 17 సీట్లను గెలవడమే లక్ష్యంగా పనిచేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి మరిన్ని నిధులు వస్తాయన్నారు. రెండు మూడు స్థానాలకోసం బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ ఉంటుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సర్కారు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందన్నారు. దేశానికి కాంగ్రెస్ నాయకత్వం అవసరమని మంత్రి సీతక్క చెప్పారు. అదిలాబాద్‌లో కొత్త నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకుంటామన్నారు. అభ్యర్థి ఎవరైనా అధిష్ఠానం నిర్ణయం మేరకు పనిచేస్తామన్నారు. హైకమాండ్ సూచనల మేరకు లోక్‌సభ ఎన్నికల్లో ముందుకుకెళతామని మంత్రి కొండా సురేఖ చెప్పారు.

ఏపీ కోఆర్డినేటర్లతో ఖర్గే భేటీ

తెలంగాణ నేతలతో సమావేశ అనంతరం ఖర్గే ఏపీ లోక్‌సభ స్థానాల కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఏపీలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి రానుండటంతో మెజారిటీ స్థానాలలో గెలుపొందేందుకు కృషి చేయాలని ఏపీ నేతలకు ఖర్గే సూచించారు. ఏపీలో పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలతో ఏపీలో పార్టీ పుంజుకుంటోందని, షర్మిల రాకతో పరిస్థితి మరింత ఊపు వచ్చిందని నేతలు ఖర్గేకు వివరించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత తులసీరెడ్డి మాట్లాడుతూ.. కలిసొచ్చే వాళ్లతో ఆంధ్రప్రదేశ్‌లోనూ పొత్తులుంటాయని స్పష్టం చేశారు.

ఇంట్లోంచి పారిపోయి.. మూడేళ్లకు తిరిగొస్తే!

- భార్యాభర్తలు, రెండేళ్ల కూతురుపై దాడి చేసి హత్య
- అమ్మాయి కుటుంబం దారుణం.. బిహార్‌లో ఘటన



పట్నా, జనవరి 11: ఆ ప్రేమికులు ఇంట్లోంచి పారిపోయి, పెళ్లి చేసుకొని దూరంగా ఉంటున్నా పెద్దలు వదల్లేదు. రెండేళ్ల బిడ్డతో కలిసి మూడేళ్ల తర్వాత సొంతూరికి రావడంతో దారికాచి దారుణంగా హత్య చేశారు. యువ జంటను, వారి రెండేళ్ల బిడ్డను అమ్మాయి తండ్రి, సోదరుడు కలిసి రాడ్లు, ఇతర మారణాయుధాలతో కొట్టి చంపేశారు. బిహార్‌లోని నౌగాచియా గ్రామంలో ఈ ఘటన జరిగింది. మృతులు చందన్ కుమార్, ఆయన భార్య చాందిని కుమారి, వారి రెండేళ్ల కూతురు. 2021లో చందన్, చాందిని కలిసి ఇంట్లోంచి దూరంగా వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. ఇటీవల తన తండ్రికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి.. చందన్, తన భార్య చాందిని, కూతురుతో కలిసి నౌగాచియా గ్రామానికొచ్చారు. దారిలో వారిని చాందిని తండ్రి పప్పు సింగ్ అడ్డగించి ఐరన్ రాడ్డుతో దాడి చేశాడు. తర్వాత కుమారుడు ధీరజ్ కుమార్‌కు ఫోన్ చేసి పిలిపించుకున్నాడు. ఇద్దరూ కలిసి మారణాయుధాలతో దాడి చేయడంతో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. ఘటనపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కోర్టుకెక్కిన గాజాఘాతుకం

అగ్రరాజ్యాల ఒత్తిళ్ళకు లొంగి అత్యధిక దేశాలు నోరుమెదపనిస్థితిలో దక్షిణాఫ్రికా ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందే. గాజాలో ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతోందని హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో దక్షిణాఫ్రికా వేసిన పిటిషన్‌మీద గురువారం నుంచి విచారణ ఆరంభమైంది. కేసు తేలడానికి కొంతకాలం పడుతుంది కనుక, అంతలోగా ఇజ్రాయెల్ మరింతమందిని ఊచకోతకోయకుండా దాడులు తక్షణం నిలిపివేయమంటూ ఆదేశాలు ఇవ్వాలని దక్షిణాఫ్రికా కోరుతోంది. అమెరికా అండ దండిగా ఉన్న ఇజ్రాయెల్ ఐక్యరాజ్యసమితినే లెక్కచేయదు. దాని ఆధ్వర్యంలోని ఈ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని, పదిహేనుమంది న్యాయమూర్తులను అది దశాబ్దాలుగా బాయ్‌కాట్ చేసింది. అందుకు భిన్నంగా ఇప్పుడు గాజాలో తన చర్యలను సమర్థించుకోవడానికి మెరికల్లాంటి న్యాయనిపుణులను ఐసీజేలో మోహరించింది.

దక్షిణాఫ్రికా చర్యకు యాభై ఏడు దేశాలతో కూడిన ఇస్లామిక్ సహకార సమాఖ్య (ఓఐసీ) తోపాటు మన పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్ వంటివి కూడా మద్దతు ప్రకటించాయి. 1948నాటి జీనోసైడ్ కన్వెన్షన్‌ను ఇజ్రాయెల్ ఉల్లంఘించిందంటూ తమ ప్రభుత్వం చేసిన ఫిర్యాదుకు మద్దతుగా దక్షిణాఫ్రికన్లు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వివక్ష, అణచివేత, అవమానం అనుభవించినవారికే అదే పరిస్థితుల్లో ఉన్న ఇతరుల కష్టం అర్థమవుతుంది కనుక, 1948నుంచి 1994వరకూ శ్వేతజాతిపాలనలో మగ్గిన దక్షిణాఫ్రికా పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ వైఖరికి నిరసనగా రంగంలోకి దిగింది.

దాదాపు వందపేజీల ఫిర్యాదులో గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఘాతుకాలను దక్షిణాఫ్రికా వివరించింది. పాతికవేలమంది, ప్రధానంగా పసిపిల్లలు చనిపోవడం, ఇళ్ళు నేలమట్టం కాయడం, వేలాదిమంది నిర్వాసితులుగా మారడం వంటివి వివరిస్తూ ఈ తీవ్ర పరిస్థితులకు తోడుగా, లక్షలాదిమందికి ఉద్దేశపూర్వకంగా ఆహారం, నీరు, వైద్యం అందకుండా చేయడం ద్వారా ఇజ్రాయెల్ జాతి, మత ఆధారిత మారణహోమానికి పాల్పడుతున్నదని దాని వాదన. ఆస్పత్రులను నేలమట్టం చేసి గర్భిణీలకు, పిల్లలకు వైద్యం దక్కకుండా చేయడంద్వారా అది ఈ మారణకాండను ఉచ్ఛస్థితికి తీసుకుపోతున్నదని దక్షిణాఫ్రికా వాదించింది.

ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సి)కు ప్రజాదరణ అధమస్థాయిలో ఉంటూ ఈ ఏడాది ఎన్నికలకు పోబోతున్న తరుణంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా ఎన్నికల ఎత్తుగడగా దీనిని ముందుకు తెచ్చారని కొందరి అనుమానం. చైనా ఎగదోసిందన్న వాదనలూ లేకపోలేదు. కానీ, వందేళ్ళ చరిత్ర ఉన్న ఈ పార్టీ నెల్సన్‌మండేలా కాలంనుంచీ పాలస్తీనియన్ల పక్షాన నిలుస్తూ ఇజ్రాయెల్ బాంబుదాడులను, దురాక్రమణలనూ ఖండిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికా శ్వేతజాతి పాలకులకు ఇజ్రాయెల్ సహాయసహకారాలు తమ దమనకాండ మరింత బలంగా కొనసాగించేందుకు ఉపకరించాయి. ఏఎన్‌సి అధికారంలోకి వచ్చిన తరువాత పాలస్తీనాతో పూర్తిస్థాయి దౌత్యసంబంధాలు నెలకొల్పుకుంది. ఇజ్రాయెల్‌తో అనాదిగా పెద్ద స్నేహం లేకపోగా, నెతన్యాహూ యుద్ధ ప్రకటన తరువాత అది తన రాయబారులను ఉపసంహరించుకుంది. నెతన్యాహూ, ఆయన మంత్రివర్గ సహచరుల వ్యాఖ్యలు, చర్యలు జీనోసైడ్‌ను సమర్థించేట్టుగా ఉన్నందున వారిపై అరెస్టువారెంట్లు జారీచేయాలని ఐసీజేలో దక్షిణాఫ్రికా వాదన. పాతికేళ్ళక్రితం ఆక్రమిత పాలస్తీనాలో మానవహక్కుల హననం మీద ఐక్యరాజ్యసమితి నియమించిన అధ్యయన బృందం నాయకుడినే ఇప్పుడు ఐసీజేలో వాదనలు వినిపించడానికి దక్షిణాఫ్రికా ఎన్నుకుంది. అప్పట్లో ఆయన ఇజ్రాయెల్ విధానాలు ఎన్ని అంతర్జాతీయ ఒప్పందాలకు, చట్టాలను ఉల్లంఘిస్తున్నాయో సవివరంగా పేర్కొన్నందున, ఐసీజేలో బలమైన పోరాటమే జరుగుతోంది. గాజాలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న విధానాలు జాతిహననమేనని రుజువుచేయడానికి గతంలో ఐసీజే ఇచ్చిన తీర్పులను నిర్వచనాలను దక్షిణాఫ్రికా వాడుకుంటోంది. రెండురోజుల వాదనల తరువాత, తుదితీర్పు వెలువడేలోగా ఐసీజే కొద్దివారాల్లో మధ్యంతర ఆదేశాలు జారీచేయవచ్చు. ఆ ఆదేశాలు మానవహననం ఆరోపణలను ఏమాత్రం సమర్థించినా, జీనోసైడ్ కన్వెన్షన్ మీద సంతకం చేసిన దేశంగా ఇజ్రాయెల్ ఆ ఉత్తర్వులను బేఖాతరుచేసినా అంతర్జాతీయంగా మరింత పరువుపోగొట్టుకుంటుంది. యుద్ధాన్ని పూర్తిగా ఆపకపోయినా, ఇజ్రాయెల్ దూకుడుకు కళ్ళెం వేయడానికి, దానిపై మిగతాదేశాల ఒత్తిడి పెంచడానికి, గాజాకు కాస్తంత మానవసాయం అందడానికి దక్షిణాఫ్రికా వేసిన ఈ కేసు

నెహ్రూ భావదీప్తి, 'అయోధ్య' ప్రశ్నలు



> లౌకికవాదం గురించిన తన దార్శనికతను జవహర్ లాల్ నెహ్రూ 1960లో ఇలా స్పష్టీకరించారు: 'లౌకికవాదం అంటే మతానికి పూర్తిగా వ్యతిరేకమైనదిగా కొంతమంది భావిస్తున్నారు. ఆ భావన ఎంతమాత్రం సమంజసమైనది కాదు. అన్ని మతాలను సమానంగా గౌరవించి ఆ మతాల వారందరికీ సమస్థాయి అవకాశాలు కల్పించడమే లౌకికవాదం. అదే దాని గుణశీలత, అదే దాని సార్థకత'. ఈ సమున్నత ఆదర్శానికి, మన గణతంత్ర రాజ్యప్రాథమిక సూత్రానికి తాము మనసా వాచా కర్మణా కట్టుబడి ఉన్నామని ఏ రాజకీయ పార్టీ అయినా నిశ్చితంగా చెప్పగలదా?



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'బాబ్రీ మసీద్‌ను కూల్చి వేసింది శివసైనికులు. 17 నిమిషాల వ్యవధిలో ఆ పనిని పూర్తి చేశారు. అక్కడే ఉన్న భారతీయ జనతా పార్టీ వారు తమ కర్తవ్యాన్ని దాదాపుగా విడిచిపెట్టారు. పైగా ఆ కర్మభూమికి దూరంగా వెళ్లిపోవడమూ జరిగింది. శివసైనికులు మాత్రమే ధైర్యంగా నిలబడి, తెగువతో వ్యవహరించి లక్ష్యాన్ని సాధించారు. అవును, అయోధ్యలో రామమందిరం మా సృష్టి ...' శివసేన ఎంపీ, అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ ఇటీవల ఒక పత్రికా గోష్ఠిలో ఉద్ఘాటించారు. డిసెంబర్ 1992, జనవరి 2024 సంవత్సరాల మధ్య భారత రాజకీయాలు ఎంతదూరం ప్రయాణించాయో రౌత్ వ్యాఖ్యలు చెప్పకనే చెప్పాయి.

ఆనాడు అంటే 1992లో బీజేపీ, శివసేనలు కుశ లవులుగా ఉండేవి కదా. నేడు ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన మహారాష్ట్రలో 'మహా వికాస్ అఘాడి' సంకీర్ణంలో ఒక భాగస్వామిగా ఉన్నది. కాంగ్రెస్ సైతం ఆ కూటమి లోనే ఉన్నది. అయోధ్య వివాదంపై శివసేన నాటి నుంచీ నేటి వరకూ ఒకే దృఢ వైఖరితో వ్యవహరిస్తూ వస్తోంది. సందేహం లేదు. 1992లో శివసేన సర్వాధినేత బాల్ ఠాక్రే సగర్వంగా ఇలా చెప్పుకున్నారు: 'మా కుర్రాళ్లే అయోధ్యలో ఆ పనిని పూర్తి చేశారు.' మరి లౌకికవాదమే తమ విధానమని చెప్పుకునే రాజకీయ పక్షాలు ఎలా వ్యవహరించాయి? నైతిక సందిగ్ధతకు గురయ్యాయి. అనైతికంగా రాజీ పడ్డాయి. జాతీయవాదానికి మతపరమైన భాష్యాలకు లొంగిపోయాయి. ఇది రాజీ పడడం కాక మరేమిటి? లౌకికవాద పార్టీల ఇటువంటి నికృష్ట ప్రవర్తన కారణంగానే రాజకీయ హిందూత్వ తిరుగులేని రీతిలో ప్రజల మనసులలోకి, హృదయాలలోకి పురోగమించింది. ఇదెంత విడ్డూరమో అంతకంటే అధికంగా అసంగతం.

ఆ అయోధ్య వ్యవహారం మూడు దశాబ్దాల అనంతరం కూడా దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తోంది. ఇది సార్వత్రిక ఎన్నికల సంవత్సరం. మరి కొద్ది రోజుల్లో అయోధ్యలో అద్వితీయంగా నిర్మించిన రామమందిరానికి ప్రాణప్రతిష్ఠ జరగనున్నది. ఈ మహద్ఘటనను ఆధారంగా చేసుకుని ఎన్నికలలో చరిత్రాత్మక విజయం సాధించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృత నిశ్చయంతో వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రస్తుత రాజకీయమంతా అదే లక్ష్యంతో సాగుతున్నది. మరి ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ తన వైఖరి ఏమిటో సుస్పష్టంగా ఎందుకు వ్యక్తం చేయలేకపోతోంది? మన దేశంలో అపూర్వ టెలి కమ్యూనికేషన్స్ విప్లవానికి ప్రధాన కారకుడు, కాంగ్రెస్ పార్టీ అంతర్జాతీయ విభాగానికి అధిపతి అయిన శామ్ పిట్రోడా ఇటీవల ఒక ప్రాసంగిక ప్రశ్న వేశారు: 'ఇప్పుడు మన ప్రజలకు అత్యవసరమయింది రామ మందిరమా? లేక నిరుద్యోగిత, ద్రవ్యోల్బణ సమస్యల పరిష్కారమా?'. చాలా ఉపయుక్తమైన ప్రశ్న, సందేహం లేదు. అయితే కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం వెన్వెంటనే ఈ వ్యాఖ్యలకు తనకు తానుగా దూరం జరిగింది. ఆ వ్యాఖ్యలు శ్యామ్ పిట్రోడా వ్యక్తిగత అభిప్రాయాలే కాని, పార్టీ దృక్పథాన్ని ప్రతిబింబించేవి కావని' ఏఐసీసీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. రామ మందిరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా అందుతున్న ఆహ్వానాలను ఆమోదించే విషయంలో కూడా కాంగ్రెస్ నాయకత్వం ఊగిసలాట వైఖరినే ప్రదర్శిస్తోంది. రెండు అవాంఛనీయ ప్రత్యామ్నాయాల మధ్య చిక్కుకుంది.

నవ భారత నిర్మాత జవహర్ లాల్ నెహ్రూ నిర్దేశించిన లౌకికవాద పథంలో దశాబ్దాల పాటు మున్ముందుకు సుస్థిరంగా ప్రస్థానించిన కాంగ్రెస్‌లో ఇప్పుడు రామ మందిరం ప్రారంభోత్సవానికి అందిన ఆహ్వానాలపై ఎందుకు అయోమయంలో కొట్టుమిట్టాడుతోంది? అంగీకరిస్తే లౌకికవాద నిబద్ధత ఏమయ్యేట్టు? తిరస్కరిస్తే 'హిందూ వ్యతిరేక పార్టీ'గా కాంగ్రెస్‌పై ధ్వజమెత్తేందుకు ప్రత్యర్థిపక్షాలు ఒక క్షణమూ సంకోచించవు. ప్రజాభిప్రాయాన్ని హిందూత్వ శక్తులు ఎంతగా ప్రభావితం చేస్తున్నాయో కాంగ్రెస్ సందిగ్ధ పరిస్థితి స్పష్టం చేస్తోంది.

మత ప్రమేయ రాజకీయాలు, ముఖ్యంగా హిందూత్వ శక్తుల సవాళ్లను కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ఎదుర్కొంటూ వస్తోంది. అయితే ఆ రాజకీయ ప్రతిస్పందనలలో ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన, అదీ హింసాత్మకంగా వస్తుందేమోనన్న భయం కాంగ్రెస్ ప్రతిస్పందనలను సదా ఆవరించి ఉండటం ఒక కొట్టివేయలేని వాస్తవం. 1980 వ దశకం రాజకీయ పరిణామాలను ఒకసారి అవలోకించండి. ఇందిర, రాజీవ్ లిరువురూ అటు లౌకికవాద, ఇటు మతవాద శక్తులు రెండింటితోనూ సరిసమానంగా వ్యవహరించడానికే ప్రయత్నించారన్న విషయం స్పష్టమవుతుంది. ఆ ఇరువురి సారథ్యంలోని ప్రభుత్వాల విధానాలనూ ఆ వైఖరే ప్రభావితం చేసింది. బాబ్రీ మసీద్ ద్వారాలను తెరువడం, ఆ వివాదాస్పద స్థలం వద్ద శిలాన్యాస్‌కు అనుమతించడం హిందూ బృందాలను బుజ్జగించడానికి కాగా, షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టడం, 'శాటానిక్ వర్సెస్'పై నిషేధం విధించడం ముస్లిం మత ఛాందసవాదులను సంతృప్తపరచడానికే అనడంలో సందేహం లేదు. ఓటు బ్యాంకులను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఇటువంటి రాజకీయ నిర్ణయాలు బహుళ మతాలకు ఆలవాలంగా ఉన్న భారతీయ సమాజంలో నిజమైన లౌకికవాద ప్రభావాలను బలహీనపరిచాయి. అసలు లౌకికవాదం పట్ల ప్రజల్లో తిరస్కారభావాన్ని పెంపొందించడానికే ఆ రాజకీయ సంకోచాలు ఎంతైనా తోడ్పడ్డాయి.

1992 డిసెంబర్‌లో దేశం నలుమూలల నుంచీ లక్షలాది కరసేవకులు అయోధ్యకు తరలి వచ్చినప్పుడు ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ప్రభుత్వం వ్యవహరించిన తీరునూ అటువంటి భయమే ప్రభావితం చేసిందనడంలో సందేహం లేదు. అయోధ్యలోని వివాదాస్పద కట్టడాన్ని పరిరక్షించడం నరసింహారావు ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. అయినా కరసేవకుల వెల్లువను ప్రభుత్వం ఉపేక్షించింది. ఫలితంగానే బాబ్రీ మసీద్‌ను ప్రభుత్వం రక్షించలేక పోయింది. దరిమిలా చెలరేగిన మత ఘర్షణల్లో వందలాది అమాయకుల ఊచకోతలు సంభవించాయి. ప్రభుత్వం దృఢసంకల్పంతో వ్యవహరిస్తే అలా జరిగేదేనా? ఇక ఇటీవలి సంవత్సరాలలో కాంగ్రెస్ నాయకులు నుదుట బొట్టు పెట్టుకుని మరీ తాము నిష్ఠాగరిష్ఠులమైన హిందువులమని చాటుకుంటున్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతీచోటా రాహుల్ గాంధీ విధిగా దేవాలయాలను సందర్శిస్తున్నారు. ఆలయాలలో పూజలు నిర్వహిస్తున్నారు. తాను శివభక్తుడినని, జంధ్యం ధరించిన హిందువునని రాహుల్ అనేక విధాలుగా చెప్పుకుంటున్నాడు.

కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒక కచ్చితమైన నిబద్ధతతో లౌకికవాద విధానాలను అమలుపరచకపోవడం వల్లే ఇప్పుడు ఆ పార్టీ ఆ భావజాలం విషయంలో తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొంటోంది. ప్రత్యర్థి పక్షానిదే అన్ని విధాల పైచేయిగా ఉన్నది. కనుకనే కాంగ్రెస్ ముస్లిం అనుకూల పార్టీ అని ప్రజలు విశ్వసించేలా చేయడంలో బీజేపీ సఫలమయిందని ఐదేళ్ల క్రితమే పార్టీ అధినేత్రి సోనియా గాంధీ అంగీకరించక తప్పలేదు. హిందీ రాష్ట్రాలకు చెందిన 'లౌకికవాద' మండల్ యోధులు రాజ్యాంగ విలువలకు చిత్తశుద్ధితో కట్టుబడి లేకపోవడం వల్లే వారిని 'ముస్లిం అనుకూలురు'గా హిందూత్వ వాదులు చిత్రించగలుగుతున్నారు. ఈ విషయమై తమపై వస్తున్న ఆరోపణలకు 'మండల్' యోధులు సరైన సమాధానమివ్వలేకపోతున్నారు.

నిజమైన లౌకిక వ్యవస్థ అన్ని మతాల వారినీ సమభావంతో చూస్తుంది. ఎటువంటి మతపరమైన వివక్ష లేకుండా ప్రతీ ఒక్కరికీ న్యాయాన్ని సమకూరుస్తుంది. బాబ్రీ మసీద్ కూల్చివేత, సుప్రీంకోర్టు మాటల్లో 'నేరపూరిత చర్య'. ఆ దురాగతానికి కారకులయిన వారిపై, 1993 ముంబై పేలుళ్ల కేసులో నిందితులపై జరిగిన విధంగా శీఘ్రగతిన విచారణ ఎందుకు జరపలేదు? ఇది ప్రశ్నించవలసిన విషయం. యదార్థ లౌకికవాద సమాజం బహుళత్వవాదానికి నిబద్ధమై ఉండాలి. అని మతాల వారిని సమభావంతో ఆదరించాలి. సహన భావంతో వ్యవహరించాలి. ఓటు బ్యాంకులకు ప్రాధాన్యమిచ్చే మెజారిటీవాద రాజకీయాలను త్యజించాలి. పాలనా విధానాలు, పద్ధతులపై మత ప్రభావం ఉండకూడదు. ఏ ఒక్క మత పరమైన అస్తిత్వానికి అధిక ప్రాధాన్యమివ్వకూడదు. మత పరమైన గుర్తింపు రాజకీయాలు చేసే నేతలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి.

లౌకికవాదం గురించిన తన దార్శనికతను జవహర్ లాల్ నెహ్రూ 1960లో ఇలా స్పష్టీకరించారు: 'భారత్‌లో మత ప్రమేయం లేని ఒక రాజ్య (సెక్యులర్ స్టేట్) వ్యవస్థను పరిపూర్ణంగా, పటిష్ఠంగా నిర్మించుకోవడం గురించి మనం తర్జన భర్జన పడుతున్నాం. 'సెక్యులర్' అనే ఆంగ్ల పదానికి హిందీ భాషలో సరైన, కచ్చితమైన మాటను కనుగొనడం కూడా బహుశా, అంత సులువైన విషయం కాదు. లౌకికవాదం అంటే మతానికి పూర్తిగా వ్యతిరేకమైనదిగా కొంతమంది భావిస్తున్నారు. ఆ భావన ఎంతమాత్రం సమంజసమైనది కాదు. అన్ని మతాలను సమానంగా గౌరవించి, ఆదరించి, ఎటువంటి మినహాయింపు లేకుండా వాటన్నిటికీ సమస్థాయి అవకాశాలు కల్పించడమే లౌకికవాదం. అదే దాని గుణశీలత, అదే దాని సార్థకత'. ఈ సమున్నత ఆదర్శానికి, మన గణతంత్ర రాజ్య ప్రాథమిక సూత్రానికి తాము మనసా వాచా కర్మణా కట్టుబడి ఉన్నామని, ప్రజా జీవితంలో ఆ స్ఫూర్తి సంపూర్ణంగా విలసిల్లేందుకు నిబద్ధమై ఉన్నామని ఏ రాజకీయ పార్టీ అయినా నిశ్చితంగా చెప్పగలదా? అటువంటి నైతిక సమున్నతితో వ్యవహరించే రాజకీయపక్షాలు ఒకటికి మించి ఉన్నప్పుడు మాత్రమే మన ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్య భవిష్యత్తుకు భరోసా సమకూరుతుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రాజకీయ వ్యంగ్యంలో రాటుదేలిన కలం

ఎన్నికలు వచ్చినప్పుడు కొందరు కవులు ప్రత్యేకంగా ఆనాటి రాజకీయ కదలికల్ని, నేతల విన్యాసాల్ని ఉద్దేశించి రన్నింగ్ కామెంట్రీలు రాస్తుంటారు. అవన్నీ ఒకేలా ఉరకలెత్తవు. అలిశెట్టి ప్రభాకర్ చనిపోయి 30 ఏండ్లయినా ఆయన చేసిన పొలిటికల్ కామెంట్రీ మాత్రం ఇప్పటికీ రన్ అవుతూనే ఉంది. దానికి కారణం ఆయన కలమెప్పుడూ నేతల వెనుకాలే పడేది. ప్రజల బతుకులెప్పుడూ పాలకుల నిజాయితీపైనే ఆధారపడి ఉంటాయని భావించి తన అక్షరాల్ని ఎక్కువగా అటువైపే సంధించాడు. అందుకే ఎలక్షన్లు వచ్చాయంటే చాలు పదును తగ్గని ప్రభాకర్ పదాలు మళ్ళీ మళ్ళీ వినపడుతుంటాయి.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పత్రికల్లో, సోషల్ మీడియాలో ఆయన కవితా పంక్తులు విరివిగా కనబడ్డాయి: "అయిదేళ్లకొకసారి/ అసెంబ్లీలో మొసళ్ళు ప్రవేశించడం/ పెద్ద విశేషం కాదు/ జనమే ఓట్ల జలాశయాలై/ వాటిని బతికించడం విషాదం", "పాత ప్రభుత్వాల్లో/ చితికిపోయిన ప్రజలు/ కొత్త ప్రభుత్వాల్లో/ 'చితి'కి పోకుంటే చాలు" అనేవి ఎన్నికల సమయంలో చక్కర్లు కొట్టిన వాటిలో మచ్చుకు కొన్ని. ఈ పంక్తులను చూస్తుంటే ఆయన మనతో పాటే ఉండి వర్తమాన రాజకీయాలను పరిశీలిస్తున్నట్లుగానే అనిపిస్తుంది. అలిశెట్టి కవిత్వంలోని ప్రాసంగికత గురించి చాల చోట్ల ప్రస్తావన వచ్చింది. నిజానికి ప్రాసంగికత అంటే కవి రాసిన నాటి కాలపు పరిస్థితులు తర్వాతి కాలంలో మారకపోవడమే. ఎవరి రచననైనా ప్రాసంగికత కోల్పోయేలా చేయడమే నిజమైన సామాజిక అభివృద్ధి. కాని ఆ వృద్ధి, మార్పు సాధ్యపడటం లేదు. "తల్లిదండ్రులయందు దయలేని పుత్రుండు.." అని వేమన వందల ఏళ్ల క్రితమే రాశాడు. మనం మారక ఇలాంటి కవుల రాతల ప్రాసంగికతను ఎప్పటికీ కాపాడుతూ ఉన్నాం.



అలిశెట్టి కవిత్వంలో 'తిరుగబడు', 'కూలదోయి' లాంటి విధ్వంసక, హింసాప్రేరక పదజాలం ఉండకుండా ఒక నూతన నిర్మాణాత్మకత కనబడుతుంది. 'సమాజం ఇలా ఉంది, ముందు దీన్ని అర్థం చేసుకో' అన్నట్లుగా ఆయన అక్షరాలుంటాయి. ఈ ఓట్లు, ఎన్నికలు, గెలిచిన నేతలు, మారిన ముఖాలతో సమాజం మారదు అనే చైతన్యాన్ని అవి నూరి పోస్తాయి.

అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం రాసిన రెండు దశాబ్దాలు (1973–93) తెలుగు నేలపై చైతన్య ప్రవాహాలు ఉరకలెత్తాయి. విప్లవ పార్టీలు రాజ్యంతో ఢీకొన్న రోజులవి. తెలంగాణలో పచ్చగా కొనసాగిన పలు విప్లవ గ్రూపుల్లో ఏదో ఒక పక్షం వహించడం ఆనాటి యువత లక్షణంగా మారింది. జగిత్యాల జైత్రయాత్ర కన్న కవిగా అలిశెట్టి తన భావజాలం వైపే నిలిచాడు. దాన్ని నిలబెట్టేందుకే కవిత్వం రాశాడు. అయితే అలిశెట్టి కవిత్వంలో 'తిరుగబడు', 'కూలదోయి' లాంటి విధ్వంసక, హింసా ప్రేరక పదజాలం ఉండకుండా ఒక నూతన నిర్మాణాత్మకత కనబడుతుంది. సమాజం ఇలా ఉంది, ముందు దీన్ని అర్థం చేసుకో అన్నట్లుగా ఆయన అక్షరాలుంటాయి. ఈ ఓట్లు, ఎన్నికలు, గెలిచిన నేతలు, మారిన ముఖాలతో సమాజం మారదు అనే చైతన్యాన్ని అవి నూరి పోస్తాయి. అందుకోసం అనుక్షణం తన కవిత్వం ద్వారా ఆయన పాలకులను, పాలనా విధానాలను సూటిగా ఎదుర్కొన్నాడు. నేతల మాటల్లోని డొల్లతనాన్ని విప్పి చెప్పాడు. దీని కోసం తీవ్రమైన వ్యంగ్యాన్ని ఆశ్రయించాడు. ఆయన రాసేకాలంలో కాంగ్రెస్, టీడీపీ ఆంధ్రప్రదేశ్‌ను పాలించాయి. నిలకడగా లేని రాజకీయ నాయకులను "వాడు ముందే వానపాము/ మరి ముడ్డెటో మూతెటో" అని సిగ్గు తీశాడు. "జలగలూ' 'బ్రహ్మ'జెముళ్ళు/ అవకాశవాది 'రూలుకర్రా'/ 'ఆరణాల కూలి'/ పునాది లేని 'భవనం' నాచారం 'సన్యాసులు'/ వరుసగా ఎవరెవరు ముఖ్యమంత్రులైనా/ అక్షరాలా అరాచకంలో మార్పుండదు" అని రాశాడు. ఈ చురకలకు ఉడుక్కున్న పాలకపెద్దలు ఆయన సంగతేందో చూడమని లాఠీని ఉసిగొల్పారు. కమిషనర్ స్థాయి అధికారి పిలిపించి ఇలా రాస్తే ఊర్కొనేది లేదన్నాడు. అప్పటికే కరీంనగర్‌లో ఆయన ఒళ్ళు ఈ రుచి చూసింది. ప్రభాకర్ బెదరలేదు, తన తీరు ఏమాత్రం మార్చుకోలేదు.

ఈ రాజకీయ నాయకుల దుర్నీతి వల్లే ప్రజల బతుకులిలా ఉన్నాయి. వీరంతా ఒకే రకమైన నేపథ్యం, ఒకే దురాలోచన కలవారే, మాయమాటలు చెప్పి అధికారాన్ని పొంది తమ వర్గానికి దేశ సంపదని దోచిపెట్టేవారే అనేది ప్రభాకర్ ప్రగాఢ విశ్వాసం. ఆయన నమ్మకాన్ని ఏ ప్రభుత్వం తప్పని నిరూపించలేదు. తన విశ్వాసాన్ని వదిలి ప్రభాకర్ ఎవరికీ జై కొట్టలేదు. బతికినంతకాలం పాలకుల దోపిడి విధానాన్ని ఎండగడుతూ ఓటర్లకు జాగ్రత్తలు చెప్పాడు. సాయుధ పోరాట మార్గమే ఈ పాలనను అంతం చేస్తుందని వ్యక్తిగతంగా నమ్మిన ప్రభాకర్ కవిత్వంలో మాత్రం విప్లవపంథా వైపు వెళ్ళమని ఏకపక్షంగా ఉద్బోధించలేదు. వర్గ స్వభావాన్ని తన అక్షరాల్లో సుస్పష్టంగా విశదీకరిస్తూ, పరిస్థితుల మార్పుకు ఘర్షణే మార్గమని సూచిస్తూ పోరాట రూపాన్ని మాత్రం ఎవరి శక్తిని బట్టి వారే నిర్ణయించుకోడానికి అవకాశం ఇచ్చాడు.

రాజకీయ పదవులు అందుకొనేవారిపై ప్రభాకర్‌కు పూర్తిస్థాయి స్పష్టత ఉంది. ఒక మనిషి రాజకీయ నాయకుడిగా ఎలా ఎదుగుతాడో 'దశలవారీగా ఇలా వివరించాడు. "ఇదివరకు/ సమాజ శరీరం మీద చీరుకుపోయే/ చిన్న రౌడీ 'బ్లేడు'/ ఇవాళ/ ఇంటింటికీ చేతులు జోడించి/ ఎన్నికల్లో మెరిసిన ఎమ్మెల్యే 'కత్తి'/ రేపు/ అరాచకీయాల్లో ఆరితేరి/ కాగల మంత్రి 'గండ్ర గొడ్డలి" అని. ఈ మాటల్లో నిజమెంత ఉందో మనకు తెలిసిన నాయకుడి ఎవరి చరిత్రయినా పరిశీలిస్తే తెలుస్తుంది.

ఈ దేశంలోని ప్రజాస్వామ్యానికి ఆయన ఇచ్చిన కవితారూపం ఇలా ఉంది. "స్వయంగా శవాలే/ రాబందుల వద్దకి/ నడిచొస్తుంటే/ అంతకంతకూ/ పెరుగుతున్న/ అజ్ఞానపర్వతం/ చిన్న బ్యాలెట్ పెట్టెలో ఇమిడిపోతే/ మళ్ళీ/ కోటీశ్వరుడి పుట్టలోంచి/ బుసకొట్టేదే/ ఈ దేశపు 'ప్రజాస్వామ్యం" అన్నాడు. పీక్కు తినండి అని దేశాన్ని ఓటర్లే అప్పగిస్తున్నారనే వేదన ఇందులో ఉంది. ప్రజల ఆశలను, ఆకాంక్షలను నిజం చేయని చట్టసభలను "సగటు మనిషి ఓట్ల విత్తనాలు/ మొలకెత్తని బంజరు భూములు" అన్నాడు. ప్రజల సొమ్ము పాలకులకు ఎంత అందుబాటులో ఉందో చెప్పడానికి "కాసుకో కోసుకో రాజకీయమా/ ప్రజలు పనస తొనలు మీరు కత్తిమొనలు" అని రాశాడు.

ఓటరులో విచక్షణ కోరుతూ "పార్టీ ప్రచారాల/ నిలువెత్తు అలల/ సంద్రంలో ఓటు/ ఊగిసలాడే బోటు" అని, "గుర్తుంచుకో/ మనమేసే ఓటే వాడికి ఆక్సిజన్ లేదా.. ఆక్సిడెంట్" అని జాగ్రత్తలు చెప్పాడు. ఓట్ల ద్వారా మారని ప్రభుత్వాల వైఖరిని ఉద్దేశించి "ఉండబట్టలేక/ ఓటేస్తే/ ఉన్నబట్టా/ లాక్కున్నట్లు.." అన్నాడు. పాలకులను పిల్లలకు పాలిచ్చే తల్లులతో గొప్పగా పోల్చుతూ "పాలిచ్చే తల్లే/ పీక నులుముతోతే/ పాపకి దిక్కెవరు/ పాలించే ప్రభువే/ పీడిస్తూ పోతే/ ప్రజలకు చుక్కెదురు" అని మాతృత్వ గుణాన్ని చెప్పాడు. చివరకు "రైళ్లయినా/ రాజకీయాలైనా/ పట్టాలు తప్పితే/ ఎప్పుడూ/ జనానికే/ జీవన్మరణ సమస్య" అనేది అసలు సత్యం. రోజులు మారాయి, రైతు బాగున్నాడు, ఆడవారికి రక్షణ ఉంది, యువత ఉద్యోగాలకు కొరత లేదు అని జనం ఒప్పుకొనే దాకా అలిశెట్టి అక్షరం 'చివరి చరణం' కాబోదు.

■ బి. నర్సన్

(నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి)

గుంటూరును ముంచెత్తిన మరాఠీ ఆధిపత్యం!

పదవులు, ఉద్యోగాలు, సంపదలో అనుచిత ఆధిక్యతలు పదునైన భావజాలాన్ని సృష్టిస్తాయి. ఒకనాటి ఉమ్మడి మద్రాసు, మహారాష్ట్ర చరిత్రలే ఇందుకు ఉదాహరణలు. బ్రాహ్మణ వ్యతిరేక భావజాలం అందుకే అక్కడ ఊపిరిపోసుకున్నది. గుంటూరు జిల్లా చరిత్ర చెబుతున్న నిజం అదే. ఆ ఆధిక్యతలు సడలుతున్న క్రమంలో ఆ భావజాల తీవ్రత కూడా క్రమేపీ తగ్గిపోయింది.



■ రాహుల్ కుమార్



కొన్ని రకాల సామాజిక ఆలోచనలు ఒక పట్టాన అంతరించిపోవు. కఠోర వాస్తవాల నుంచి పుట్టిన వాటి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. ఏదోరకంగా అవి కొనసాగుతూనే ఉంటాయి. మనుషుల మధ్య ఆర్థిక, సామాజిక తారతమ్యాలను వివరించటానికే సామాజిక సిద్ధాంతాలన్నీ పుట్టుకొచ్చాయి. కొన్ని వాటిని సహజమైనవిగా భావించాయి. మరికొన్ని వాటిని తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇంకొన్ని మధ్యేమార్గాన్ని చూపించాయి. ఎంతో కొంత స్థాయిలో అసమానతలు ఉండటం సహజమని చెప్పటమే మధ్యే మార్గం ప్రధాన ఉద్దేశం. పేర్లు ఎనె[illegible] ఉండొచ్చు. చెప్పే రీతుల్లో తేడాలుండొచ్చు. కానీ తరచి చూస్తే అన్నీ సిద్ధాంతాలూ ఈ మూడు విభాగాల్లోనే ఇమిడిపోతాయి. మనందరికీ బాగా తెలిసిన కర్మ సిద్ధాంతం కూడా ప్రధానంగా అసమానతలను వివరించేదే. భారతదేశం అంటేనే విశిష్టతలకు నిలయం. అట్లాంటి విశిష్టతల్లో మన కుల వ్యవస్థ కూడా ఒకటి. ప్రతి కులానికి ఒక హోదాను ఇచ్చి మనుషులను అనేక స్థాయిల్లో నిలబెట్టిన వ్యవస్థ ప్రపంచంలో మరొకటి లేదు. విశిష్టతలు ఉన్న వ్యవస్థను వ్యతిరేకించే సిద్ధాంతాలు కూడా విశిష్టంగానే ఉంటాయి. బ్రాహ్మణ ఆధిపత్య వ్యతిరేకత ఇందులో ఒకటి. ఒకనాడు ఈ ఆధిపత్యాన్ని వ్యతిరేకించటానికి పార్టీలే పుట్టుకొచ్చాయి. వందేళ్ల క్రితం మద్రాస్ రాష్ట్రంలో పుట్టిన జస్టిస్ పార్టీకి ఈ వ్యతిరేకతే పునాది. మహారాష్ట్రలో సామాజిక సంస్కరణల కోసం ఎంతో శ్రమించిన జ్యోతిరావు పూలేను నడిపించింది ఈ వ్యతిరేకతే. అంబేడ్కర్‌ది కూడా ప్రధానంగా అదే దోవ. మతపరంగా పూజాపునస్కారాలను నిర్వహించే వర్గం మీద ఇంత వ్యతిరేకత ఎందుకన్న ప్రశ్న వస్తుంది. కానీ ఈ వ్యతిరేకత దానివల్లే వచ్చిందని చెప్పలేం. ఆ వర్గం ఒకనాడు ఆర్థిక, పరిపాలన రంగాలపై చలాయించిన ఆధిపత్యానికి వ్యతిరేకంగా అది వచ్చింది. ఆ ఆధిపత్యం ఎలా ఉండేదో నిర్దిష్టంగా తెలుసుకోటానికి చాలా పరిశోధనలు జరిగాయి. ఒకనాటి గుంటూరు జిల్లాలో ఆ ఆధిపత్య రీతులను వివరించే రచనను ఇందులో ప్రధానమైందిగా చెప్పుకోవచ్చు. రాబట్ ఎరిక్ ఫ్రికన్‌బర్గ్ 1961లో లండన్ యూనివర్సిటీకి సమర్పించిన సిద్ధాంత వ్యాసం కోసం పరిశోధన చేపట్టి దాన్ని రాశారు. ఆ తర్వాత పుస్తకంగానూ ప్రకటించారు. 1788 నుంచి 1848 వరకూ గుంటూరు జిల్లాలో బ్రిటిషు పాలకులకు, అక్కడున్న స్థానిక ప్రాబల్యవర్గాల మధ్య సంబంధాలనూ సంఘర్షణలనూ వివరిస్తూ చాలా సమాచారాన్ని ఇచ్చారు.

గుంటూరు జిల్లాపై బ్రిటిషు ఆధిపత్యం 1788లో మొదలైంది. అప్పటికి భూమి శిస్తే ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం. దీన్ని రాబట్టే పాలనా యంత్రాంగమే ఆనాడు కీలకం. అయితే దీనిపై పట్టు అంతా బ్రాహ్మణుల చేతుల్లో ఉండేది. అంటే కలెక్టరు ఆఫీసు నుంచి గ్రామస్థాయి వరకూ బ్రాహ్మణులదే ఆధిపత్యం. విచిత్రం ఏమిటంటే ఆ ఆధిపత్యంలో ప్రధాన పాత్ర మహారాష్ట్రకు చెందిన దేశస్థ బ్రాహ్మణులది. వీరిని కాదని నిర్ణయాలు తీసుకునే సాహసం బ్రిటిషు అధికారులకు ఉండేది కాదు. రెవిన్యూ రికార్డులన్నీ వీరి చేతుల్లో ఉండేవి. మరాఠీ భాషలో వీటిని రాసేవారు. తెలుగు, ఇంగ్లిషులో కూడా రాసినా కీలక విషయాలన్నీ మరాఠీలోనే ఉంచేవారు. గుంటూరులోనే గాక తమిళ జిల్లాల్లోనూ వీళ్ల ఆధిపత్యమే కొనసాగేది. ఆ రోజుల్లో ముఖ్య శిరస్తాదార్ అనే పదవి ఉండేది. కలెక్టరు పదవి తర్వాత అదే కీలకమైంది. అన్ని విభాగాలూ శిరస్తాదార్ ఆధిపత్యం కిందే ఉండేవి. ఆ తర్వాత స్థానం నాయబ్ (డిప్యూటీ) శిరస్తాదార్‌ది. ఇక తాలూకాల్లో తహశీల్‌దార్లదే రాజ్యం. 1855 నాటికి మద్రాసు రాష్ట్రంలో 20 జిల్లాలకు 21 మంది శిరస్తాదార్లు ఉండేవారు. అందులో 17 మంది మరాఠా బ్రాహ్మణులు. మిగిలిన నాలుగు పదవుల్లో ఇతర బ్రాహ్మణుల నుంచి ఇద్దరూ, బ్రాహ్మణేతర కులాల నుంచి మరో ఇద్దరూ ఉండేవారు. నాయబ్ శిరస్తాదారుల్లో కూడా మరాఠా బ్రాహ్మణులదే (20) ఆధిపత్యం. ఇతర బ్రాహ్మణుల చేతుల్లో 13 పదవులు ఉండేవి. మిగతా కులాల ప్రాతినిధ్యం వీటిల్లో కూడా అరకొరే. ఇతర కులాలకు మూడు, స్థానిక క్రైస్తవులకు రెండు ఉద్యోగాలు దక్కాయి. ఇక తహశీల్‌దారుల్లో మరాఠా బ్రాహ్మణులు 117, ఇతర బ్రాహ్మణులు 68 మంది ఉండేవారు. 45 చోట్ల మిగతా కులాల వ్యక్తులు తహశీల్‌దారు పదవులను నిర్వహించేవారు.

ముస్లింలు 13, క్రైస్తవులు మూడు చోట్ల ఉండే వారు. మొత్తం 305 కీలక ఉద్యోగాల్లో 154 మంది మరాఠా బ్రాహ్మణులు, 83 మంది ఇతర బ్రాహ్మణులు పెత్తనం చలాయించారు. అంటే 77 శాతం పదవులు వీళ్ల చేతుల్లో ఉండేవి. మరి గుంటూరు జిల్లాలో సంగతి ఏమిటి? అక్కడ 70 ఏళ్ల తర్వాత కూడా పరిస్థితి పెద్దగా మారలేదు. 1922 నాటికి జిల్లా సర్వీసుల్లో 67.22 శాతం ఉద్యోగాల్లో బ్రాహ్మణులే కొనసాగేవారు. 1930ల నాటికి చాలా ఉద్యోగాలకు రిజర్వేషన్లు వచ్చాయి. అయినా 1958 నాటికి కూడా జిల్లా సర్వీసుల్లో బ్రాహ్మణుల సంఖ్య (28.74%) గణనీయంగానే ఉంది. ఇక గ్రామాలను తీసుకుంటే అక్కడ కరణాలుగా పెత్తనమంతా నియోగ బ్రాహ్మణులదే. తర్వాత కాలంలో మునసబుల అధికారాలను పెంచి కరణాల ఆధిపత్యాన్ని తగ్గించారు.

బీజాపూర్ సుల్తానులు దేశస్థ బ్రాహ్మణులను దక్షిణాదికి తీసుకువచ్చారు. గోలుకొండ నవాబులూ వీరిని చేరదీశారు. వేరే భాష మాట్లాడే ప్రజలపై అజమాయిషీ కోసం ఇతర ప్రాంతాల నుంచి చదువుకున్న వర్గాలను తీసుకుని రావటం మన చరిత్రలో చాలా సందర్భాల్లో జరిగింది. పైన అధికారం చలాయించే నవాబులను కాపాడటానికి ముస్లిం ఫౌజుదారులు ఉన్నా రెవిన్యూ యంత్రాంగం మొత్తం హిందువుల చేతుల్లోనే ఉండేది. వీరిలో కూడా బ్రాహ్మణ, కాయస్థ కులాల వారే ప్రధానం. ఇక సైన్యంలో కమ్మ, కాపు, వెలమ, రెడ్డి లాంటి అగ్రకులాలు ప్రముఖపాత్ర పోషించేవి. ప్రాంతాన్ని బట్టి ఈ కులాల పేర్లు మారొచ్చు. కానీ ఆధిపత్య కులాలు అన్ని భాషా ప్రాంతాల్లోనూ నాలుగో అయిదో ఉండేవి. ఈ కులాలకు చెందిన ముఖ్యులతో కలిసే ముస్లిం నవాబులు దేశంపై ఆధిపత్యం చలాయించారు. నవాబుల స్థానంలో వచ్చిన బ్రిటిషు వారు చాలా కాలం దాన్ని కొనసాగించారు. అందుకే ముస్లింల పాలనలో హిందువులు అణచివేతకు గురయ్యారంటూ మన చరిత్ర గురించి తరచూ చెప్పేదంతా వాస్తవ దృష్టితో చూస్తే నిజంకాదు. గుంటూరు జిల్లానే కాదు ఏ జిల్లాను తీసుకున్నా ఇదే కనపడుతుంది. 'హిందువులను అదుపులో పెట్టాలి. అణచివేయాలి. వాళ్లు చాలా టక్కరులు. తిమ్మిని బమ్మిని చేస్తారు. ఎప్పటికీ వాళ్లను నమ్మలేం' లాంటి మాటలు ముస్లిం రాజ్యాల ఆస్థాన రచయితలు రాసిన పుస్తకాల్లో చాలాచోట్ల కనపడతాయి. అవన్నీ కూడా పాలనా యంత్రాంగంలో కీలక పాత్ర పోషించిన ప్రాబల్యవర్గాలు గురించి చేసిన వ్యాఖ్యలే. ఈ వర్గాలు తమ కులాలపైనే ప్రధానంగా ఆధారపడి బలగాలను సమకూర్చుకునేవి. చివరికి తిరుగుబాట్లకు కూడా ఎక్కువగా సొంత కులాలపైనే ఆధారపడేవారు. సొంత కులాలు, తెగల బలంతో విస్తృత సంబంధాలు కలిగిన ఈ వర్గాల పట్ల ముస్లిం పాలకులు ఎప్పుడూ అప్రమత్తంగానే ఉండేవారు. దేశస్థ బ్రాహ్మణుల సంగతినే తీసుకుందాం. జిల్లా పాలనా యంత్రాంగాన్ని తమ బంధువర్గంతో నింపేసే వారు. ఒక శిరస్తాదారుకు చెందిన 74 మంది బంధువులు జిల్లా ఆఫీసు ఉద్యోగాల్లో ఉండటమే ఇందుకు నిదర్శనం. కులం, బంధుత్వం ఆసరా లేకుండా ఉద్యోగాలు, పదవులు సంపాదించటం ఆనాడు చాలా కష్టం. కులప్రీతి ఉన్నచోట కుట్రలు, కుహకాలు, ముఠాలు తప్పవు. లంచాలను ఎరవేయటం 1830ల నాటికి ఎక్కువగానే ఉండేది. ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేయటం 1850ల నాటికి కూడా బ్రిటిషు వారికి సాధ్యం కాలేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాబల్యకులాలు ఏవంటే కమ్మ, రెడ్డి, వెలమ, కాపు పేర్లు వెంటనే స్ఫురణకు వస్తాయి. రెండు వందల ఏళ్లు వెనక్కి వెళితే ఈ జాబితాకు అతి ముఖ్యంగా చేర్చాలింది బ్రాహ్మణ కులమే. ఎందుకంటే పాలనా యంత్రాంగంలోనే కాకుండా జమిందార్లుగా, భూస్వాములుగా కూడా బ్రాహ్మణులు ఉండేవారు. గుంటూరు జిల్లాలో అయిదు జమిందారీ పరగణాలు ఉండేవి. 882 గ్రామాలు, 36 పట్టణాలు (గ్రామపరిధుల్లోనే) ఉండేవి. గ్రామాలను 14 సమితులుగా విభజించారు. 1847 నాటికి జిల్లాలో 4,11,599 మంది నివసించే వారు. జమిందార్లకు ఒకనాడు శిస్తు వసూలు అధికారమే మాత్రమే ఉండేది.

భూములపై యాజమాన్య హక్కులు ఉండేవి కావు. అయిదు జమిందారీల్లో వెలమ కులానికి చెందిన మాణికరావు కుటుంబం ఎప్పటి నుంచో జమిందారీ (రేపల్లె) గిరి చలాయించేది. విజయనగర సామ్రాజ్యం కంటే ముందు నుంచి కూడా ఈ కుటుంబానికి జమిందారీ గిరి ఉండేది. మనూరురావు (చిలకలూరిపేట, సత్తెనపల్లి) పేరుతో రెండు దేశస్థ కుటుంబాల కింద రెండు జమిందారీలు ఉండేవి. తెలగ కుటుంబానికి చెందిన మల్‌రాజు కింద మరో జమిందారీ (నరసరావుపేట) ఉండేది. అయిదోది జమిందారీ వాసిరెడ్డి (అమరావతి–కమ్మ) కుటుంబానిది. గోలుకొండ రాజ్యం పతనం తర్వాత వాసిరెడ్డి కుటుంబానికి జమిందారీ లభించింది. అమరావతి జమిందారీలో 333 గ్రామాలు ఉంటే నరసరావుపేటలో 323, చిలకలూరిపేటలో 79, సత్తెనపల్లిలో 80, రేపల్లెలో 67 గ్రామాలు ఉండేవి. 1788లో బ్రిటిషు పాలన మొదలైనా రెవిన్యూ యంత్రాంగంపై పట్టు చిక్కలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో 1802లో జమిందార్లకు తమ జమీన్లపై శాశ్వతహక్కు కల్పించే పద్ధతిని ప్రవేశపెట్టారు. పంటలో సగభాగాన్ని జమిందార్లు తీసుకునే వారు.

అందులో మూడో వంతు తమ కింద ఉంచుకుని మిగతా దాని విలువను డబ్బుగా బ్రిటిషు ఖజానాకి కట్టేవారు. బ్రిటిషు రక్షణతో యుద్ధ భయాలు తొలగటంతో జమిందారుల్లో భోగలాలస పెరిగింది. వారసత్వ తగాదాలు, విపరీత ఖర్చులతో 1850ల నాటికి జమిందారీ కుటుంబాలు ఆర్థికంగా సంక్షోభంలో పడ్డాయి.

పదవులు, ఉద్యోగాలు, సంపదలో అనుచిత ఆధిక్యతలు పదునైన భావజాలాన్ని సృష్టిస్తాయి. ఒకనాటి ఉమ్మడి మద్రాసు, మహారాష్ట్ర చరిత్రలే ఇందుకు ఉదాహరణలు. బ్రాహ్మణ వ్యతిరేక భావజాలం అందుకే అక్కడ ఊపిరిపోసుకున్నది. గుంటూరు జిల్లా చరిత్ర చెబుతున్న నిజం అదే. ఆ ఆధిక్యతలు సడలుతున్న క్రమంలో ఆ భావజాల తీవ్రత కూడా క్రమేపీ తగ్గిపోయింది.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

యాసంగి పనులు షురూ..

- ఊపందుకున్న వరి నాట్లు
- అందుబాటులో ఎరువులు
- పంట రుణాలకు ఏర్పాట్లు
- వరివైపే అన్నదాతల మొగ్గు
- సన్నాల సాగుకు ఆసక్తి
- పెరగనున్న మొక్కజొన్న విస్తీర్ణం
- సిద్ధమైన వ్యవసాయ ప్రణాళిక



హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యాసంగి సాగు పనులు జోరందుకున్నాయి. వరి నాట్లు మొదలయ్యాయి. బోర్ల కింద రైతులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ మండలాల్లో వ్యవసాయ బావులు, బోర్ల కింద ఆయకట్టు రైతులు ముందస్తుగానే యాసంగి వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. చెరువులు, కుంటల కింద కూడా రైతులు నారు మడుల తయారీలో నిమగ్నమై ఉన్నారు. మేలైన, నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఆరా తీస్తున్నారు. అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులో లేకపోవడంతో కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. వాటినే ప్రభుత్వం వ్యవసాయశాఖ అధ్వర్యంలో రాయితీపై అందచేయాలని కోరుతున్నారు. స్థానికంగా మార్కెట్లో లభిస్తున్న వాటిని కొనుగోలు చేసి విత్తుకుంటున్నా... చాలా సందర్భాల్లో ఆశించిన దిగుబడులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం నీరు అందుబాటులో ఉండడంతో ఎక్కువగా వరి సాగుపైనే దృష్టి సారిస్తున్నారు. నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అన్నిరకాల ఎరువులను అందుబాటులో ఉంచింది. ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో విత్తన రాయితీపై ఆశలు పెరుగుతున్నాయి. జిల్లాలో యాసంగి సాగు నవంబరు నుంచి మొదలవుతుంది. ఇప్పటికే ఆరుతడి పంటలు పూర్తవుతున్నందువల్ల రైతులు నవంబరు చివరివారం నుంచే సాగు పనులు మొదలు పెట్టారు. మొదట ఆరుతడి పంటలు వేసిన తర్వాత వరి సాగు చేస్తారు.

పంటలు

జిల్లాలోని పన్నెండు మండలాల్లో సుమారు 1.85 లక్షల ఎకరాల్లో పంటలు సాగ అవుతుండగా ఈసారి కూడా యాసంగిలో ఇంచు మించు ఇదే విస్తీర్ణంలో రైతులు పంటలు వేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పత్తితీతలు, మొక్కజొన్న కోతలు పూర్తికావచ్చాయి. రైతులు రబీపై పూర్తిగా దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా వరి సాగును చేపట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈసారి యాసంగిలో లక్షా 30వేల ఎకరాల్లో వరి సాగు కావచ్చునని అంచనా. గతంలో 50వేల ఎకరాల్లో మక్కజొన్న సాగు చేయగా ఈ సారి 60 వేల ఎకరాల్లో వేయనున్నారు. 2వేల ఎకరాల్లో వేరు శనగ, 1500 ఎకరాల్లో పెసర్లు, ఇతర పప్పు దినుసులు సాగు కావచ్చునని భావిస్తున్నారు.

పుష్కలంగా ఎరువులు

యాసంగి సాగుకు వ్యవసాయ శాఖ సిద్ధమవుతోంది. సాగు ప్రణాళికను రూపొందించడంతో పాటు రైతులు వేసే పంటల ఆధారంగా కావలసిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మార్క్‌ఫెడ్ గోదాముల్లో వివిధ రకాల ఎరువుల బఫర్ నిల్వలు ఉన్నాయి. ఈ ఏడాది వానాకాలంలో 8వేల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగించారు. ఇప్పటికే యాసంగి సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయాధికారులు ఎరువులను అందుబాటులో ఉంచారు. ఆయా మండలాల్లో సుమారు 15వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. ఈ మేరకు వాటిలో ప్రస్తుతం అవసరాలకు అనుగుణంగా డీఏపీ, యూరియా, పొటాష్, కాంప్లెక్స్ వంటి 2వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయి. వినియోగాన్ని బట్టి ప్రతి నెలా సరఫరా జరిగేలా చూస్తామని కొరత ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇదేకాకుండా ప్రైవేటు వ్యాపారుల వద్ద కూడా భారీగా ఎరువల నిల్వలు ఉన్నాయి.

సన్నాలపై ఆసక్తి

బియ్యం ధరలు ప్రతీ ఏటా అవకాశన్నంటుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధర రూ.5300 వరకు పలుకుతోంది. దీంతో చాలా మంది రైతులు సన్నరకాలపై దృష్టి పెడుతున్నారు. ఈ కారణంగా హంస రకం బియ్యం దాదాపు మార్కెట్‌లో దొరికే పరిస్థితి లేకుండా పోయింది. ఈ రకం సాగు చేస్తే తినే వారు తక్కువగా ఉండడం, పైగా దిగుబడులు అంతగా రాకపోవడంతో సాగుకు స్వస్తి చెబుతున్నారు.

చాలినంత సాగునీరు

ఈ సారి వర్షాలు తక్కువగా కురిసినా ఒకేసారి పడిన భారీ వర్షాల వల్ల చెరువులన్నీ పూర్తిస్థాయిలో నిండాయి. ఎస్సారెస్పీ, దేవాదుల ప్రాజెక్టుల్లో సాగు నీరు అందుబాటులో ఉంది. భూగర్భ జలాలు కూడా పుష్కలంగా ఉండడంతో బావులు, బోర్ల ద్వారా వచ్చే నీటితో రైతులు యాసంగి పంటలకు సరిపడా సాగునీరు అందుబాటులో ఉండనున్నది. ఎల్కతుర్తి, కమలాపూర్, హసన్‌పర్తి, దామెర, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు, హనుమకొండ, నడికూడ మండలాల్లో వరికోతలు పూర్తయ్యాయి. ముందస్తుగా నారు పోసుకున్న రైతులు ఏకంగా నాట్లు వేస్తున్నారు. పరకాల, శాయంపేట, ఆత్మకూరు మండలాల్లో కూడా వరికోతలు పూర్తయ్యాయి.

పంట రుణాలు

యాసంగి సాగు మొదలుకావడంతో డిసెంబర్ నెలనుంచే పంట రుణాలను బ్యాంకుల ద్వారా అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మార్చి వరకు యాసంగి సాగుకు పంట రుణాలను అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో ఈ యాసంగిలో రూ.1,638.8 కోట్ల రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. రైతులు సాగుచేసే పంట ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఆయా బ్యాంకుల ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు.

యాసంగికి అన్ని ఏర్పాట్లు పూర్తి: దామెదర్ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడు



జిల్లాలో వరి నాట్లు ఇప్పటికే మొదలయ్యాయి. జనవరి చివరి నాటికి నాట్లు పూర్తవుతాయి. ఈసారి కూడా రైతులు పెద్ద ఎత్తున వరివైపే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో లక్షా 30వేల ఎకరాల్లో వరి సాగు, 50వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుంది. జిల్లాలో యాసంగి సాగుకు కావలసిన ఏర్పాట్లు ముందే చేస్తున్నాం. కార్యప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలను అందుబాటులో ఉంచే ఏర్పాట్లను చేస్తున్నాము. రైతులకు కావలసిన ఎరువులను ఇప్పటికే అందుబాటులో ఉంచాము.



'ఆపరేషన్ స్మైల్'' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- బాలల చేత పని చేయిస్తే కేసుల నమోదు
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 11: బాలల రక్షణ, సంరక్షణ కోసం పని చేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి బాలలను బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తి కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆపరేషన్ స్మైల్ స్పెషల్ డ్రైవ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తప్పిపోయిన, వదిలేసిన, రోడ్లపై బిక్షాటన చేస్తున్న బాలకార్మికులను గుర్తించాలని సూచించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించడం లేదా పునరావాస కేంద్రాలకు తరలించడం లాంటివి చేయాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. 14 యేళ్లలోపు పిల్లలు ఎక్కడా పని చేయరాదని, 18 యేళ్లలోపు పిల్లలు ప్రమాదకర ప్రదేశాల్లో పని చేయించరాదన్నారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ రూపుమాపుటకు అన్ని విభాగాలు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమేశ్‌బాబు, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డీసీపీవో సంతోష్ కుమార్, సీడబ్ల్యూసీ సభ్యులు రాజేంద్రప్రసాద్, హైమావతి, అశోక్ కుమార్, డీఈవో అబ్దుల్ హై, ప్రొటెక్షన్ ఆఫీసర్లు సౌరం ప్రవీణ్ కుమార్, ఎం.మౌనిక, సతీష్ కుమార్, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో డ్రైవర్ల ధర్నా

- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 11: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ బల్దియా స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. గురువారం హనుమకొండలోని బల్దియా కార్యాలయం ఎదుట స్వచ్ఛభారత్ ఆటో డ్రైవర్స్ కమ్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఆటోడ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డ్రైవర్లు కోరారు. గతంలో కౌన్సిల్ సమావేశంలో ప్రతి గృహం నుంచి చెత్త సేకరణకు గాను రూ.60 తీసుకోవాలనే తీర్మానం జరిగినా ఫలితం లేదని వాపోయారు. నాలుగు నెలలుగా వేతనాలు లేవని వాపోయారు. తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బల్దియా కార్మిక సంఘాల ప్రతినిధులు వేల్పుల .ధర్మరాజు, సింగారపు బాబు, బొట్ల బిక్షపతి, మహేశ్, రాజారపు భాస్కర్, కిషోర్, రవీందర్, ప్రవీణ్, మురళీక్రిష్ణ తదితరులు డిమాండ్ చేశారు.

కమిషనర్‌ను కలిసిన ప్రతినిధులు

ధర్నా అనంతరం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు కలిశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు.



డీఎంహెచ్‌వో ప్రశాంత్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

ఏసీబీ వలలో జనగామ డీఎంహెచ్‌వో

- ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్ట్‌కు లంచం వేధింపులు
- రూ. 50 వేలు టేబుల్ డ్రాలో పెట్టిన బాధితురాలు
- పక్కా ప్లాన్‌తో పట్టుకున్న ఏసీబీ అధికారులు
- సహకరించిన జూనియర్ అసిస్టెంట్ అరెస్టు
- కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఘటన

జనగామ టౌన్, జనవరి 11: జనగామ జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ చేపూరి ప్రశాంత్ గురువారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ ఫార్మసిస్ట్ వద్ద లంచం పుచ్చుకుని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జనగామ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు... జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన స్రవంతి అనే యువతి 2021 నుంచి ఓబుల్‌కేశ్వాపూర్ ప్రాథమిక వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ కింద ఫార్మసిస్ట్‌గా పనిచేస్తోంది. పర్మనెంట్ ఉద్యోగి వచ్చారనే సాకు చూపించి ఆమెను 2023 అక్టోబర్‌లో తొలగించారు. అదే రోజు సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఆమెకు జూనియర్ అసిస్టెంట్ అజహర్ ఫోన్ చేశారు. తిరిగి ఉద్యోగం కావాలంటే డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలవాలని సూచించారు. ఆమె డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లగా, ఉద్యోగం కావాలంటే రూ.లక్ష ఇవ్వాలని చెప్పారు. తాను అంత ఇచ్చుకోలేనని డీఎంహెచ్‌వో ప్రశాంత్‌కు తెలిపింది. రూ.50వేల వరకు ఇస్తానని విన్నవించుకుంది. ఈ క్రమంలో వారం కిందట రూ.50 వేలు చెల్లించింది. అయినా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఆమె డీఎంహెచ్‌వోను ప్రశ్నించింది. మరో రూ.50వేలు ఇవ్వాల్సిందేనని జూనియర్ అసిస్టెంట్ ద్వారా డీఎంహెచ్‌వో చెప్పారు.

ఈ క్రమంలో బాధితురాలు ఏసీబీ అధికారులను సంప్రదించింది. వారి డైరెక్షన్‌లో రూ.50వేల నగదు తీసుకుని గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లింది. డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్ సూచన మేరకు ఆ డబ్బులను కార్యాలయంలోని ఓ టేబుల్‌లో పెట్టింది. ఈ క్రమంలో అక్కడే మాటువేసి వున్న ఏసీబీ అధికారులు డీఎంహెచ్‌వో కార్యాలయంలోకి వెళ్లి డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. లంచం డిమాండ్ చేసినట్లు విచారణలో ఒప్పుకోవడంతో ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, కె.శ్రీను, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్న'పై చిన్న చూపు

- ఐనవోలు జాతర ఏర్పాట్లపై నిర్లక్ష్యపు నీడలు
- తూతూ మంత్రంగా అధికారుల పరిశీలన
- అపరిశుభ్రంగా పరిసరాలు, వెదజల్లుతున్న దుర్గంధం
- రెండు రోజుల నుంచి తాగునీటి కటకట
- జాతరకు ఇంకా మూడు రోజులే గడువు





వంట చేసుకునేందుకు జాతరలో నీటికోసం తిరుగుతున్న భక్తుడు

ఐనవోలు, జనవరి 11: లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర ఏర్పాట్లపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. జాతర ప్రారంభానికి పట్టుమని మూడు రోజుల సమయం కూడా లేదు. పరిసరాల అపరిశుభ్రతతో దుర్గంధం వెదజల్లుతోంది. రెండు రోజుల నుంచి నీటిసరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. జాతరకు ముందే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని స్వయాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించినా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోసీరియస్‌గా వ్యవహరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్‌బాషా, జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ఆర్డీవో రమేష్ ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చి చలువ పందిళ్లు చూసి పేపర్లపై లెక్కలు వేసుకొని వెళ్లిపోయారని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితు లను పరిశీలించలేదని భక్తులు వాపోతున్నారు. దీంతో ఈసారి జాతరలో ఇక్కట్లు తప్పేట్టు లేవు. ఈ యేడు మేడారం జాతర ఉన్నందున ఇప్పటికే భక్తులు వేల సంఖ్యలో వచ్చి వెళ్తున్నారు. చలువ పందిళ్లు, క్యూలైన్ల నిర్మాణం పనులు మాత్రమే సాఫీగా జరుగుతున్నాయి. ఇతర పనులు నత్తనడకన జరుగుతున్నాయి.

అన్నింటికీ ఒకే నీరు

భక్తులు తాగడానికి ఆర్‌వో ప్లాంట్ల ద్వారా శుద్ధిచేసిన నీటిని మాత్రమే ప్రత్యేకంగా సరఫరా చేయాలని మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇటీవల జరిగిన జాతర ఏర్పాట్ల సమీక్ష సమావేశంలో ఆదేశించారు. అధికారులు మాత్రం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయలేదు. మిషన్‌భగీరథ నీటిని బావిలో నింపుతున్నారు. బావిలో చెత్తాచెదారంతో నిండి నీరు కలుషితం అవుతోంది. అదే నీటిని ట్యాంక్‌కు పంపింగ్ చేసి పలు చోట్ల ఏర్పాటు చేసిన నల్లాల ద్వారా తాగడానికి, వంటవార్పునకు, స్నానాలకు నల్లాల ద్వారా పట్టుకునే పరిస్థితిని కల్పించారు. దీంతో భక్తులు తాగడానికి ప్రైవేటు వ్యాపారులు విక్రయిస్తున్న క్యాన్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. వంటవార్పునకు సైతం రెండు రోజుల నుంచి నీటిసరఫరా లేకపోవడంతో బకెట్లు, క్యాన్లతో చేతిపంపుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటూ అవసరాలు తీర్చుకుంటున్నారు.



తాగునీటి బావిలో పేరుకపోయిన చెత్త చెదారం

కొనసాగుతున్న పనులు

జాతరకు ముందు విద్యుత్ పనులు పూర్తిచేయాల్సి ఉంది, కానీ పనులు నత్తనడకన కొసాగుతున్నాయి. కాంట్రాక్టర్లు చాలినంత కార్మికులను ఏర్పాటు చేసుకోకుండా ఇద్దరు ముగ్గురు కార్మికులతో పనులు చేయిస్తుండటంతో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కలెక్టర్ చొరవతీసుకొని యుద్ధప్రాతిపదకన ఏర్పాట్లను పూర్తిచేయించాలని భక్తులు కోరుతున్నారు.

అపరిశుభ్రం.. దుర్గంధం..

ఆలయ ప్రాంగణంలో ఉత్తరం, పశ్చిమం, తూర్పు వైపు భక్తులు విడిదిచేసే పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. నామమాత్రంగా చదును చేశారు తప్ప దుర్గంధాన్ని తొలగించలేదు. మల, మూత్ర విసర్జనలతో దుర్వాసన వ్యాపించి భక్తులు విడిదిచేయడానికి ఇబ్బంది పడుతున్నారు. అపరిశుభ్రంగా ఉన్నచోట పారిశుధ్యం పనులు చేపట్టలేదు, కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లలేదు. తాగునీటి నల్లాలు ఏర్పాటుచేసిన చోట చెత్తాచెదారంతో పరిస్థితి అధ్వానంగా మారింది. కొన్నిచోట్ల ఇంకా నల్లాలు బిగించలేదు. స్నానాలు చేయడానికి బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, మహిళలు స్నానాలు చేసి దుస్తులు మార్చుకునేందుకు పూర్తిస్థాయిలో డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయలేదు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అపరిశుభ్ర వాతావరణంలోనే విడిదిచేసి ఏర్పాట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు తమ తమ కుటుంబాలతో వచ్చి ఒకసారి విడిదిచేస్తే ఇక్కడి పరిస్థితులు తెలుస్తాయని భక్తులు విమర్శిస్తున్నారు.

కేయూ పరీక్షల విభాగం ఉద్యోగులపై వేటు

సర్టిఫికెట్లకు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు



కేయూ క్యాంపస్, జనవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులపై వేటు వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాకారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి గురువారం తెలిపారు. రెగ్యులర్ డిగ్రీ బీఏ, బీకామ్ విభాగంలో సెక్షన్ క్లర్క్‌లుగా పనిచేసే ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు.. డబ్బులు ఇస్తేనే విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు పాస్ మోమోలు, ఇతర ధృవపత్రాలు ఇస్తున్నారని పలువురు ఫిర్యాదులు చేశారు. అవినీతి ఆరోపణలతో పాటు కళాశాల అధ్యాపకులపై దురుసుగా ప్రవర్తించడం, నేరుగా డబ్బులు అడగకుండా పైసలిస్తేనే పనులు చేస్తామనే ధోరణి ప్రదర్శించేవారని అధికారులు వెల్లడించారు. అలాగే సర్టిఫికెట్లు కళాశాలకు పంపామని, కళాశాల వారు వస్తే నేరుగా విద్యార్థులకే ఇస్తామనే కుంటిసాకులు చెబుతూ లంచాలు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇచ్చేవారని అధికారులు వెల్లడించారు. గతంలో పరీక్షల విభాగంలో పనిచేసే వారిపై అనేక ఆరోపణలున్నప్పటికీ రాజకీయ నేతలు, ఉద్యోగ సంఘాల నేతల పలుకుబడితో అదే సెక్షన్‌లో కొనసాగారు.

అయితే ఇటీవల కేయూ ఆడిట్ ఆఫీసర్ ఎస్.కిష్టయ్య లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో వర్సిటీలో అవినీతి, లంచాలకు మరిగిన ఉద్యోగులపై వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు కఠిన నిర్ణయాలకు దిగారు. పరీక్షల విభాగంలో అవినీతికి పాల్పడ్డ ఇద్దరు ఉద్యోగులను విధుల్లోకి రావొద్దని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి చెప్పారు. వారికి మరో విభాగంలో విధులు కేటాయిస్తారని ప్రచారం సాగుతోంది. అయితే వారిపై విచారణ చేపట్టి శిక్షించాలని వర్సిటీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.


ఇదిలా ఉండగా, రెగ్యులర్‌గా ఉత్తీర్ణత సాధించే విద్యార్థులకు నేరుగా కళాశాలకు ధృవపత్రాలను పంపుతామని, రీవాల్యూవేషన్‌లో పాసయ్యే అభ్యర్థులకు పరీక్షల విభాగంలో పాస్ మోమోలను జారీ చేస్తామని పరీక్షల విభాగం అధికారులు వెల్లడించారు.

మమ అనిపించారు..


సాదాసీదాగా జడ్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సుధీర్‌కుమార్







ఇంటర్ విద్యార్థులకు సువర్ణావకాశం

● గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

● ఈ నెల 15వ తేదీ వరకు గడువు

హనుమకొండ రూరల్, జనవరి 11: ఎస్సీ గురుకులాలు పేద విద్యార్థులకు వరంగా మారాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాయి. గురుకులాల్లో ఏర్పాటు చేసిన ప్రతిభ కళాశాలలు (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) అసాధారణ ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తూ బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు. ఐఐటీ, నీట్‌లో ఈ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కలిసి మడికొండలో బాలురకు 1, బాలికలకు 1 కళాశాల ఉంది. ఇందులో బైపీసీ 40, ఎంపీసీ 40 సీట్లు చొప్పున ఉన్నాయి. విద్యార్థులకు నచ్చినరంగాల్లో శిక్షణ ఇప్పిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. చదువుతోపాటు క్రీడల్లో గురుకుల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

ఈ నెల 15వ తేదీ వరకు గడువు

ప్రస్తుత విద్యాసంవత్సరం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15వ తేదీలోగా www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల కోసం తమకు ఇష్టమైన కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యాబోధన ఉంటుంది. సీఈవో కళాశాలల్లో ఇంటర్మీడియేట్ తరగతులతోపాటు ఐఐటీ, ఎన్ఐటీ, నీట్, క్లాట్, సీఎంఏ తదితర పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. నాణ్యమైన విద్యతోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష బహుళ ఐచ్ఛిక పద్ధతిలో తెలుగు, ఇంగ్లీషులో ఉంటుంది. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అందులో మెరిట్ సాధించిన అభ్యర్థుల్లో 1:5 నిష్పత్తిలో రెండో స్క్రీనింగ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులను రెండో విడతలో ఫిబ్రవరి 25న ఎంపిక చేసిన సెంటర్లలోనే 150 మార్కులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఎస్సీలకు 75శాతం, బీసీలకు 12శాతం, ఎస్టీలకు 6శాతం, మైనార్టీలకు 3శాతం, ఇతరులకు మిగిలిన సీట్లు కేటాయించి ఆ మేరకు మెరిట్ జాబితాను ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రతిభ ఆధారంగానే ఎంపిక

ఎస్.విద్యారాణి, ప్రాంతీయ సమన్వయ అధికారి వరంగల్ రీజియన్



ప్రతిభా కళాశాలలు అద్భుత విజయాలు, అనితర సాధ్యమైన ప్రతిభాపాటవాలకు చిరునామాగా నిలుస్తున్నాయి. అట్టడుగువర్గాల్లోని పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు అత్యున్నత స్థాయికి వెళ్లేందుకు గురుకులాలు బాటలు వేస్తున్నాయి. ఉచిత విద్యను అందించడంతోపాటు నిరుపేద విద్యార్థులు పైసా ఖర్చు లేకుండా ఐఐటీ, నీట్‌లాంటి జాతీయ పోటీపరీక్షల్లో కార్పొరేట్‌కు దీటుగా లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తాం. గడువులోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతిభ ఆధారంగానే ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తాం.


అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

కమలాపూర్, జనవరి 11: మండలంలోని మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల రమ(45) అనే మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్టు గురువారం పోలీసు ఇన్స్‌పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన రమతో మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల స్వామికి 25 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. స్వామి ట్రాక్టర్ డ్రైవర్‌గా, రమ వ్యవసాయ కూలి పనిచేసి జీవనం గడుపుతున్నారు.

కాగా, గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రమ కనిపించకుండా పోయింది సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, దుప్పటి గ్రామస్థులకు కనిపించాయి. దీంతో వారి కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మహిళ మృతదేహాన్ని బావిలోంచి బయటకు తీశారు. మృతురాలి సోదరుడు బొమిక సౌందరయ్య ఫిర్యాదు మేరకు రమది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

కారు పల్టీ - తప్పిన ప్రమాదం

ఐనవోలు, జనవరి 11: కారు అదుపుతప్పి పంట పొలాల్లో పడి పోయిన సంఘటన పున్నేలు క్రాస్‌రోడ్డు జాతీయరహదారిపై గురువారం రాత్రి జరిగింది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం గోవర్ధనగిరికి చెందిన రషీద్ వరంగల్ నుంచి పంథిని వైపు కారులో వెళ్తున్నాడు. క్రాస్ రోడ్డు దాటాక కారు అతి వేగంగా కుడివైపు రోడ్డును దాటి ఆర్ అండ్‌బీ సూచికల బోర్డును ఢీకొట్టి 150 అడుగుల దూరంలో ఉన్న మొక్కజొన్న పంటచేనులో పడిపోయింది. కారులో డ్రైవర్ ఒక్కరే ఉన్నారు. కారు బెల్టు ధరించడం వలన స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కారు కుడివైపున దూసుకపోయిన సమయంలో మరే వాహనం ఎదురుగా రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది.





కొత్తకొండలో తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం శ్రీకాంత్

కొత్తకొండ జాతరకు ప్రతీరోజు 20 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతీరోజు హుజూరాబాద్ నుంచి 80 ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80 ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.60, చిన్నారులకు రూ.30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణికులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి ఉప్పుల భద్రయ్య, సర్పంచ్ దూడల ప్రమీల-సంపత్, ఆర్టీసీ డ్రైవర్ దూడల ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు



బట్టలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కేయూలో బట్టల పంపిణీ

కేయూ క్యాంపస్, జనవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో ప్రతీ ఏడాది బోధనేతర ఉద్యోగులకు వర్సిటీ అందజేసే ఉచిత బట్టలను (డ్రెస్ కోడ్)ను గురువారం కేయూ పరీక్షల విభాగంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్యోగులకు అందచేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ఉద్యోగులకు డ్రెస్‌లను అందచేస్తామని, విధుల్లో ఉన్నప్పుడు డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. డ్రెస్‌తో వర్క్ కల్చర్‌తో పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నరసింహరావు, ఎఫ్ఓ తోట రాజయ్య, కేయూ టెక్నికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎ.నందయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ షకూర్, పోలేపాక కోర్నేల్, మల్లికాంబు, మజార్ అలీ, విజయ్,ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోగిన ఐలోని మల్లన్న డోలు

జాతరకు ముస్తాబైన ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం

విభిన్న పద్ధతుల మిళితం.. జానపదుల జాతరగా ప్రాశస్త్యం

రాణి రుద్రమదేవి సైతం సంతానప్రాప్తికి పూజలు



'సకం భాగ్యాలు కలిగి... సంతోషమాత భక్తి కలిగి... అవులు గోవులు కలిగి... అవాలక్ష కావాల్లు కలిగి... ముట్టింది ముచ్చమై పట్టింది బంగారమెమై.. పాలి వాడు దగ్గరై పగవాడు దూరమై.. ఏటికి ఎడ్లు కలిగి పాటికి బర్లు కలిగి... పర్వ తాల మల్లయ్యా... మా పాలి కలిగి ఉండి... పతి పార్వతిలా కొరిమే" అంటూ ఒగ్గు పూజారులు ధమురుకాల శబ్దాల నడుమ కొలువనుండగా మల్లన్న జాతర వైభవంగా జరగనుంది. ఈ జాతర జానపదుల జాతరగా ప్రాచుర్యం పొందింది. మకర సంక్రమణతో ప్రారంభమయ్యే జాతర ఉగాది వరకు సాగనుంది. కాకతీయుల కాలంలో మొదలైన ఈ క్రమం.. కాలాలు మారినా దినదినం ఇంకా వెలుగొందుతూనే ఉంది. మరో మూడు రోజుల్లో మొదలయ్యే ఈ జాతరలో భక్తులు ఆచరించే తంతుపై ప్రత్యేక కథనం..



ఐనవోలు, జనవరి 11: ఐనవోలు మల్లికార్జునస్వామి(మల్లన్న) జాతర భక్తులకు ఎంతో ప్రాశస్త్యమైనది. పూర్వ కాలంలో జానపదుల జాతరగా కీర్తి గడించి, శైవారాధన పూజలు అందుకుంది. 1100 యేళ్ల కిందట కొరమీసాల మల్లన్న కొలువయ్యాడని భక్తుల విశ్వాసం. విభిన్న శైవాగామ పద్ధతుల్లో నిత్యపూజలు అందుకునే మల్లన్నస్వామి ఒక చేతిలో ఖడ్గం మరోచేతిలో త్రిశూలం ఢమురకం తలపై కిరీటం మూతిపై మీసం ఒక ప్రత్యేకతగా దర్శనమిస్తాడు. నిర్వికారి నిరహంకార నిరాకారస్థితి లింగస్వరూపంలో మూలవిరాట్ అర్ధప్రానపట్టం శ్వేత వర్ణము కలిగి ఉండటం ఇక్కడ మరో విశేషంగా భావిస్తారు. ఖండోభ అవతారంలో స్వామి వారికి భార్యలు కుడిపక్క గొల్ల కేతమ్మ ఎడమ పక్కన బలిజ మెడమ్మలు కొలువయ్యారు. ప్రతీ రోజు శైవాగమ పద్ధతిననుసరించి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ముఖ్య పూజల్లో భక్తులు బోనాలు, పట్నాలతో నైవేద్యం సమర్పిస్తారు.

చెలుక, నజరు పట్నం.. పెద్దపట్నం..

మొక్కులతో ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకొని మొక్కులు చెల్లించాకే స్వామి వారిని దర్శించుకుంటారు. బండారి పలుకపై తెల్లపిండి పసుపు కనుగోల్లు దోశెడు బియ్యం పోసి మైలపోలు తీస్తారు. కుడుక, పోక, ఖర్జూర, పసుపు గౌరవమ్మను పెట్టి రైక మలపు తెల్లతువ్వాల పెట్టి మైల పోలు తీశాక తంగడిపచ్చతో చల్లి తెల్లపిండిలో పలుక కోట్టి పట్నం(పటం) వేసి మల్లన్న కథలు చెప్పుతారు. శరణు మల్లేశా.. అంటూ పాటలోనే కల్యాణం చేసి పట్నం మీద అక్షింతలు వేస్తారు. ఒక్కపొద్దు విడిచి స్వామి వారిని దర్శించుకుంటారు. పెద్దపట్నం వేసి స్వామి కథను చెప్పుతారు. జానపదుల అవాహనాల్లో పట్నం అంటే ఆసనం రూపకంలో శివుడిని ఆహ్వానించడం అన్నమాట. స్వామివారికి ఉదయం మేలుకోలుపు, రాత్రి పవలింపు ఒగ్గు పూజారులే చేయం అనావాయితీగా వస్తోంది.

బోనం.. నైవేద్యం..

బోనం అన్నంలో పాలు, బెల్లంతో పరామాన్నం వండుతారు. కాకరకాయ, చిక్కుడుకాయ, వంకాయ, గుమ్మడి కాయ అన్ని కలిపి వండి పచ్చి పులుసుతో నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం బాల బోగం, మధ్యాహ్నం మహా నైవేద్యం, సాయంత్రం ప్రదోశకాల బోగం సమర్పిస్తారు.

బండారి పసుపు.. గజ్జెల లాగు..

తెలుపు బొట్టు విభూది పెట్టుకున్న వారితో మరణం ఉండకూడదని మణిమల్లాసురులనే రాక్షసులు బ్రహ్మతో వరం పొందారు. ఆదే రాక్షసులను సంహరించేందుకు పసుపు (బండారి) బొట్టు, గజ్జెల లాగు తొడిగి జాలి ముసుగు వేసుకొని కొరడా, త్రిశూలం, ఢమురకంతో వచ్చి మల్లికార్జునస్వామి రాక్షసులను సంహరించడాని భక్తుల విశ్వాసం. భక్తులు పసుపును కిలోల కొద్ది తీసుకవచ్చి స్వామివారికి సమర్పించి వెంట కొంత తీసుకెళ్తారు. ఒగ్గు పూజారుల కథల్లో మల్లన్నకు - మంగోలియా దేశానికి పసుపు సంబంధం కనిపిస్తుంది.

శివసత్తులు.. శివసతులు..

జాతరలో ఎటు చూసినా శివసత్తుల పూనకాలే కనిపిస్తాయి. శివసతులే శివసత్తులుగా పిలువబడుతున్నారు. శివుడికి నాట్యం అంటే ఇష్టం మహిళలు శివుడిని కల్యాణం చేసుకునే సంప్రదాయం పూర్వ కాలం నుంచి వస్తోంది. అందులో భాగంగానే పునకాల నడుమ నృత్యాలు చేస్తారు. పురుషులు మహిళా వేషాధారణలో తన్మయం చెందుతారు.

కొడే కట్టుట.. టెంకాయ బంధనం

శివుడి వాహనం కొడే(నంది) కోరికలు తీరితే కోడెను కడతారు. పెళ్లి కాని వారు, సంతాన లేమి, తదితర సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మొక్కుబడి టెంకాయ బంధనం చేస్తారు. కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క ముడుపు కట్టుతారు. కోరికలు తీరాక ముడుపు విప్పి మొక్కుబడిని చెల్లిస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న భక్తుల నమ్మకం సంప్రదాయం. ఒడి బియ్యం పసుపు, నూనెతో కలిపి పోకచెక్కలు, ఖర్జూర పండ్లు, ఇద్దరు అమ్మవార్లకు చీరలు, జాకెట్ ముక్కలు, గాజులు పెట్టుతారు. స్వామి వారికి దోతి, తువ్వాల సమర్పిస్తు ఒడి బియ్యం పోసి మొక్కు తీర్చుకుంటారు. రాణి రుద్రమదేవి సైతం తన కూతురు ముమ్మడమ్మకు సంతానప్రాప్తి కోసం ఐదు రోజులు ఇక్కడే ఉండి మొక్కుకున్నట్లు చరిత్ర ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

గండ దీపం.. శేవాలు..

గండాలు తీరితే గండదీపం పెడతారు. తలపై దీపం పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తారు. పిల్ల, జెల్ల చల్లగా ఉంటే శేవాలు తీస్తామని మొక్కుకున్న వారు తలనీలాలు సమర్పిస్తారు. ఆలయంలో మల్లన్న స్వామి పుట్టమన్ను రూపంలోనే కొలువయ్యాడు. మల్లికార్జునస్వామిని ఇలవేల్పు దైవంగా భావించే యాదవులు, కుర్మలు, ఇలవేల్పులుగా కొలిచే మరిన్ని కులాల వారు జాతరకు ముందు పుట్టమన్నుతో ఇంట్లో మల్లన్న గద్దెలు నిర్మించుకొని రోజు సాయంత్రం ఇళ్లలో డోలు మోగిస్తారు. నెలపట్టులు సస్తేడు (ఏడు) వారాలు పండుగను జరుపుకుంటారు. ఇళ్లలో డోలు మోగించి నెల రోజుల పాటు భక్తిపారవశ్యంతో మాంసాహారం, మద్యానికి దూరంగా ఉంటూ జాతరకు వచ్చి దర్శనం చేసుకుంటారు. పాలు, పెరుగు బయటికి ఇవ్వకుండా నేతిని చేసి స్వామి వారికి దీపంగా సమర్పిస్తారు.

నృత్యమండపంలో సల్లవడ్డనం

బండారిని పూసుకున్న భక్తులు కాకతీయుల నృత్య మండపంలో కొరడాల మధ్య శివనాట్యం చేసి మల్లన్నను స్మరిస్తూ సల్ల కవ్వం (మజ్జిగ) చేసి స్వీకరిస్తారు. దీనిని చూడటానికి భక్తులు వేలసంఖ్యలో హాజరవుతారు. శివసత్తుల నృత్యాలు మండపాన్ని మారుమోగించగా పసుపుమయవుతుంది.

సంక్రాంతికే ప్రభల జాతర

సంక్రాంతి వరకు మొదటి పంట పండి రెండో పంట రైతు ఇంటికి చేరుకుంటాయి. ధాన్యం దిగుబడులు పెరుగాలని పశుసంపద వృద్ధి చెందాలని ప్రభల బండ్లలను (ఎద్దుల బండ్లు) సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయడం అనవాయితీగా వస్తోంది. మార్నేని వంశీయులు పెద్ద రథంను (శిడి) అందంగా ముస్తాబుచేసి గ్రామంలోని పురవీధుల గుండా మహానివేదనను ఆలయానికి తీసుకవస్తారు. దీనిని అనుసరించి వివిధ గ్రామాల నుంచి వచ్చే బంతిపూల బండ్లు తిరుగుతాయి. సాయంత్రం నుంచి తెల్లవారేవరకు శోభ సంతరించుకుంటుంది. దీనిని బట్టే జానపదుల జాతరగా పిలుబడుతుందని ప్రచారంలో ఉంది.

జాతర, వారాలు

ఐలోని జాతరకు సంబంధించి డిసెంబరు 17న ఆదివారం రోజున స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సర మార్గశిర శుద్ధ పంచమిన దృష్టికుంభం ప్రారంభమైంది. ఆపై జాతర మకర సంక్రమణంతో ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుంది. ఈ నెల 13న ధ్వజారోహణముతో ఉత్సవాలు ప్రారంభమై 14న భోగి పండుగ 15న మకర సంక్రాంతి ఈ రెండు రోజుల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. తర్వాత ఉగాది వరకు ప్రతీ ఆది, బుధ వారం వారంతపు జాతర సాగుతుంది. మొత్తం 11 వారాల జాతరకు లక్షల భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి దైవ దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఫ్రీ వీఐపీ పాస్‌ల రద్దు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయ ఆదాయం పెంచేందుకు ఫ్రీ వీఐపీ పాస్‌ల జారీని రద్దు చేసినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ఇక వీఐపీ పాస్‌లను రూ. 200 ధర పెట్టి కొనుగోలు చేయాల్సిందేనని ఈవో గురువారం విలేకరులతో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వారం కిందట దేవాదాయ, వివిధ శాఖలాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో ఎడాపెడా వీఐపీ పాస్‌లు జారీ చేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. దీంతో వీఐపీ పాస్‌లు రద్దు చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో వీఐపీ పాస్‌ను రూ.200కు జారీ చేయాలని ఈవోకు సూచించారు. అంతేకాకుండా వీఐపీ పాస్‌లను రూ.1.50 లక్షలు పెట్టి తమ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా కొనుగోలు చేశారు.

ఐనవోలు జాతరలోనూ..

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో ఈ సారి వీఐపీ పాసులు రద్దు అయ్యాయి. వాటి స్థానంలో వీవీఐపీ టికెట్లను జారీ చేస్తున్నారు. ఒక్కో టికెట్ ధర రూ.500కు ఖరారు చేశారు. దీనికోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. యేటా జాతర సందర్భంగా వీఐపీ పాస్‌లు ఇచ్చేవారు. ఒక్కో పాస్‌పై రూ.500 తీసుకొని రశీదు ఇచ్చేవారు. ఒక పాస్‌పై ఐదుగురు దర్శనానికి వెళ్లేవారు. కిందటేడు వీఐపీ పాసులపై రూ.2.50 లక్షల ఆదాయం సమకూరింది. అయితే వీఐపీ పాస్‌లు రాజకీయంగా పక్కదారి పడుతున్నాయని విమర్శలు వచ్చాయి. దీనిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వీఐపీ పాస్‌లు జారీ చేయవద్దని సూచిస్తు తాను టిక్కెట్ కొనుగోలు చేసి క్యూలైన్లో వస్తానని చెప్పడంతో పాస్‌లను ముద్రించలేదు. యేటా పలువురు తమ బంధువులు, స్నేహితులు, తెలిసినవారు వేలాదిమందిని వీఐపీ క్యూలైన్లో దర్శనాలు చేయించేవారు. దీంతో ఈసారి ఆ పద్ధతికి చెక్‌పెట్టడంతో ఆదాయం పెరుగనుంది. ఆలయంలో స్వామి వారి దర్శనాలు, ధర్మదర్శనం(ఉచితం), శీఘ్ర దర్శనం టిక్కెటు ధర (రూ.50), విశిష్ట దర్శనం టిక్కెటు ధర (రూ.100), వీవీఐపీ టిక్కెటు ధర (రూ.500) ఖరారు చేసినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించాలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వడ్డెపల్లి, జనవరి 11: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా తనను ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తాను డాక్టర్‌గా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చేసిన సేవలను గుర్తించి లోక్‌సభ సీటును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 1996 నుంచి 2001 వరకు చేర్యాల ఎంపీపీగా, జిల్లా డీఆర్‌డీఏ బాడీ సభ్యుడిగా, వరంగల్ గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా కాకుండా.. జిల్లాలోని అనేక నియోజక వర్గాల ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించానని చెప్పారు. 2009 జనరల్ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ మహాకూటమి అభ్యర్థిగా, 2014లో వరంగల్ లోక్‌సభకు మహాకూటమి అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న తనకు వరంగల్ లోక్‌సభ స్థానాన్ని కేటాయించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు ఉడమల బాల్‌రెడ్డి, మంచాల చిరంజీవి, గోగికార్ కృష్ణకుమార్, ఉప్పుల రాములు, గౌరవేని శివకుమార్, ముస్త్యాల జార్జి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత నారాయణను కలిసిన లెనిన్



నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లెనిన్

సుబేదారి, జనవరి11: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులను హైదరాబాద్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం జర్నలిస్టు నాయకుడు బీఆర్ లెనిన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇండియా కూటమి వరంగల్ పార్లమెంట్‌అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని ఈ సందర్భంగా లెనిన్ విజ్ఞప్తి చేశారు. లెనిన్ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

హనుమకొండ రూరల్: వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని హనుమకొండ గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జన్ను మొగిలి గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శాలువతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జన్ను మొగిలి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీలో సుమారు 26 యేళ్లుగా పనిచేస్తూ, జిల్లాలోని అన్ని సామాజిక వర్గాలతో సత్సంబంధాలు కలిసి ఉన్నట్లు పేర్కొన్నారు. వరంగల్ ఎంపీగా బీజేపీ తరుపున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

గోపాల్‌పూర్ చెరువులో గుడిసెల కూల్చివేత

ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఎం నేతల డిమాండ్

వడ్డెపల్లి, జనవరి 11: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌పరిధిలోని గోపాల్‌పూర్ చెరువులో పేదలు వేసుకున్న గుడిసెలను జిల్లా యంత్రాంగం గురువారం తెల్లవారు జామున కూల్చివేసింది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసుల ఆధ్వర్యంలో చెరువులోని గుడిసెలను కూల్చివేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గోపాల్‌పూర్ చెరువు శిఖం సర్వే నంబర్ 89లో సుమారు 20 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. రెండేళ్ల కిందట సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లులేని పేదలు చెరువు శిఖంలోని స్థలాన్ని చదును చేసి అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున రెవెన్యూ, నీటి పారుదల శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసులతో ఎక్స్‌కావేటర్‌తో గుడిసెలను నేలమట్టం చేశారు. గుడిసెలను ప్రభుత్వ యంత్రాంగం తొలగించడంతో గుడిసెలు వేసుకున్న పేదలు నిరాశ్రయులయ్యారు. పేదలు ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించడం దుర్మార్గమని సీపీఎం నేతలు తేలూరి ఉప్పలయ్య, వాంకుడోతు వీరన్న, కూస రాజేష్‌లు ఆరోపించారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా పునరాలోచన చేసి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



గుడిసెవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా

సుబేదారి: గోపాలపురం చెరువు శిఖంలో 2 యేళ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు సంబంధించిన గుడిసెలను కూల్చడాన్ని నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి పెద్ద సంఖ్యలో గుడిసెవాసులతో సీపీఎం నాయకులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. అర్ధరాత్రి మునిసిపల్ సిబ్బంది పోలీసుల సహాయంతో గుడిసెలు తొలగించడం సరైంది కాదన్నారు. అనంతరం గుడిసెవాసుల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, వెంకట్, తిరుపతి, కిశోర్‌తోపాటు గుడిసెవాసులు పాల్గొన్నారు.

ఈనెల 13న ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కైట్ ఫెస్టివల్

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 13న శనివారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను నిర్వహించనున్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కైట్ ఫెస్టివల్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుంది. సంక్రాంతి పర్వదినాన గ్రామాల్లో, పట్టణాల్లో పిల్లలు, పెద్దలు రంగు రంగుల పతంగులను ఎగురవేయడం ఆనవాయితీ. ప్రాచీనకాలంగా వస్తున్న సంప్రదాయం. యాంత్రిక జీవనం వల్ల పతంగులను ఎగురవేయడం ఇటీవల కాలంలో చాలా తగ్గింది. పట్టణీకరణ వల్ల మైదాన ప్రాంతాలు కనుమరుగై పతంగులు స్వేచ్ఛగా ఎగురవేసే పరిస్థితులు కూడా లేకుండా పోయాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో నగరవాసులకు పతంగుల ఎగురవేతలో ఉన్న ఆనందాన్ని మరోసారి కలుగచేసేందుకు ఈ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో 2017లో నగరంలో జాతీయ స్థాయి కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించింది తెలిసిందే. కలెక్టర్ పమేలా సత్పతి హయాంలో 2019లో కూడా ఒకసారి రాష్ట్ర స్థాయి పతంగుల పండుగను ఇదే ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు.



ఎంజీఎంలో ఆందోళన చేస్తున్న నర్సులు

నర్సులను దూషించిన స్వీపర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎంజీఎంలో విధులు బహిష్కరించి నర్సుల ఆందోళన

హనుమకొండ అర్బన్, జనవరి11: సేవే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న నర్సులను అకారణంగా దూషించిన స్వీపర్ రాజమ్మపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నర్సులు ఆందోళన చేపట్టారు. గురువారం మధ్యాహ్నం విధులు బహిష్కరించి పరిపాలన విభాగం ఎదుట ధర్నా, ఆందోళన చేశారు. రోగులు చికిత్స పొందుతున్న వార్డులో పారిశుధ్య చర్యలు నిర్వహించక పోవడంతో సంబంధిత వార్డు హెడ్ నర్సు పద్మలత విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజమ్మ అనే మహిళా ఉద్యోగి హెడ్‌నర్సుపై దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడింది. అంతేకాకుండా ఎంజీఎంలో విధులు నిర్వహిస్తున్న నర్సులందరినీ ఉద్దేశించడంతో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. నర్సుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన స్వీపర్‌ను విధుల నుంచి తొలగించే వరకు విధులకు హాజరు కాకుండా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని, విధులకు హాజరు కావాలని సూపరింటెండెంట్ కోరడంతో నర్సులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో వివిధ విభాగాల నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్రంపహాడ్'కు భారీ బందోబస్తు

ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



జాతర రోడ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఆత్మకూరు, జనవరి 11: రాష్ట్రంలో రెండో అతిపెద్దజాతరైన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. గురువారం ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారాలమ్మలను ఆయన సందర్శించారు. ఆ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వరంగల్, దుర్గంపేట, ఆత్మకూరు నుంచి అలాగే చౌళ్లపల్లి ద్వారా వచ్చే రోడ్డు పెద్దాపురం నుంచి జాతరకు వచ్చే రోడ్లను డీసీపీ పరిశీలించారు. జాతర చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు పంటలు వేయవద్దని పోలీసు అధికారులు స్థానికులకు సూచించారు. గతంలో కంటే ఈసారి భారీగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానిక మాజీ ఎంపీటీసీ బోరిగం స్వామిని పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. జాతర చుట్టూ పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు మఫ్టీలో స్పెషల్ పార్టీ పోలీసుల నిఘా ఉంటుందన్నారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రత చేసి క్షణాలలో పోలీసులు చేరకునేవిధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కాళోజీ జంక్షన్, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యుడు చెన్నమనేని జయశ్రీ తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటాయని ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి రూ.2016, రెండో బహుమతి రూ.1,116, మూడో బహుమతి రూ.516లు ఉంటాయని సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. ప్రోత్సాహక బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ గిఫ్టులు అందజేస్తామని ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు సెల్ నంబర్లు 83673 56765 / 83670 56765 లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. లేకుంటే ఇక్కడికి వచ్చాన నమోదు చేసుకోవచ్చన్నారు.

శ్రీభద్రకాళి వీరభద్ర అన్నదానం ప్రారంభం

వడ్డెపల్లి, జనవరి 11: శ్రీభద్రకాళి వీరభద్ర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ ముందు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి జి.లక్ష్మణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, శ్రీభద్రకాళి వీరభద్ర అన్నదాన సేవా సమితి నిర్వాహకులు పిన్నా శివకుమార్, తడికమల్ల సాయికృష్ణ, జర్నలిస్టులు వలిశెట్టి సుధాకర్, చెన్న రామకృష్ణ, వేణుప్రసాద్, బరుపటి సంపత్‌కుమార్, అల్లం రాజేశ్వర్, సుంచు రాంరాజ్, వల్లాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీపీఆర్‌వో

మానవ అక్రమ రవాణా అత్యంత ప్రమాదకరం

కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ కడియం కావ్య

సుబేదారి, జనవరి 11: ప్రస్తుత సమాజంలో మానవ అక్రమ రవాణా అత్యంత ప్రమాదకర సమస్యగా మారిందని, దీనిని అధిగమించడానికి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కావ్య పాల్గొని మాట్లాడారు. బాలికలు, మహిళలే అక్రమ రవాణా ముఠాలకు ప్రధాన టార్గెట్‌లని, పట్టణాల్లో దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న వర్గాలను పనిగట్టుకుని ఈ ముఠాలు లక్ష్యంగా చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవిరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడియం కావ్య

నిబంధనల మేరకే అనుమతుల జారీ

హనుమకొండ సిటీ, జనవరి 11: నిబంధనల మేరకే భవన నిర్మాణ అనుమతులు జారీ అవుతాయని, ఉల్లంఘిస్తే కూల్చివేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. గురువారం నగరంలోని మడికొండ, నందిహిల్స్ జూలైవాడ, జక్కలొద్ది తదితర ప్రాంతాల్లోని నిర్మాణ అనుమతుల ప్రాంతాలను పరిశీలించారు.



భవన నిర్మాణ అనుమతులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న జంగా రాఘవరెడ్డి

మడికొండ, జనవరి 11: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండకు చెందిన పెనుకుల విష్ణు, మద్దెల క్రాంతికుమార్, గోపనబోయిన కార్తీక్, రాంపూర్ గ్రామానికి చెందిన దాసు తదితరులు వరంగల్ డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత జంగా రాఘవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థాన్ని పుచ్చుకున్నారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు జక్కుల సారయ్య యాదవ్, కొప్పుల నవీన్‌యాదవ్, తౌటిరెడ్డి జగదీష్‌రెడ్డి, తండా శివ, పెనుకుల వినయ్, తొట్టె గణేష్ యాదవ్, మానుపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ధర్మసాగర్, జనవరి 11: ధర్మసాగర్ మండలం కరుణాపురంలో జన్ను థామస్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ అనిల్, లోధి సంస్థ కోర్డినేటర్ సుధాకర్ గురువారం ప్రారంభించారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి తోడ్పడుతాయన్నారు. నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జన్ను ఈవాన్సు, మార్టిన్ పుట్ట ప్రశాంత తదితరులు పాల్గొన్నారు.



బాలసముద్రంలో ముగ్గులు వేస్తున్న శ్రీనివాస్ గురుకుల్ విద్యార్థులు



పండుగ వేడుకల్లో ఏకశిలా హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



రెడ్డికాలనీలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు



కాజీపేట పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

హనుమకొండ రూరల్, జనవరి 11: సంక్రాంతి పండగ అనగానే కాంతి, నూతనోత్సవాలు నింపడానికి తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ కేయూసీ రోడ్‌లోని ఏకశిల హైస్కూల్‌లో ముందస్తుగా సంక్రాంతి వేడుకలను కన్నుల పండువగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో చక్కగా ముస్తాబై పాఠశాలకు విచ్చేశారు. పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేసి, అనంతరం గాలి పటాలు ఎగురవేశారు. ఈ సంక్రాతి పండగ అందరి జీవితాల్లో వెలుగులు తీసుకురావాలని గౌరు తిరుపతి రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏకశిల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బేతి శైజలారెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, స్వప్న, స్వాతి, కల్పన, సుమలత, జ్యోతి, లిల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్‌లో..

బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి సంక్రాంతి ముగ్గులు వేశారు. బోగి మంటలు వేసి ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం, ఇన్‌చార్జి మమత, ఉపాధ్యాయులు స్వప్న, గీత, నవ్య, అనూష, శ్రాణి, కవిత, రజని, కౌర్, రాధిక, హజీరా, వినయ్, యుగంధర్, రాజేష్, అనురాగ్, విజయ్, ఉదయ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ రూరల్: హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల (ఎల్‌బీహెచ్‌ఎస్)లో ముందస్తుగా సంక్రాంతి సంబురాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు కావడంతో గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీ, విద్యార్థులకు పతంగులు ఎగురవేయడంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జగన్ బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలా కాన్సెప్ట్ స్కూల్‌లో..

సుబేదారి: హనుమకొండ రెడ్డికాలనీలోని ఏకశిలా కాన్సెప్ట్ స్కూల్‌లో గురువారం విదార్థినులు, విద్యార్థినుల తల్లిదండ్రులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రంగురంగుల ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా హరిదాసు వేషాధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినులు విద్యతో పాటు సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్నారెడ్డి, ఉపాధ్యాయినులు శోభ, పావని, సుమాంజలి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపద్మావతి పాఠశాలలో..

కాజీపేట: కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఒలంపియాడ్ స్కూల్‌లో గురువారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముగ్గుల పోటీలు, గాలి పటాల పోటీలు, గ్రామీణ వాతావరణంలో గంగిరెద్దుల నమూనాలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సంక్రాంతి పాటలు పాడి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో తాళ్లపద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్‌లు తాళ్ల వంశీ చైతన్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



లస్కర్‌బజార్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలల్లో...

ఐనవోలు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పున్నేలు, ఉడుతగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం రంగువల్లుల పోటీలు నిర్వహించారు. పున్నేలులో మొదటి బహుమతి పుల్లూరి శాన్వి, ద్వితీయ బహుమతి సాయిదా, తృతీయ బహుమతి కొను జోత్స్న, కాన్సొలేషన్ బహుమతి జిల్లా రామ్‌చరణ్‌లు గెలుపొందగా అభినందించారు. హెచ్ఎం ఆర్.పరమేశ్వర్, ఉపాధ్యాయులు వసంత, యాకయ్య, ఇందిరా, స్వప్న, నరేందర్, ఉడుతగూడెంలో హెచ్ఎం లింగారావు, ఉపాధ్యాయురాలు ఉమాదేవి, ఆయా బరిగల రాధిక విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఇదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు ఉమాదేవి టీఎస్ యుటీఎఫ్ నుంచి సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్న సందర్భంగా ఆమెను సన్మానించారు.

లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి

హనుమకొండ సిటీ, జనవరి 11: హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శాస్త్రి సేవలను కొనియాడారు. శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొమ్మాటి సాంబయ్య, అజీజ్‌ఖాన్, కూచన రవళి, నాగరాజు, తాడిశెట్టితవిద్యాసాగర్, వీరగంటి రవీందర్, నసీంజహాన్, మిర్జా అజీజ్ ఉల్లాఖాన్, బంక సరళా, డాక్టర్ శ్రవణ్, పెరుమాండ్ల రామక్రిష్ణ, డాక్టరు పులి అనిల్‌కుమార్, గుంటి స్వప్న, జనార్దన్, పులి రాజు తదితరులతో పాటు కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, సయ్యద్ విజయశ్రీ రజాలీ, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కాజీపేట: తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కాజీపేట రైల్వే కాలనీలో మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి 58వ వర్ధంతి జరిగింది. సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఊర్మిళ, రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్‌లు హాజరై శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శాస్త్రి మొదటి రైల్వే శాఖమంత్రిగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్‌లు గుర్రపు సుధాకర్ రావు, లక్ష్మీనారాయణ, కరుణాకర్ చారి, సుదర్శన్, టోని పాల్గొన్నారు.

● సుబేదారి: ములుగురోడ్‌లోని లాల్ బహదూర్ కళాశాల(ఎల్బీ)లో లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని నిర్వహించారు. కళాశాలలో ఉన్న శాస్త్రి విగ్రహానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.



కాజీపేటలో నివాళులు అర్పిస్తున్న రైల్వే ఉద్యోగులు



ఎల్‌బీ కళాశాలలో లాల్ నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జిల ఎంపిక

ధర్మసాగర్, జనవరి 11: కాంగ్రెస్ పార్టీ ధర్మసాగర్ మండల ఇన్‌చార్జిగా మండలంలోని బంజరుపల్లి గ్రామానికి చెందిన ముత్తిరెడ్డి అమరేందర్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి సింగపురం ఇందిర గురువారం ఎంపిక చేశారు. అదే విధంగా నారాయణగిరి గ్రామ ఇన్‌చార్జిగా తిరుమల్‌రెడ్డి, ముప్పారం ఇన్‌చార్జిగా మహేందర్‌రెడ్డి, ధర్మసాగర్ గ్రామ ఇన్‌చార్జిగా ప్రసాద్, దేవునూర్, సోమదేవరపల్లి, కాశగూడెం ఇన్‌చార్జిగా పాషా, మల్లక్‌పల్లి, ధర్మాపురం, తాటికాయల, రాయగూడెం ఆరోగ్యం, ఉనికిచర్ల, రాంపూర్ మాజీ ఎంపీటీసీ రాజు, పెద్దపెండ్యాల భిక్షపతి, రాపాకపల్లి రవిలను ఎంపిక చేశారు.

పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి



దరఖాస్తు ఫారాలు విడుదల చేస్తున్న చిర్ర రాజు, బార్ అసోసియేషన్ నాయకులు

సుబేదారి, జనవరి 11: 2020 సెప్టెంబరు 1వ తేదీ వరకు ఏదైనా డిగ్రీ పాసైన గ్రాడ్యుయేట్స్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం(టీజీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చిర్రరాజు గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా బార్ అసోసియేషన్ గురువారం బార్ అసోసియేషన్ నాయకులతో కలిసి దరఖాస్తు ఫారాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ చల్లా శ్రీనివాస్, బార్ అసోసియేషన్ నాయకులు గంప వెంకటరమణ, టీజీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మామిడిశెట్టి నాగరాజు, న్యాయవాదులు మహేష్ పటేల్, చరణ్, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లోకసభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమష్టిగా కృషి చేద్దాం..

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జనవరి 11: రానున్న లోకసభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. గురువారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ పట్టభద్రుల విభాగం, లోకసభ ఎన్నికల్లో గెలుపు కోసం శ్రేణులకు నాయిని దిశా నిర్దేశం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారంతా ఓటు వేస్తారని ఈ క్రమంలో ఓటర్ నమోదు విషయంలో చొరవ తీసుకోవాలని శ్రేణులకు ఉద్బోధించారు.

నూతన కమిటీల నిర్మాణం



మాట్లాడుతున్న నారాయణమాదిగ

ఐనవోలు, జనవరి 11: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఛైఎస్ మండల నూతన కమిటీలను ఈనెల 15న ఎన్నుకోనున్నట్లు గ్రామాల కమిటీల బాధ్యులు పాల్గొనాలని ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి బొక్కల నారాయణమాదిగ పిలుపునిచ్చారు. గురవారం ఐనవోలులో సంఘాల ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చివరిఘట్టం ఉన్నందున జాతిని చైతన్యం చేయడానికి కమిటీల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కట్కూరి ప్రవీణ్‌మాదిగ, కట్కూరి రమేష్, సింగారపు చంద్రమౌళి, బరిగెల కుమారస్వామి, ఇల్లందుల కోంరయ్య, సురేష్, పండు, ఏలియా పాల్గొన్నారు.

మాతా శిశు సంక్షేమానికి చర్యలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు

హనుమకొండ అర్బన్, జనవరి 11: మాతా, శిశు సంక్షేమం పట్ల ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల శిశు మరణాలు చాలావరకు తగ్గాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో చైల్డ్‌డెత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు 5 యేళ్లలోపు పిల్లల మరణాలకు సంబంధించిన కారణాలను పిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్టులు, ఎస్‌పీఎం విభాగం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో చర్చించారు. ఇక ముందు మరణాలు జరగకుండా నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, గైనకాలజిస్టు డాక్టర్ ప్రసన్నలక్ష్మీ, డాక్టర్ భార్గవ్, డీఐఓ వాణిశ్రీ, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రమీల, డాక్టర్ గోపీచంద్, డాక్టర్ ఇష్తికార్ హేమద్, అశోక్ రెడ్డి, ప్రసన్న కుమార్, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు

మహాజాతర పనులు ముమ్మరం చేయాలి

● సకాలంలో పూర్తి చేయాలి ● అధికారులతో ఏటూరునాగారం పీవో అంకిత్

మేడారం, జనవరి 11 : మహాజాతర పనులను ఆయా శాఖల అధికారులు ముమ్మరం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క భవనంలో ఆయన గురువారం సమావేశమయ్యారు. మహాజాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతర నిర్వహణను ఎనిమిది జోన్లు, 42 సెక్టార్లుగా విభజించామని, ఆ మేరకు అధికారులను నియమించామని తెలిపారు. అభివృద్ధి పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అధికారులు జనవరి చివరికల్లా వారంలోగా పనులు పూర్తి చేయాలన్నారు. మహాజాతరను దిగ్విజయం చేసి ములుగు జిల్లా పేరు ప్రతిష్టలను నిలబెట్టేలన్నారు. నోడల్, సెక్టోరల్ అధికారులు, ఇతర అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. అధికారులు గత జాతరల అనుభవాలతో ముందుకు సాగలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. భక్తులకు ఈ నెల నుంచి వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు. మహాజాతర సమయంలో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మేడారం వచ్చే రహదారులు త్వరగా మరమ్మతులు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులను మండల, ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. మహాజాతరలో ఆర్టీసీ 6 వేల బస్సులను సిద్ధం చేసినట్టు తెలిపారు. గతంలో 3,200 బస్సులు అందుబాటులో ఉండేవని ఈసారి ఏడు జిల్లాల నుంచి భక్తులకు బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఏపీవో వసంతరావు, ఇంజనీరింగ్ అధికారులు హేమలత, నాగేశ్వరావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అంకిత్

మమ అనిపించారు..

సాదాసీదాగా జడ్పీ సమావేశం

హనుమకొండ టౌన్, జనవరి 11: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను మమ అనిపించారు. గురువారం హనుమకొండ జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాల పురోగతిని అధికారులు వివరించారు. సమావేశాల్లో పాల్గొన్న జడ్పీటీసీలు ఆలకించారు. పురోగతిని సమీక్షించే ప్రయత్నం చేయలేదు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీల్లోని 200 యూనిట్ల ఉచిత కరెంటు విషయమై ఒకరిద్దరు జడ్పీటీసీలు విద్యుత్‌శాఖ అధికారులను ప్రశ్నించారు. 200యూనిట్లలోపు వినియోగించుకునే వారి డాటా సేకరిస్తున్నట్లు అధికారులు సభ్యులకు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, దేశంలో తెలంగాణను అగ్రభాగాన నిలపడం జరిగిందని జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ తెలిపారు. సమావేశాల్లో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌తో పాటు వైస్‌చైర్మన్ సుధీర్‌కుమార్, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా గోల్డెన్ ఓక్ స్కూల్ రెండో వార్షికోత్సవం

సుబేదారి, జనవరి 11: గ్రేటర్ మహానగర పాలక సంస్థ 11వ డివిజన్‌లోని గోల్డెన్ ఓక్ స్కూల్ హనుమకొండ బ్రాంచ్‌లో స్కూల్ రెండో వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా హాజరయ్యారు. స్కూల్ చైర్మన్ గంటా రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డాన్స్‌లు, మార్షల్ ఆర్ట్స్ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలలో గోల్డెన్ ఓక్ ప్రిన్సిపాల్స్ దయాసాగర్, దీప్తి, విజయలక్ష్మీ, సృజన, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గంటా రవికుమార్, డాన్స్ చేస్తున్న విద్యార్థులు

స్వానుభవం





ఆధ్యాత్మికతే నేనిచ్చే ఆస్తి

చాలా మందికి ఆధ్యాత్మికత ఒక గమ్యం. కానీ హీరో వెంకటేష్‌కు అదొక ప్రయాణం. ఆ ప్రయాణంలో తాను అంతర్ముఖుణ్ణి అయ్యానంటారు వెంకటేష్. తెలియని ఒక 'సూపర్‌పవర్' మనల్ని ముందుకు నడిపిస్తోందని భావించే వెంకటేష్ 'స్వానుభవం' 'నవ్య' పాఠకుల కోసం.

'ప్రయత్నం మాత్రమే మనం చేయ గలం. మిగిలినది మనకు తెలియని ఒక శక్తి చేస్తుంది. చాలా మంది మన ప్రయత్నబలం వల్లే అంతా జరిగిపోతుందనుకుంటారు. కానీ నా ఉద్దేశంలో ఒక పనిలో మన ప్రయత్నం 30 శాతమే! మిగిలిన 70 శాతం పని ఎలా జరగాలనే విషయాన్ని నిర్ణయించేది ఆ శక్తే! దానికి ఏ పేరైనా పెట్టుకోవచ్చు. కొందరు 'సూపర్ పవర్' అంటారు. మరి కొందరు 'దేవుడు' అంటారు. ఆ శక్తి గ్రాండ్ డిజైన్‌లో మనమందరం పావులమే! ఆ విషయం తెలిస్తే శాంతి లభిస్తుంది. నా జీవితంలో వేర్వేరు సమయాల్లో ఈ విషయాలు తెలుసుకుంటూనే ఉన్నా. నా చిన్నప్పుడే- అంటే పదో తరగతి చదువుతున్నప్పుడే నా ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభమయింది. ఎందుకో తెలియదు. చిన్నప్పటి నుంచి నాకు ఆధ్యాత్మిక విషయాలపై ఎక్కువ ఆసక్తి ఉండేది. అలాగని ప్రాపంచిక విషయాలు వదిలేసేవాణ్ణి కాదు. చదువు, ఆటలు- అన్నీ మామూలే! కానీ మనని తెలియని శక్తి ఏదో నడిపిస్తోందనే విషయం చిన్నప్పుడే అర్థమయింది. కానీ స్పష్టత రావటానికి చాలా సమయం పట్టింది.

అనుకోకుండా..

డిగ్రీ పూర్తి అయిన తర్వాత మాస్టర్స్ చేయటానికి అమెరికా వెళ్లా. తిరిగి వచ్చిన తర్వాత బిజినెస్ చేయాలనుకున్నా. టేకాఫ్ అవలేదు. ఆ సమయంలో అనుకోకుండా హీరో అయ్యా. ఆ సమయంలో సినిమాలు నా వృత్తి అవుతాయని ఎప్పుడూ భావించలేదు. ఒక సినిమా ఆడింది. ఆ తర్వాతి రెండు సినిమాలు ఆడలేదు. మళ్లీ హిట్స్ వచ్చాయి. నాకు తెలియని ఏదో శక్తి - నన్ను సినిమాల వైపు నడిపిస్తోందనే విషయం అర్థమయింది. హీరోగా స్థిరపడ్డా. నటుణ్ణి అయిన తర్వాత కూడా నా ఆధ్యాత్మిక ప్రయాణాన్ని వదలలేదు. ఆ రోజుల్లో నాకు మెడపై బలమైన గాయమయింది. దీనితో ఎప్పుడూ నొప్పిగానే ఉండేది. అలాంటి సమయంలో కూడా నేను నా ఆధ్యాత్మిక ప్రయాణాన్ని కొనసాగించా. ఒక వైపు షూటింగ్స్. మరో వైపు నా సాధన. జీవితం ఇలా సాగుతూ ఉండేది. ఆ తర్వాత నాకు పెళ్ళయింది. నాకు, నా భార్య నీరజల మధ్య మంచి అనుబంధం ఉంది.. నాకు పెళ్లైన కొత్తల్లో- మా గురువుగారు- "నీ భార్యతో నీ సంబంధం ఎలా ఉంది?" అని అడిగారు. "చాలా బావుంది" అని చెప్పా. "జీవితమనే యుద్ధంలో గెలిచావు. నీకు తిరుగులేదు" అన్నారు. ఎవరైనా జీవితంలో గెలవాలనుకుంటే- ముందు భాగస్వామి నమ్మకాన్ని, ప్రేమను పొందాలి. భార్య, భర్తలిద్దరూ వేర్వేరు కాదు... ఒకటనే విషయాన్ని తెలుసుకోవాలి. అప్పుడే జీవితంలో ఆనందం లభిస్తుంది. మనకు నచ్చిన మార్గాన్ని ఎంచుకొనే అవకాశం లభిస్తుంది. నేను ఈ రోజు ఆనందంగా ఉంటూ.. నేను ఎంచుకున్న ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించగలుగుతున్నానంటే నా భార్యే కారణం.


యూనివర్సల్ ఎనర్జీ

యూనివర్సల్ ఎనర్జీ పనిచేస్తూ ఉంటుంది. ప్రతి నటుడు రచయితలను కలుస్తూ ఉంటాడు. కథలు వింటాడు. మంచి పాత్రలనే ఎంపిక చేసుకోవాలనుకుంటాడు. అయితే కొందరే ఎందుకు ఎక్కువ విజయం సాధిస్తారు? దీనికి కారణం యూనివర్సల్ ఎనర్జీ. మన ప్రమేయం లేకుండానే మన ముందుకు ఒక విషయాన్ని తీసుకువస్తుంది. మనం ఆ విషయాన్ని గమనించాలంతే! ఉదాహరణకు 'దృశ్యం', 'నారప్ప' లాంటి నా రీమేక్ సినిమాలనే తీసుకుందాం. అవి ఇతర భాషల్లో పెద్ద హిట్స్. చాలా మంది నటులు వాటిని చూసి ఉంటారు కదా! కానీ అవి నా వద్దకే ఎందుకు వచ్చాయి? నా ఉద్దేశంలో అదే గ్రాండ్ డిజైన్!

పిల్లలకు కూడా..

సినీ రంగంలో విపరీతమైన పోటీ ఉంటుంది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ కాకపోతే వెనకబడిపోతూ ఉంటాం. అందువల్ల మన ప్రయత్నం మనం చేస్తూ ఉండాలి. అయితే- మనకెంత రావాలో అంతే మనకు దక్కుతుంది. ఎక్కువా రాదు, తక్కువా రాదు. దీనికి నా జీవితమే ఒక పెద్ద ఉదాహరణ. నేను కావాలని సినిమా రంగంలోకి రాలేదు. అది నా ఛాయిస్ కాదు. కానీ వచ్చా. నా ప్రయత్నం లోపం ఉండకూడదు. మనం ప్రయత్నిస్తూ ఉండాలి. ఈ విషయం అర్థమయితే నిరాశే ఉండదు. నన్ను చాలా మంది 'మీ డ్రీమ్ రోల్ ఏదీ' అని అడుగుతూ ఉంటారు. నాకు ప్రత్యేకంగా ఏదీ లేదు. వచ్చిన ప్రతి పాత్రను వందశాతం కష్టపడి చేస్తా. షూటింగ్ పూర్తయిన తర్వాత- నెమ్మదిగా ఆ పాత్ర నుంచి తప్పుకుంటా! ఆ తర్వాత సినిమా జయపజయాలతో నాకు సంబంధం ఉండదు. ఇలాంటి డిటాచ్‌మెంట్ ఉంటే ఎటువంటి నిరాశ ఉండదు. అయితే దానికి ఆధ్యాత్మిక బలం ఉండాలి. మా పిల్లలకు కూడా అదే చెబుతూ ఉంటా. అంతే కాదు- వాళ్లకు ఎక్కువ యాంబిషన్ కూడా వద్దని చెబుతూ ఉంటా. హార్డ్‌వర్క్ (కష్టపడి పనిచేయటం), డిసిప్లిన్ (క్రమశిక్షణ), హ్యాబిట్స్ (అలవాట్లు)- ఈ మూడే వారి భవిష్యత్తును నిర్ణయిస్తాయి. యాంబిషన్ అనే చక్రంలో చిక్కుకుంటే దాని నుంచి బయటపడే మార్గమే ఉండదు. నేను నా పిల్లలకు ఇచ్చే ఆస్తి- 'నా ఆధ్యాత్మిక మార్గమే'! ఇల్లు, కార్లు- ఇవన్నీ వస్తాయి. పోతాయి. కానీ ఈ మార్గంలో వారు ప్రయాణించ గలిగితే వారు ప్రశాంతంగా, తృప్తిగా నివసించగలుగుతారు.

> నా ఆధ్యాత్మిక ప్రయాణం ద్వైతంతో మొదలై అద్వైతంవైపు సాగింది. ఇప్పుడు ఇంకా కొనసా గుతోంది. ప్రతి ఒక్కరికీ వేర్వేరు ప్రశ్నాపత్రం ఉంటుంది. ఏ ఇద్దరికీ ఒకే తరహా ప్రశ్నలు రావు. ఈ విషయాన్ని గాఢంగా నవి్మతే జీవితంలో చాలా సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి.



● సీవీఎల్ఎన్ ప్రసాద్

సద్గురువాణి

పంటల పండుగ... మార్పుకు ప్రతీక


మకరసంక్రాంతి అందమైన ముగ్గులకు, గొబ్బెమ్మలకు, హరిదాసు పాటలకు, బసవన్నల ఆటలకు, నువ్వుల మిఠాయిలకు, గాలిపటాలు ఎగురవేయడానికి, మరెన్నో సంబరాలకు ప్రసిద్ధి చెందింది. దీన్ని 'పంటల పండుగ' అని, 'మార్పు తెచ్చే పండుగ' అనీ కూడా అంటారు. మకర సంక్రాంతి ప్రాముఖ్యత ఏమిటంటే... ఈ రోజు గ్రహ రాశిలో... అంటే సూర్యుడి చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో ఒక ముఖ్యమైన కదలిక... ఒక మార్పు చోటు చేసుకుంటుంది. సంవత్సరంలో ఎన్నో సంక్రాంతులు ఉంటాయి. వాటిలో రెండు ముఖ్యమైనవి. ఒకటి మకర సంక్రాంతి. రెండోది... సరిగ్గా ఆరు నెలల తరువాత వచ్చే కర్కాటక సంక్రాంతి. ఈ రెండిటి మధ్యా చాలా సంక్రాంతులు ఉన్నాయి. సూర్యుడు రాశి మారిన ప్రతి రోజునూ 'సంక్రాంతి' అనే అంటారు. ఎందుకంటే అది గ్రహ గమనంలో మార్పును సూచిస్తుంది. ఆ మార్పు కారణంగానే మన జీవితాల పాలన, పోషణ జరుగుతున్నాయని అర్థం చేసుకోవాలి. ఈ కదలిక లేదా మార్పు ఆగిపోతే... 'మనం' అనేది కూడా ఆగిపోతుంది. మకర సంక్రాంతి నుంచి సూర్యుడి ఉత్తరగమనం బలంగా ఉంటుంది. భూమి మీద అన్నీ మారడం మొదలుపెడతాయి. శీతాకాలం కొద్దికొద్దిగా తగ్గుముఖం పడుతుంది.

మకర సంక్రాంతిని పంట కోతల లేదా పంట నూర్పిడుల పండుగగా కూడా వ్యవహరిస్తారు. ఎందుకంటే ఈ సమయానికల్లా పంటనూర్పిడులు పూర్తవుతాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకొంటారు. పొలం పనుల్లో సాయపడినవారికి కృతజ్ఞతలు తెలుపుకొంటారు. వ్యవసాయంలో పశువులు చాలా పెద్ద పాత్ర పోషిస్తాయి. కాబట్టి సంక్రాంతి తరువాతి రోజు వాటికోసమే. అదే కనుమ పండుగ. అంటే... మొదటి రోజు భోగి భూమి కోసం, రెండో రోజు మనకోసం, మూడో రోజు పాడి పశువుల కోసం. ఎందుకంటే అవి లేకపోతే మనం సుఖంగా జీవించలేం. పండుగలు అనేవి మన వర్తమానాన్ని, భవిష్యత్తును స్పృహతో మలచుకోవాలనే సత్యాన్ని గుర్తు చేస్తాయి. ఇప్పుడు మనం గత సంవత్సరం పంటను కోసుకున్నాం. తరువాతి పంటను సృష్టించడానికి ఇకపై ప్రణాళిక వేసుకోవాలి. పశువులను కూడా పరిగణనలోకి తీసుకొని, వాటిని సిద్ధం చెయ్యాలి. కాబట్టే 'పంటల పండుగ' అనే పేరు దీనికి సార్థకమయింది. అయితే ఖగోళపరంగా, ఆధ్యాత్మిక పరంగా కూడా ఈ పండుగకు విశిష్టతలు ఉన్నాయి. ఒక నిర్దిష్టమైన యోగ ప్రక్రియ నుంచి ఇది ఆవిర్భవించింది. కానీ సాధారణ ప్రజలు వారికి అనువైన పద్ధతుల్లో జరుపుకొంటున్నారు. యోగులు కొత్తగా, నూతనోత్తేజంతో తమ ఆధ్యాత్మిక ప్రక్రియను కొనసాగించడానికి, సాంసారిక జీవితంలో ఉన్న వారు తాము అనుకున్నవి సాధించేందుకు కొత్త ప్రయత్నాలు చేయడానికీ ఇది చాలా ముఖ్యమైన సమయం.



> మకర సంక్రాంతి మన దేశంలో ప్రధానమైన పండుగ. సంక్రాంతికి మూల పదమైన 'శంకర' అనే మాటకు కదలిక అని అర్థం. ప్రాణం అంటే కదలికే. ఆ కదలికే ఉత్సవం, జీవితం, జీవన ప్రక్రియ... అదే జీవితానికి ఆద్యంతాలు అని తెలుసుకొనే పండుగ సంక్రాంతి.

మకర సంక్రాంతి మన దేశంలో ప్రధానమైన పండుగ. సంక్రాంతికి మూలపదమైన 'శంకర' అనే మాటకు కదలిక అని అర్థం. ప్రాణం అంటే కదలికే. గ్రహం కదులుతుంది కనుకనే అది ప్రాణాన్ని పుట్టిస్తుంది. గ్రహచలనం లేనట్టయితే దానికి ప్రాణాన్ని ఇచ్చే సామర్థ్యం ఉండదు. కాబట్టి ఈ కదలికలో అన్ని జీవులకూ పాత్ర ఉంది. అయితే కదలిక అనేది ఏదో ఒక నిశ్చలత్వం ఒడిలోనే జరుగుతుంది. తమ జీవితంలో నిశ్చలత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోలేనివారు... అంటే బాహ్యంగానూ, అంతర్గతంగానూ నిశ్చలత్వం తెలియని, చూడనివారు... ఈ కదలికలో ఎక్కడో పడిపోతారు. ఆ కదలికే ఉత్సవం, జీవితం, జీవన ప్రక్రియ... అదే జీవితానికి ఆద్యంతాలు అని తెలుసుకొనే పండుగ సంక్రాంతి. అలాగే... 'శంకర' అనే పదం వెనుక ఉన్నవాడు శంకరుడు. ఆయన నిశ్చలుడు. నిశ్చలత్వమే ఈ కదలికకు మూలం. అన్ని గ్రహాలూ తిరుగుతున్నా... వాటిలో అతి ముఖ్యమైన సూర్యుడు తిరగడం లేదు. ఆయన కదలకుండా ఉన్నాడు కాబట్టే మిగిలినవాటి గమనం జరుగుతోంది. ఆయన కూడా కదిలితే మనం ఇబ్బందిలోపడతాం. కానీ సూర్యుడి నిశ్చలత్వం కూడా సాపేక్షమైనదే. ఎందుకంటే మొత్తం సౌరమండలం కదులుతూ ఉంటుంది. మొత్తం పాలపుంత కదులుతూ ఉంటుంది. కానీ వాటికి ఆవాసమైన ఆకాశం సంపూర్ణంగా నిశ్చలమైనది. మనిషి తనలోని ఈ నిశ్చలత్వాన్ని చేరుకోడానికి ప్రయత్నించినప్పుడు మాత్రమే ఆ కదలికలోని ఆనందాన్ని తెలుసుకోగలడు. అలా కానప్పుడు... తమ జీవితంలో వచ్చే ప్రతి మార్పుకూ, కదలికకూ బాధపడతారు. జీవితంలోని ప్రతి దశా ఏదో విధమైన ఇబ్బందే. ఈ జీవితపు స్వభావమే కదలిక అనేది అర్థం చేసుకోలేనివారికి... ఆ కదలికతో, అంటే మార్పుతో ఇబ్బందే. మీరు ఆ కదలికను ఆస్వాదించగలిగేది మీరు నిశ్చలంగా ఉన్నప్పుడే. నిశ్చలత్వం అంటే ఏమిటో మీకు తెలిసినప్పుడు... జీవితం ఆనందభరితమవుతుంది. లేకపోతే... కదలిక అనేది నిశ్చేష్టతకు కారణమవుతుంది. కదలికను... అంటే మార్పును పండుగ చేసుకోవడం మీరు నిశ్చలత్వాన్ని చవిచూసినప్పుడే వీలవుతుంది. ఆ సంగతి గుర్తుచేయడమే మకర సంక్రాంతిలోని ప్రత్యేకత.



సద్గురు జగ్గీవాసుదేవ్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/zOXCtXHలో చదవండి.



ఋణ విముక్తి కలిగించే పర్వం

మానవులుగా జన్మించినవారు తీర్చుకోవాల్సిన ఋణాలను పూర్వులు నిర్దేశించారు. అవి: దేవ, పితృ, మనుష్య, ఋషి, భూత ఋణాలు. వాటిని 'పంచ ఋణాలు' అంటారు. వీటన్నిటినుంచీ విముక్తి కలిగించేది సంక్రాంతి. సూర్యుడి ఆరాధనతో పాటు యజ్ఞ, యాగాదుల ద్వారా దేవ ఋణం; దానాలు, పిండప్రదానాల ద్వారా పితృ ఋణం; ఆ ఏడాదిలో తమకు లభించిన సంపద నుంచి పంచుకోవడం ద్వారా మనుష్య ఋణం; ధ్యాన సాధనలు, సత్సంగాల్లాంటి మంచి కార్యక్రమాల ద్వారా ఋషి ఋణం; పంచభూతాల సాక్షిగా భూమి, పశువులు, పక్షులకు సమర్పించేవాటి ద్వారా భూత ఋణం తీరుతాయంటారు పెద్దలు. పితృదేవతలకు తర్పణాలు ఇచ్చే రోజు కాబట్టి దీన్ని 'పెద్దల పండుగ'నీ, వ్యవహారికంగా 'పెద్ద పండుగ' అనీ అంటారు. తర్పణాలతో పాటు దానాలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. ప్రధానంగా కూష్మాండ (గుమ్మడి పండు) దానం చేస్తారు. సూర్యారాధన కూడా ఈ రోజున విశేషంగా చేస్తారు.



అభ్యుదయానికి నాంది

సహజయోగ



తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమణేమ సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తరః రాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః...


సంక్రాంతి గురించి 'జయసింహ కల్పద్రుమం' అనే గ్రంథం ఈ విధంగా వర్ణించింది. పంచాంగం ప్రకారం మనకు పన్నెండు రాశులు. వాటిలో సూర్యుడు ప్రవేశించినప్పుడు... సూర్యుడు ఏ రాశిలో ఉంటే.. సంక్రాంతిని ఆ పేరిట వ్యవహరిస్తారు. మకరరాశిలో సూర్య ప్రవేశాన్ని 'మకర సంక్రాంతి' అంటారు. 'సం' అంటే 'శుభమైన', 'మిక్కిలి' అని, 'క్రాంతి' అంటే 'అభ్యుదయం', 'నూతనోత్సాహం' అని అర్థం. మకర సంక్రాంతి అభ్యుదయానికి నాంది. ఈ రోజు నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. కుంభ, మీన, మేష, వృషభ, మిధున రాశులలో సూర్యుడు ఉన్న కాలం వరకూ అది కొనసాగుతుంది. కర్కాటకరాశిలో సూర్యుడు ప్రవేశించి... సింహ, కన్య, తుల, వృశ్చిక, ధనురాసుల్లో కొనసాగిన కాలాన్ని 'దక్షిణాయణం' అంటారు. ఏడాదిలోని పన్నెండు నెలల్లో దక్షిణాయణం దేవతలకు ఒక రాత్రి అనీ, ఉత్తరాయణం పగలు అనీ చెబుతారు. కాబట్టి దేవతలు మేలుకొని ఉండే కాలం... ఉత్తరాయణ పుణ్యకాలం. అందుకనే భీష్ముడు ఉత్తరాయణ ప్రవేశం వరకూ జీవించి, ఆ తరువాతనే తనువు చాలించాడని 'మహాభారతం'లోని 'భీష్మపర్వం' చెబుతోంది. సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించిన తరువాత... ఆరు నెలలు వాతావరణం వేడిగా ఉంటుంది. సూర్యరశ్మి మానవ జాతికి మేలు చేస్తుంది. వృక్ష సంపద ఎదుగుదలకు కారణమవుతుంది.

సంక్రాంతి రోజున అలాగే నువ్వులు, బెల్లం కలిపి తయారు చేసిన నువ్వుల ఉండలను పంచుకుంటారు. దీనిలో పరమార్థం ఏమిటంటే... సంక్రాంతికి ముందువరకూ ఉన్న అతి చల్లని వాతావరణం వల్ల శరీరం, మనస్సు కాస్త బద్ధకంగా ఉంటాయి. దాన్ని వదిలించుకొని... రాబోయే వేడి వాతావరణంలో శారీరక శ్రమకు సిద్ధం కావాలి. శరీరంలో ఉష్ణాన్ని కలిగించే నువ్వులు తీసుకోవడాన్ని... వేడిని తట్టుకొనే సంసిద్ధతకు ప్రతీకగా భావిస్తారు. ఇక... సూర్యుడి వేడి మనలో కోపాన్ని పెంచుతుంది. మాటలో మాధుర్యాన్ని తగ్గిస్తుంది. అందుకని నువ్వులతో పాటు తియ్యనైన బెల్లాన్ని కలిపి ఇతరులకు ఇవ్వడం వల్ల... మాటల్లో మాధుర్యం వెల్లివిరుస్తుందంటారు. సూక్ష్మంగా చెప్పాలంటే... ప్రేమలోని వెచ్చదనాన్ని, ఆప్యాయతను ఇతరులకు పంచడానికి ఇది ఒక సంకేతం. సూర్యుడిలో ఉన్న మరో గొప్పగుణమేమిటంటే... తను నిరంతరం మండుతూ సమస్త విశ్వానికీ మేలు చేకూరుస్తాడు. ఇతరులకు ఆనందం కలిగిస్తాడు. ఇదంతా తనే చేస్తున్నాని అనుకోకుండానే ఇదంతా ఆయన నిర్వహిస్తాడు. ఈ గుణాలన్నీ మనలో పెంచకుంటే అహంకారానికి తావు ఉండదు.

చంద్రుడితో పాటు ఇతర గ్రహాల గమనం ప్రభావం మనమీద ఉంటుంది. అందుకనే చాంద్రమానాన్ని అనుసరించి మన పండుగలు ఉంటాయి. కానీ ఒకే ఒక పండుగ సౌరమానాన్ని అనుసరించి ఉంటుంది. అదే సంక్రాంతి. ఇది ప్రతి సంవత్సరం జనవరి 14న లేదా 15న వస్తుంది. అందులో మార్పేమీ ఉండదు. భారతదేశంలోని చాలా రాష్ట్రాల్లో... ప్రత్యేకించి పల్లెలలో సంక్రాంతిని చాలా ఘనంగా, ప్రధాన పండుగగా నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటకలో 'సంక్రాంతి' అనీ, తమిళనాడులో 'పొంగల్' అనీ, పంజాబ్‌లో 'లోహ్రి' అనీ, మహారాష్ట్రలో 'మాఘి' అని దీన్ని వ్యవహరిస్తారు. మొదటి రోజున భోగి, రెండో రోజున మకర సంక్రాంతి, మూడో రోజున కనుమ పండుగగా జరుపుకొంటారు.

సహజయోగపరంగా చూసినట్టయితే... మనలోని అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలో... క్రియాశక్తిని కలిగించే కుడిపార్శ్వంలో ఉన్న పింగళానాడి మీద సూర్యుడి ప్రభావం ఉంటుంది. దాన్ని 'సూర్యనాడి' అంటారు. ఇచ్ఛాశక్తిని కలిగించే ఎడమ పార్శ్వంలోని ఇడా నాడి మీద చంద్రుడి ప్రభావం ఉంటుంది. దాన్ని 'చంద్రనాడి' అంటారు. ఇచ్ఛ ఉన్నా క్రియాశక్తి లేకపోతే ఏదీ చేయలేం. ఇడా నాడిమీద చంద్రుడి ప్రభావం ఎక్కువగా పడితే... అది ఎడమ పార్శ్వాన్ని ప్రభావితం చేసి మనలో సోమరితనాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు జీవనోపాధికి ఏదైనా చేయాలని, ఉద్యోగం కావాలనీ కోరుకున్నా... దాని కోసం ఎలాంటి ప్రయత్నం చేయకుండా... అతిగా ఆలోచిస్తూ ఉన్నారనుకోండి. అది ఇచ్ఛాశక్తే. కానీ దానిలో క్రియాశక్తి (ఆచరణ) లేదు. ఆచరణ లేకుండా ఆలోచించడం వల్ల ప్రయోజనం లేదు. కాబట్టి మనలోని సూర్య నాడిని, చంద్రనాడిని ప్రతినిత్యం ధ్యానం ద్వారా సమతుల్య స్థితిలో ఉంచుకోవాలి. అది సహజయోగ ధ్యానం ద్వారానే సాధ్యమవుతుంది.

(శ్రీమాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)



> చంద్రుడితో పాటు ఇతర గ్రహాల గమనం ప్రభావం మనమీద ఉంటుంది. అందుకనే చాంద్రమానాన్ని అనుసరించి మన పండుగలు ఉంటాయి. ఒకే ఒక పండుగ సౌరమానాన్ని అనుసరించి ఉంటుంది. అదే సంక్రాంతి.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ





చిక్కులు తెచ్చిపెట్టిన నయన్ అన్నపూరణి

నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగింపు



ఇటీవలే ఓటీటీ స్ట్రీమింగ్ మొదలైన నయనతార రీసెంట్ మూవీ 'అన్నపూరణి'ని ఉన్నట్టుండి ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి తొలిగించారు. స్వయంగా ఆ చిత్ర నిర్మాణసంస్థ అయిన జీ స్టూడియోస్ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి 'అన్నపూరణి' థియేటర్లలో కూడా పెద్దగా ఆడలేదు. థియేటర్లలో మిశ్రమ స్పందనతో నిర్మాతకు నష్టాలే తెచ్చిపెట్టింది. రీసెంట్‌గా ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేశారు. అసలు చిక్కు ఇక్కడే వచ్చింది. కథ ప్రకారం ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా ఉన్నాయని పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చారు. నయన్‌తోపాటు చిత్రబృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబైలో కేసులు నమోదయ్యాయి. దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించింది. మతవిశ్వాసాలను కించపరిచే ఉద్దేశం తమకు లేదని, తమకు అన్ని మతాలూ సమానమేనని, ఈ విషయంలో తెలిసిగానీ, తెలియకగానీ ఎవర్నయినా బాధపెట్టి ఉంటే క్షమించాలని జీ స్టూడియోస్ వివరణ ఇచ్చుకుంది. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది? అనే ప్రశ్నకు సమాధానమే 'అన్నపూరణి' కథ. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

ఫిబ్రవరిలో హ్యాపీ ఎండింగ్



యష్ పూరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. అపూర్వ రావ్ కథానాయిక. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు తీసకొస్తున్నట్లు యూనిట్ గురువారం తెలిపింది. 'ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కని ఆదరణ లభిస్తోంది, వైవిధ్యమైన కథతో 'హ్యాపీ ఎండింగ్' చిత్రాన్ని రూపొందించాం' అని మేకర్స్ తెలిపారు. అజయ్ ఘోష్, విష్ణు, ఝాన్సీ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: రవి నిడమర్తి. సినిమాటోగ్రఫీ: అశోక్ సీపల్లి







గాయత్రీ ప్రాజెక్ట్స్ లిక్విడేషన్‌కు రుణదాతల మొగ్గు!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గాయత్రీ ప్రాజెక్ట్స్‌ను విక్రయించే ప్రక్రియ చేపట్టాలని కంపెనీకి రుణాలు ఇచ్చిన రుణదాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా రూ.650 కోట్లకు గాయత్రీ ప్రాజెక్ట్స్‌ను సొంతం చేసుకోవడానికి మార్క్ ఏబీ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ఎల్ఎల్ఎల్‌సీ ముందుకు వచ్చిందని మార్కెట్ వర్గాల కథనం. ఇందులో భాగంగా ముందుగా రూ.50 కోట్లను చెల్లించడానికి అంగీకరించింది. దివాలా పరిష్కార ప్రక్రియలో మార్క్ ఏబీ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ మాత్రమే తుది బిడ్ దాఖలు చేసినట్లు సమాచారం. మార్క్ ఏబీ క్యాపిటల్ ఆఫర్ చేసిన విలువ చాలా తక్కువని రుణదాతలు భావించి.. దాన్ని తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 60 శాతానికి పైగా రుణదాతలు కంపెనీ లిక్విడేషన్‌కు మొగ్గు చూపినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. లిక్విడేషన్‌కు రిసొల్యూషన్ ప్రొఫెషనల్ ఇప్పటికే పిటిషన్ దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాల సమాచారం. కాగా కంపెనీ ప్రమోటర్లు ఇన్‌సాల్వెన్సీ ప్రాసెస్‌ను నిలిపివేయాలని ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేశారు. ఇది ఇంకా విచారణకు రావాల్సి ఉంది. రుణదాతలకు గాయత్రీ ప్రాజెక్ట్స్ రూ.9,000 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ఇందులో బ్యాంకులకు రూ.7,147 కోట్లు చెల్లించాలి.

'క్రిప్టో'ల వేలంవెర్రిని భరించలేం

● ఆర్‌బీఐ గవర్నర్ దాస్

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ మరోసారి క్రిప్టో కరెన్సీలపై తన వ్యతిరేకతను వెల్లడించారు. వర్ధమాన దేశాలు గానీ, సంపన్న దేశాలు గానీ 'క్రిప్టో' కరెన్సీల వేలంవెర్రిని భరించలేవన్నారు. మింట్ పత్రి క నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాము ఏ దేశ రెగ్యులేటరీ సంస్థలను అనుసరించలేమని స్పష్టం చేశారు. అమెరికా క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషన్ '(ఎస్ఈసీ) క్రిప్టో కరెన్సీల ఈటీఎఫ్‌లను అనుమతించిన నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ దాస్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. 'ఒకరికి మంచిదైంది మరొకరికి మంచిది కాకపోవచ్చు. ఈ విషయంలో నా అభిప్రాయం, ఆర్‌బీఐ అభిప్రాయం గతంలో లానే ఉంది' అన్నారు.

అదుపు చేయడమూ కష్టమే: క్రిప్టో కరెన్సీలను ప్రోత్సహించే వర్ధమాన, సంపన్న దేశాల ఆర్థిక వ్యవస్థలకు పెద్ద ముప్పు పొంచి ఉందని శక్తికాంత దాస్ హెచ్చరించారు. ఈ ముప్పును అదుపు చేయడం కూడా కష్టమని స్పష్టం చేశారు. క్రిప్టో కరెన్సీల ఈటీఎఫ్‌లను అనుమతిస్తూనే.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అమెరికా ఎస్ఈసీ హెచ్చరించిన విషయాన్ని ఆర్‌బీఐ గవర్నర్ గుర్తు చేశారు

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,830 ▼	57,600 ▼	77,500 ▼
ముంబై	62,262 ▼	57,032 ▼	71,532 ▲

టీసీఎస్ లాభం రూ.11,735 కోట్లు

ఆదాయం రూ.60,583 కోట్లు

అంచనాల కంటే తగ్గిన ఆర్డర్లు ● ఒక్కో షేరుకు రూ.27 డివిడెండ్




ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24).. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) టీసీఎస్ ఆర్థిక పనితీరు మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే నమోదైంది. కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 8.2 శాతం వృద్ధితో రూ.11,735 కోట్లకు చేరుకోగా.. ఆదాయం 4 శాతం పెరిగి రూ.60,583 కోట్లుగా నమోదైంది. భారత్ సహా వర్ధమాన మార్కెట్లో కంపెనీ వ్యాపారం రెండంకెల్లో వృద్ధి చెందడం ఇందుకు దోహదపడింది. ఎనర్జీ, రిసోర్సెస్, యుటిలిటీస్, మాన్యుఫాక్చరింగ్, లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ రంగా క్లయింట్ల నుంచి ఆదాయం పెరగడం కూడా కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. సమీక్షా కాలానికి టీసీఎస్ నిర్వహణ మార్జిన్ 0.50 శాతం వృద్ధితో మార్కెట్ అంచనాలను మించి 25 శాతానికి ఎగబాకింది. కాగా, నికర మార్జిన్ 19.4 శాతంగా నమోదైంది. మరిన్ని విషయాలు..

- గడిచిన మూడు నెలల్లో కంపెనీ దక్కించుకున్న కాంట్రాక్టుల మొత్తం విలువ 810 కోట్ల డాలర్లకు పరిమితమైంది. క్యూ2లో లభించిన 1,120 కోట్ల డాలర్ల ఆర్డర్లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. అంతేకాదు, కంపెనీ అంచనా 900-1,000 కోట్ల డాలర్ల కన్నా తక్కువే.
- ఈ ఆర్థిక సంవత్సరానికి గాను టీసీఎస్ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకు మొత్తం రూ.27 డివిడెండ్ ప్రకటించింది. అందులో రూ.9 మధ్యంతర డివిడెండ్ కాగా, మరో రూ.18 ప్రత్యేక డివిడెండ్‌నూ చెల్లించనుంది. తొలి, రెండో త్రైమాసికాల్లోనూ కంపెనీ రూ.9 చొప్పున మధ్యంతర డివిడెండ్లను చెల్లించింది. అంటే, ఈ ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు సంస్థ ప్రకటించిన మొత్తం డివిడెండ్ రూ.45కు చేరుకుంది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను ఈ నెల 19న రికార్డు చేసి, వచ్చే నెల 5న చెల్లింపులు జరపనున్నట్లు కంపెనీ తెలిపింది.
- గడిచిన త్రైమాసికంలో టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య 5,680 తగ్గి 6,03,305కు పడిపోయింది. వరుసగా రెండు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గింది. క్యూ2లో కంపెనీ నుంచి నికరంగా 6,333 మంది వలసపోయారు. కాగా, క్యూ3లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 13.3 శాతానికి తగ్గింది.

బోణీ డీలా!

దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్‌కు బోణీ చేశాయి. సాధారణంగానే ఐటీ రంగానికి క్యూ3 బలహీన త్రైమాసికం. ఈ రంగానికి అధిక ఆదాయ మార్కెట్లు అయిన అమెరికా, ఐరోపాలో ఆర్థిక మందగమనం గడిచిన మూడు నెలల్లో ఐటీ కంపెనీల పనితీరును మరింత ప్రభావితం చేసింది. దాంతో సమీక్షా కాలానికి టీసీఎస్ లాభం స్వల్ప వృద్ధికి పరిమితం కాగా.. ఇన్ఫీ ప్రాఫిట్ క్షీణించింది. మార్కెట్ అంచనాలను కూడా అందుకోలేకపోయింది.



ఇన్ఫీ లాభంలో 7.3% క్షీణత

క్యూ3లో రూ.6,106 కోట్లకు పరిమితం

ఆదాయం రూ.38,821 కోట్లుగా నమోదు

బెంగళూరు: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఇన్ఫోసిస్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 7.3 శాతం తగ్గి రూ.6,106 కోట్లకు పడిపోయింది. ఏకీకృత రాబడి మాత్రం 1.3 శాతం పెరిగి రూ.38,821 కోట్లకు చేరుకుంది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి ఆదాయ అంచనాను గతంలో ప్రకటించిన 1-2.5 శాతం నుంచి 1.5-2 శాతానికి కుదిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. గడిచిన మూడు త్రైమాసికాల్లో స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి 1.8 శాతంగా నమోదైందని, నాలుగో త్రైమాసిక పనితీరును కూడా దృష్టిలో పెట్టుకుని ఆదాయ అంచనాను కుదించినట్లు కంపెనీ పేర్కొంది. 20-22 శాతం నిర్వహణ మార్జిన అంచనాను మాత్రం యథాతథంగా కొనసాగించింది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- గడిచిన మూడు నెలల్లో ఓ మెగా డీల్‌తో కలిపి 320 కోట్ల డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులను దక్కించుకున్నట్లు కంపెనీ తెలిపింది. అందులో కొత్తగా లభించిన నికర ఆర్డర్ల విలువే 71 శాతమని కంపెనీ స్పష్టం చేసింది. అయితే, క్యూ2లో లభించిన 770 కోట్ల డాలర్ల డీల్స్‌తో పోలిస్తే విలువ సగానికి పైగా తగ్గింది.
- వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ ఇన్ఫీలో ఉద్యోగులు తగ్గారు. ఈ డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో సంఖ్య వార్షిక ప్రాతిపదికన 7 శాతం (6,101) తగ్గి 3,22,663 మందికి పరిమితమైంది. అట్రిషన్ రేటు 12.9 శాతానికి తగ్గింది.

ఇన్ఫీ చేతికి ఇన్‌సెమీ

- బెంగళూరుకు చెందిన సెమీకండక్టర్ల (చిప్) డిజైనింగ్ సేవల కంపెనీ 'ఇన్‌సెమీ'ని రూ.280 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఇన్ఫీ బోర్డు ఆమోదం తెలిపింది. నియంత్రణ మండళ్ల అనుమతులకు లోబడి ఈ మార్చి చివరి నాటికల్లా డీల్ పూర్తి కావచ్చని అంచనా. ఇన్‌సెమీ కొనుగోలుతో ఇన్ఫోసిస్ కొత్త రంగంలోకి అడుగు పెట్టడమే కాకుండా, ఇప్పటివరకు ఈ రంగం నుంచి లేని క్లయింట్లను కూడా దక్కించుకునేందుకు వీలు కలుగనుందని కంపెనీ సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్ అన్నారు. ప్రస్తుతం 50,000 కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న సెమీకండక్టర్ల మార్కెట్ మరికొన్నేళ్లలో లక్ష కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా.

ప్రాంగణ నియామకాల్లేవ్..

- ఐటీ సేవలకు తగినంత డిమాండ్ లేని కారణంగా ఈ సారి ప్రాంగణ నియామకాలు చేపట్టకపోవచ్చని నీలాంజన్ రాయ్ తెలిపారు. ఒకవేళ మరింత మంది ఉద్యోగులు అవసరమైన పక్షంలో ఆఫ్-క్యాంపస్ నియామకాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.

మళ్లీ 10,000 కోట్ల డాలర్ల క్లబ్‌లోకి అంబానీ

ప్రపంచ సంపన్నుల్లో 11వ స్థానం

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ర్యాలీతో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ మళ్లీ 10,000 కోట్ల (100 బిలియన్) డాలర్ల క్లబ్‌లో చేరారు. గత రెండు రోజుల్లో ఆర్ఐఎల్ షేరు 5.4 శాతం లాభంతో రూ.2,718.40కి చేరాయి. గురువారం ఒక దశలో ఆర్ఐఎల్ షేరు రూ.2,724.95 జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో ఆర్ఐఎల్ మార్కెట్ క్యాప్ రూ.18 లక్షల కోట్లకు చేరింది. గత వారం రోజుల్లో అంబానీ నిర్వహణలోని నెట్‌వర్క్ 18, టీవీ18 బ్రాడ్‌కాస్ట్ కంపెనీల షేర్లు 24 నుంచి 45 శాతం పెరిగాయి. దీంతో అంబానీ నికర సంపద 10,501 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.71 లక్షల కోట్లు) చేరింది. 2021 తర్వాత అంబానీ 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరడం ఇదే మొదటిసారి. వంద బిలియన్ డాలర్లకుపైగా నికర సంపద ఉన్న కుబేరులు ప్రపంచంలో 12 మంది ఉంటే అందులో అంబానీ 11వ స్థానంలో ఉన్నారు.

గూగుల్‌లో మళ్లీ కొలువుల కోత

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా టెక్ కంపెనీల్లో కొలువుల కోత కొనసాగుతోంది. ఇంటర్నెట్ సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ తాజాగా మరింత మందిని ఇంటికి పంపింది. అయితే ఎంత మందిని ఉద్యోగాల నుంచి తొలగించిదనే విషయాన్ని మాత్రం కంపెనీ అధికారికంగా వెల్లడించలేదు. అయితే ఈ సంఖ్య వందల్లోనే ఉంటుందని తెలుస్తోంది. హార్డ్‌వేర్, వాయిస్ అసిస్టెన్స్, ఇంజనీరింగ్ టీమ్స్‌లో ఈ తీసివేతలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఖర్చుల తగ్గింపులో భాగంగా ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. గూగుల్ చర్యపై ఉద్యోగుల సంఘం మండిపడింది. తమ కష్టంతో ప్రతి త్రైమాసికంలో వందల కోట్ల డాలర్ల లాభాలు ఆర్జిస్తున్నా.. ఇలా అర్థాంతరంగా తమ పొట్ట కొట్టడం అన్యాయమని విమర్శించింది.

స్వల్ప లాభాలతోనే సరి

ముంబై: కార్పొరేట్ ఫలితాలు, దేశీయ ఆర్థిక గణాంకాలు, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు నిరాసక్తత చూపించటం తో స్టాక్ మార్కెట్ పరిమిత లాభాలతోనే సరిపెట్టుకుంది. సెన్సెక్స్ ఒక దశలో 342 పాయింట్లు లాభపడినప్పటికీ చివరికి 63.47 పాయింట్లకే ఆ లాభాన్ని పరిమితం చేసుకుని 71,721.18 వద్ద ముగిసింది. నిఫ్టీ 28.50 పాయింట్ల లాభం తో 21,647.20 వద్ద క్లోజైంది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు లాభాలతో ముగిశాయి.

- రియల్టీ ప్రాజెక్టుల నిర్మాణంలోని సన్మిట్ ఇన్‌ఫ్రా లిమిటెడ్.. బయో సీఎన్‌జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు రెడీ అవుతోంది. ఈ ప్రతిపాదనకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. త్వరలోనే ప్లాంట్ ఏర్పాటు పనులు ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది. వచ్చే రెండు మూడేళ్లలో కంపెనీ వ్యాపార కార్యకలాపాలను భిన్న రంగాల్లోకి విస్తరించాలన్న ప్రణాళికకు అనుగుణంగా ఈ బయో సీఎన్‌జీ ప్లాంట్‌ను కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో కంపెనీ రూ.52.5 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.
- అమెరికాలోకి మియామీకి చెందిన ఫిట్‌నెస్ స్టూడియో ఎయిర్‌ల్యాబ్ ఫిట్‌నెస్‌తో గ్లోబల్ ఎయిర్ కంప్రెసర్ తయారీ దిగ్గజం ఎల్జీ ఎక్విప్‌మెంట్ జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా ఆస్ట్రేలియాకు చెందిన ఆల్టిట్యూడ్ ట్రైనింగ్ సిస్టమ్స్ (ఏటీఎస్)కు చెందిన హైపోక్సిక్ ఎయిర్ చాంబర్స్‌లో హై ఆల్టిట్యూడ్ ట్రైనింగ్ వాతావరణాన్ని కల్పించేందుకు ఎల్జీ ఈజీ37 సిరీస్ న్యూ ఎయిర్ కంప్రెషర్లతో ప్రత్యేకంగా ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.
- దక్షిణాదికి చెందిన ఉపానల్ సీఎన్‌సీ సొల్యూషన్స్‌తో మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీస్ ప్రొవైడర్ ఫిలిప్స్ మెషీన్ టూల్స్ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందంగా ఉపానల్‌కు చెందిన ఖాతాదారులు మెటల్ కటింగ్ పోర్టుఫోలియోలో మరిన్ని సేవలు అందుకునే అవకాశం లభించనుంది.
- మెట్రో క్యాష్ అండ్ క్యారీ.. కిరాణా దుకాణాదారుల కోసం మెట్రో కిరాణా ఉత్సవ్ పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల 14 వరకు ఇది అందుబాటులో ఉండనుంది. మెట్రో హోల్‌సేల్ స్టోర్లు, మెట్రో యాప్‌లో ఈ ఆఫర్స్ అందుబాటులో ఉంటాయి.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు అదుర్స్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ పన్నుల వసూళ్లు జోరందుకున్నాయి. ఈ నెల 10వ తేదీ నాటికి నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు (కార్పొరేట్ ట్యాక్స్+వ్యక్తిగత ఆదాయ పన్ను) రూ.14.7 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 19.41 శాతం ఎక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్న రూ.18.23 లక్షల కోట్లలో ఇది 81 శాతానికి సమానం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
12 జనవరి		విశాఖపట్నం	599
చిత్తూరు	563	వరంగల్	542
గోదావరి	555	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	87	గోదావరి	86
వరంగల్	87	విజయవాడ	86
కరీంనగర్	87	గుంటూరు	87
మహబూబ్‌నగర్	87	ఒంగోలు	87
కర్నూలు	87	చిత్తూరు	95
విశాఖపట్నం	81		

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ



కౌలాలంపూర్: ప్రపంచ బ్యాడ్మింటన్ డబుల్స్ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మలేసియా ఓపెన్ సూపర్ సిరీస్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం ముగిసిన ప్రీక్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ 21-11, 21-18తో లుకాస్ కోర్వీ-రొనాన్ లాబార్ (ఫ్రాన్స్) ద్వయంపై నెగ్గి, ముందంజ వేసింది. గత ఏడాది సాత్విక్ జోడీ ఆసియా క్రీడలతో సహా ఆరు టైటిళ్లు సాధించడం తెలిసిందే. ఇక సింగిల్స్ రెండో రౌండ్లో కిడాంబి శ్రీకాంత్ 13-21, 17-21తో లాంగ్ అంగస్ (హాంకాంగ్) చేతిలో ఓటమి పాలై, టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో జోడీ 21-19, 13-21, 21-15తో వకానా నగహారా-మయు మత్సుమోటో (జపాన్)పై గెలిచి, క్వార్టర్స్‌లో ప్రవేశించింది.



పోరాడి ఓడిన తెలుగు యోధాస్

అల్టిమేట్ ఖో-ఖో లీగ్ ఫైనల్లో చెన్నై, గుజరాత్

కటక్: అల్టిమేట్ ఖో-ఖో లీగ్ సెమీఫైనల్లో చెన్నై క్విక్ గన్స్ చేతిలో తెలుగు యోధాస్ జట్టు ఓటమి పాలైంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఒడిశా జగర్‌నాట్స్‌కు షాకిచ్చిన గుజరాత్ జెయింట్స్ ఫైనల్ చేరింది. గురువారం జరిగిన రెండో సెమీస్ పోరులో చెన్నై క్విక్ గన్స్‌పై ఆట ప్రారంభం నుంచి దాదాపుగా చివరి వరకు తెలుగు యోధాస్‌దే పైచేయిగా సాగింది. అయితే చివరి నాలుగు నిమిషాల్లో యోధాస్ ఆధిక్యం 26-24కు తగ్గింది. ఆఖరి రెండు నిమిషాల్లో చెన్నై ప్లేయర్ రాంజీ మ్యాజిక్‌తో ఆ జట్టు 31-29తో విజయం సాధించింది. అంతకు ముందు తొలి సెమీఫైనల్లో గుజరాత్ జెయింట్స్ 29-27తో ఒడిశాపై నెగ్గింది. ఇక, శనివారం జరిగే మెగా ఫైనల్లో గుజరాత్ జెయింట్స్‌తో చెన్నై క్విక్ గన్స్, మూడో స్థానం పోరులో ఒడిశాతో యోధాస్ తలపడనుంది.

రిథమ్‌కు ఒలింపిక్ బెర్త్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్లు రికార్డు స్థాయిలో పాల్గొనబోతున్నారు. తాజాగా 20 ఏళ్ల యువ షూటర్ రిథమ్ సాంగ్వాన్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కింది. గురువారం జకార్తాలో జరిగిన ఆసియా ఒలింపిక్ క్వాలిఫికేషన్స్ మహిళల 25 మీ. స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో కాంస్యంతో తన



స్థానం ఖాయం చేసుకుంది. దీంతో ఈ ఏడాది జులై-ఆగస్టుల్లో జరిగే ఒలింపిక్స్‌లో భారత్ నుంచి అత్యధికంగా 16 మంది షూటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో 15 మంది షూటర్లు మాత్రమే భారత్ తరఫున పాల్గొన్నారు.

జింబాబ్వేపై లంక సిరీస్ గెలుపు

● హసరంగకు 7 వికెట్లు ● మూడో వన్డేలో విజయం

కొలంబో: హసరంగ (7/19) తిప్పేయడంతో.. మూడో, ఆఖరి వన్డేలో శ్రీలంక 8 వికెట్లతో జింబాబ్వేను ఓడించింది. దీంతో శ్రీలంక సిరీస్‌ను 2-0తో గెల్చుకుంది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 27 ఓవర్లకు కుదించారు. తొలుత జింబాబ్వే 22.5 ఓవర్లలో 96 పరుగులకు కుప్పకూలగా, లంక 16.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

స్పోర్ట్స్

స్కోరుబోర్డు

అఫ్ఘాన్: గుర్బాజ్ (స్టంప్) జితేశ్ (బి) అక్షర్ 23; ఇబ్రహీం జద్రాన్ (సి) రోహిత్ (బి) దూబే 25; ఒమర్జాయ్ (బి) ముకేశ్ 29; రహ్మత్ షా (బి) అక్షర్ 3; నబీ (సి) రింకూ (బి) ముకేశ్ 42; నజీబుల్లా (నాటౌట్) 19; జనత్ (నాటౌట్) 9; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 158/5. వికెట్ల పతనం:** 1-50, 2-50, 3-57, 4-125, 5-130; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-1-28-0; ముకేశ్ 4-0-33-2; అక్షర్ 4-0-23-2; సుందర్ 3-0-27-0; దూబే 2-0-9-1; బిష్ణోయ్ 3-0-35-0.

భారత్: రోహిత్ (రనౌట్) 0; గిల్ (స్టంప్) గుర్బాజ్ (బి) ముజీబుర్ 23; తిలక్ వర్మ (సి) గుల్బదిన్ (బి) ఒమర్జాయ్ 26; దూబే (నాటౌట్) 60; జితేశ్ (సి) ఇబ్రహీం (బి) ముజీబుర్ 31; రింకూ సింగ్ (నాటౌట్) 16, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 17.3 ఓవర్లలో 159/4. వికెట్ల పతనం:** 1-0, 2-28, 3-72, 4-117; **బౌలింగ్:** ఫరూఖీ 3-0-26-0; ముజీబుర్ 4-1-21-2; నబీ 2-0-24-0; నవీనుల్ 3.3-0-43-0; ఒమర్జాయ్ 4-0-33-1; నబీ 1-0-12-0.

1 భారత్‌పై టీ20ల్లో తమ అత్యధిక స్కోరు (158/5) సాధించిన అఫ్ఘాన్



దూబే దూకుడు

తొలి టీ20 భారత్‌దే బోణీ

6 వికెట్లతో అఫ్ఘాన్‌పై విజయం

మొహాలీ: అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. టీ20 ప్రపంచకప్‌లో చోటు ఆశిస్తున్న శివమ్ దూబే (40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 60 నాటౌట్) బ్యాట్‌తోనూ, బంతి (2-0-9-1)తోనూ అదరగొట్టాడు. దీంతో గురువారం జరిగిన తొలి టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. రెండో మ్యాచ్ ఆదివారం ఇండోర్‌లో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసింది. నబీ (27 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 42), అజ్మతుల్లా (29) రాణించారు. అక్షర్, ముకేశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 17.3 ఓవర్లలో 4 వికెట్లకు 159 పరుగులు చేసి గెలిచింది. జితేశ్ (31), తిలక్ (26), గిల్ (23) ఆకట్టుకున్నారు. ముజీబుర్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా శివమ్ దూబే నిలిచాడు.

చెలరేగిన శివమ్: ఓ మాదిరి ఛేదనలో మిడిలార్డర్ బ్యాటర్ శివమ్ దూబే సూపర్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చక్కటి భాగస్వామ్యాలతో జట్టును విజయం దిశగా నడిపాడు. అయితే 14 నెలల బ్రేక్ తర్వాత టీ20 ఆడిన కెప్టెన్ రోహిత్ ఖాతా తెరవకుండా ఇన్నింగ్స్ రెండో బంతికే రనౌటయ్యాడు. నాన్‌స్ట్రయికర్ ఎండ్‌లో ఉన్న గిల్ (23).. కెప్టెన్ పిలుపును పట్టించుకోకుండా బంతి వైపే చూస్తుండిపోయాడు. ఈలోగా రోహిత్ మరో ఎండ్‌కు చేరడంతో త్రో అందుకున్న కీపర్ గుర్బాజ్ వికెట్లను గిరాటేశాడు. అయితే గిల్ ఆ తర్వాత ధాటిగా ఆడి ఐదు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. మరోసారి భారీ షాట్‌కు వెళ్లి నాలుగో ఓవర్లో స్టంపౌట్ అయ్యాడు. పవర్‌ప్లేలో 36 పరుగులే చేసినా.. శివమ్ దూబే మెరుపు ఇన్నింగ్స్‌తో మూడు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. తిలక్‌తో కలిసి మూడో వికెట్‌కు 44, జితేశ్‌తో నాలుగో వికెట్‌కు 45 పరుగులు జత చేశాడు. 14వ ఓవర్లో ముజీబ్ బంతికి జితేశ్ అవుటయ్యాడు. 38 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన దూబే 18వ ఓవర్లో వరుసగా 6,4 బాదేసి మ్యాచ్‌ను ముగించాడు. అప్పటికి ఐదో వికెట్‌కు దూబే అజేయంగా రింకూతో కలిసి 42 పరుగులు జత చేయడం విశేషం.

నబీ జోరుతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ జట్టు తమ ఇన్నింగ్స్‌ను ఆత్మవిశ్వాసంతోనే ఆరంభించింది. తొలి పది ఓవర్లలో 57 పరుగులే చేసినా.. ఆ తర్వాత గేరు మార్చి ఏకంగా 101 పరుగులు రాబట్టింది. టాపార్డర్‌లో గుర్బాజ్, జద్రాన్, ఒమర్జాయ్ భారత బౌలర్లను చక్కగా ఎదుర్కొన్నారు. మిడిలార్డర్‌లో వెటరన్ నబీ అదరగొట్టాడు. దీనికితోడు డెత్ ఓవర్లలో బౌండరీల రూపంలో ధారాళంగా పరుగులు రావడంతో అఫ్ఘాన్ సునాయాసంగా 150 దాటేసింది. పేసర్ అర్ష్‌దీప్, దూబే మాత్రం కట్టడి చేయగలిగారు. ఓపెనర్లు గుర్బాజ్, జద్రాన్ క్రీజులో నిలదొక్కుకుంటూ తొలి వికెట్‌కు 50 పరుగులు జత చేసి వరుస ఓవర్లలో వెనుదిరిగారు. అనంతరం అరంగేట్ర బ్యాటర్ రహ్మత్ షా (3) విఫలం కావడంతో టపటపా మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో నబీ, ఒమర్జాయ్ జట్టును ఆదుకున్నారు. 15వ ఓవర్లో ఒమర్జాయ్ సిక్సర్, నబీ రెండు ఫోర్లు, తర్వాతి ఓవర్లో నబీ రెండు సిక్సర్లతో స్కోరులో వేగం పెరిగింది. అయితే 18వ ఓవర్లో ముకేశ్ ఈ ఇద్దరినీ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయినా చివరి రెండు ఓవర్లలో నజీబుల్లా (19 నాటౌట్), జనత్ (9 నాటౌట్)ల తుఫాన్ ఇన్నింగ్స్‌తో 28 పరుగులు రాబట్టింది.



పారా క్రీడల్లో తెలుగోళ్ల సత్తా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో ముగ్గురు తెలుగు క్రీడాకారులు పతకాలు సాధించారు. గోవాలో జరుగుతున్న ఈ పోటీల్లో గురువారం ముగిసిన హైజంప్ టి-44 కేటగిరీ పోటీల్లో ఐ.శ్యామ్ (గుంటూరు) రజతం సొంతం చేసుకున్నాడు. పోలియో బాధితుడైన శ్యామ్ 170 సెంటీమీటర్ల ఎత్తు దూకి ద్వితీయ స్థానంలో నిలిచాడు. అనంతపురానికి చెందిన అంధ క్రీడాకారిణి ఎస్.పల్లవి షాట్‌పుట్‌లో రజతంతో మెరిసింది. పల్లవి ఇనుప గుండును 6.13 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ పారా స్ప్రింటర్ మోహన్ హర్ష 100 మీటర్ల పరుగును 11.25 సెకన్లలో పూర్తి చేసి, కాంస్యం సాధించాడు.



బ్యాట్‌తో జొకో.. రాకెట్‌తో స్మిత్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ స్టీవ్ స్మిత్ టెన్నిస్‌లోనూ తన ప్రావీణ్యాన్ని చాటుకున్నాడు. ఈనెల 14న ఆరంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రచారంలో భాగంగా డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్‌తో కలిసి స్మిత్ సరదాగా మ్యాచ్ ఆడాడు. ఇందులో భాగంగా జొకో సర్వీస్‌ను స్మిత్ సరైన రీతిలో చక్కగా కోర్టు లోపలే రిటర్న్ చేయడం విశేషం. దీంతో స్మిత్ ఆటతీరుతో ఆశ్చర్యానికి లోనైన జొకోతో పాటు అభిమానులు కూడా చప్పట్లతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే జొకోవిచ్ కూడా క్రికెట్ బ్యాట్‌తో టెన్నిస్ బంతిని ఆడాడు. అయితే బ్యాట్‌తో సరిగా ఆడలేకపోవడంతో టెన్నిస్ రాకెట్‌ను ఉపయోగించి బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు.

అమన్ పసిడి పట్టు



జాగ్రెబ్: భారత రెజ్లర్ అమన్ షెహ్రావత్ జాగ్రెబ్ ఓపెన్‌లో స్వర్ణ పతకంతో సంచలనం సృష్టించాడు. గురువారం జరిగిన 57 కిలోల ఫైనల్లో అమన్ 10-0తో వరల్డ్ నెంబర్ 7 వాన్‌హో జౌ (చైనా)ను చిత్తుగా ఓడించాడు. దీపక్ పూనియా 86 కిలోల విభాగంలో తొలి రౌండ్లోనే ఓటమి పాలయ్యాడు. ఇక, డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ ఉండడంతో ప్రస్తుతం భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ తరఫున ఈ పోటీల్లో బరిలోకి దిగారు.

రాజీనామా బాటలో మిగిలిన ఇద్దరూ!?

» వైదొలగే యోచనలో టీఎస్‌పీఎస్సీలో మిగిలిన సభ్యులు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీలో మిగిలిన ఇద్దరు సభ్యులు కూడా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో గవర్నర్‌ను కలుసుకుని వారు తమ రాజీనామాలను సమర్పించాలని భావిస్తున్నారు. చైర్మన్, ముగ్గురు సభ్యులు రాజీనామాలు చేసినా.. కోట్ల అరుణ కుమారి, సుమిత్ర తనోబా కొనసాగుతున్నారు. చైర్మన్, ఇతర సభ్యుల రాజీనామాలను గవర్నర్ బుధవారం ఆమోదించిన నేపథ్యంలో.. వీరు కూడా తమ రాజీనామాలను సమర్పించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. వాటిని కూడా గవర్నర్ ఆమోదిస్తే.. టీఎస్‌పీఎస్సీలో మొత్తం సభ్యుల పోస్టులు ఖాళీ అవుతాయి. అప్పుడు కమిషన్ ప్రక్షాళనకు పూర్తిస్థాయిలో మార్గం సుగమం అవుతుంది. పూర్తిస్థాయిలో కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కమిషన్‌లో మొత్తం 11 మంది సభ్యులు, చైర్మన్‌ను నియమించే అధికారం ప్రభుత్వానికి ఉంది. కొత్తగా నియమించే చైర్మన్, సభ్యుల విషయంలో చాలా జాగ్రత్త చర్యల్ని తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా రంగాల్లోని నిపుణులతో ఈ పోస్టులను భర్తీ చేయాలని యోచిస్తోంది.

వెబ్‌సైట్‌లో వారి ఫొటోలే

చైర్మన్, సభ్యులు చేసిన రాజీనామాలు ఆమోదం పొందిన తర్వాత కూడా టీఎస్పీఎస్సీ వెబ్‌సైట్‌లో వారి వివరాలు, ఫొటోలే దర్శనమిస్తున్నాయి. సాధారణంగా సభ్యులు, లేదా చైర్మన్ పదవీ కాలం ముగిసినా.. రాజీనామాలు ఆమోదం పొందినా.. వెంటనే వారి వివరాలను వెబ్‌సైట్ నుంచి తొలగించాలి. కానీ, గురువారం రాత్రి వరకూ వెబ్‌సైట్లో వారి ఫొటోలు, వివరాలే ఉన్నాయి. దాంతో, నిరుద్యోగులకు ఉద్యోగాలను ఇవ్వడంలో ఘోరంగా విఫలమైన కమిషన్ కనీసం వెబ్‌సైట్ లోని వివరాలనైనా అప్‌డేట్ చేయారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవి కోసం ఢిల్లీలో పైరవీ!

ఖాళీ అయిన టీఎస్పీఎస్సీ చైర్మన్ పదవి కోసం పలువురు ప్రయత్నిస్తున్నారు. ఈ జాబితాలో ఓ ప్రొఫెసర్ కూడా ఉన్నారు. గత రెండు రోజులుగా ఆయన ఢిల్లీలో ఉంటూ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆయన ఇప్పటికే రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో కొనసాగుతున్నారు. అలాగే, ఓ యూనివర్సిటీకి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన ఎక్కువగా హైదరాబాద్‌లోనే ఉంటూ వర్సిటీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. గతంలో ఆ యూనివర్సిటీలో అనేక వివాదాలు చెలరేగాయి. ముఖ్యంగా, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఇతర వసతుల విషయంలో తీవ్ర ఆందోళనలు జరిగాయి. ఆయనను ఇన్‌చార్జి వీసీగా నియమించిన తర్వాత కూడా ఆ సమస్యలు పెద్దగా పరిష్కారం కాలేదన్న వాదన ఉంది.

నిరుద్యోగులకు మంచి రోజులు

» త్వరలోనే ఖాళీల భర్తీకి సీఎం చర్యలు:చనగాని దయాకర్

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, సభ్యుల రాజీనామాల ఆమోదంతో రాష్ట్రంలోని నిరుద్యోగులకు మంచి రోజులు రానున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలిపిందని, అందుకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇప్పటి వరకు పేపర్ లీకేజీ, మరో పక్క పోటీ పరీక్షల నిర్వహణ పారదర్శకంగా లేకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర అసంతృప్తితో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జెన్‌కోలో అక్రమంగా ఏఈ పోస్టు పొందిన ఉదంతంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కష్టపడి చదివే విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరుగకుండా ప్రభుత్వం పకడ్బందీగా పోటీ పరీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డిని దయాకర్ కోరారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి: సంజయ్



కరీంనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంపై జ్యుడీషియల్ విచారణను మేడిగడ్డకే పరిమితం చేస్తారా? అలాగైతే రూ.లక్ష కోట్ల అవినీతి తేలేదెలా? అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాన్ని అవలంబిస్తోందని ఆరోపించారు. కరీంనగర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన 3కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం తీగలగుట్టపల్లి రైల్వేస్టేషన్ ఆర్వోబీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోరితే సీబీఐ విచారణ చేపట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు. తెలంగాణ కోసం కేసీఆర్ రక్తం చిందించారన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కేసీఆర్ ఒంట్లో మద్యం తప్ప రక్తం ఎక్కడిదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి కేటీఆర్‌ను జైల్లో వేసి ఉండే వాళ్లమని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఉపేక్షిస్తుందో అర్థం కావడం లేదన్నారు.

వృద్ధ ఖైదీలను విడుదల చేయండి:కూనంనేని

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా కారాగారాల్లో శిక్ష అనుభవిస్తున్న 60 ఏళ్లు దాటిన వృద్ధ ఖైదీలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకుఆయన, సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. చిరకాలంగా కారాగారాల్లో మగ్గిపోతూ, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారిలో మంచి నడవడిక కలిగి ఉన్న ఖైదీలను నూతన ప్రభుత్వ కానుకగా జవనవరి 26న విడుదల చేయాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు.

అబద్ధపు హామీలతో అన్యాయం చేస్తున్న మోదీ

» ఏఐసీసీ అధికార ప్రతినిధి షమా అహ్మద్



అబద్ధపు హామీలతో ప్రధాని నరేంద్ర మోదీ తీరని అన్యాయం చేస్తున్నారని ఏఐసీసీ అధికార ప్రతినిధి షమా అహ్మద్ ఆరోపించారు. ఉద్యోగాలు, ఉపాధి లేక యువత అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని యువతను బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు. జనవరి 14 నుంచి రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో న్యాయ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం గాంధీభవన్‌లో షమా అహ్మద్ ఆవిష్కరించారు మణిపూర్ నుంచి ముంబై వరకు సుమారు 6700కిమీ పొడవునా రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొంటారన్నారు. మోదీ సర్కార్‌లో పెట్రోల్, గ్యాస్‌లతో పాటు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని విమర్శించారు.

రాజకీయాలకు శ్రీరాముణ్ని వినియోగిస్తున్న బీజేపీ

» టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్

సమస్త మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన శ్రీరాముణ్ని బీజేపీ స్వార్థ రాజకీయాల కోసం వినియోగించుకుంటోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ఆరోపించారు. ప్రపంచానికి ఆదర్శమూర్తిగా నిలిచిన శ్రీరామచంద్రమూర్తిని రాజకీయ ప్రయోజనం కోసం వినియోగించుకోవడం సమంజసం కాదన్నారు. జనవరి 22న అయోధ్యలో జరిగే శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరు కావడం లేదని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసిందని ఆయన గుర్తు చేశారు.

బీజేపీకి విక్రమ్ గౌడ్ గుడ్‌బై.. త్వరలో కాంగ్రెస్‌లోకి

అఫ్జల్‌గంజ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎం.ముఖేశ్ గౌడ్ తనయుడు, ఎం.విక్రమ్ గౌడ్ గురువారం బీజేపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ.. బీజేపీ అంటే క్రమశిక్షణ గల పార్టీ అని.. ఇచ్చిన మాట, సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటుందని నమ్మి కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరానని తెలిపారు. అయితే పార్టీలో చేరిన తనకు ఏనాడు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని.. కొత్త వారిలా తనను దూరం పెట్టారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనకు గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని మాట ఇచ్చి చివరి క్షణంలో రాజాసింగ్‌కు ఇచ్చారన్నారు. సంక్రాంతి తరవాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు విక్రం గౌడ్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.



ఢిల్లీలో కేంద్రమంత్రుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

అత్యంత పరిశుభ్ర నగరాలు ఇండోర్, సూరత్

» జీహెచ్ఎంసీకి 9వ ర్యాంకు

» ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత్య పరిశుభ్ర నగరాలుగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, గుజరాత్‌లోని సూరత్ నిలిచాయి. ఏడేళ్లుగా క్లీన్ సిటీగా అవార్డు దక్కించుకుంటున్న ఇండోర్ ఈ ఏడాది కూడా సూరత్‌తో కలిసి సంయుక్తంగా ఆ బహుమతి అందుకుంది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్- 2023 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. నవీ ముంబై అత్యంత్య పరిశుభ్రత నగరాల జాబితాలో మూడోస్థానంలో నిలిచింది. లక్షలోపు జనాభా ఉన్న పట్టణాల కేటగిరిలో సస్వాద్, పటాన్, లోనావాలా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పరిశుభ్రమైన గంగా పట్టణాల్లో వారణాసి, ప్రయాగ్ రాజ్ ప్రథమ, ద్వితీయ అవార్డులు గెలుచుకున్నాయి. ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలలో మహారాష్ట్ర మొదటిస్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తర్వాతి స్థానాలలో నిలిచాయి. లక్ష జనాభా పైబడిన నగరాల కేటగిరీలో గ్రేటర్ హైదరాబాద్ 9వ ర్యాంకును సాధించింది. కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ చేతుల మీదుగా జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం మొత్తం నాలుగు అవార్డులను దక్కించుకుంది. గుండ్లపోచంపల్లి (లక్ష కంటే తక్కువ జానాభా), నిజాంపేట (25-50 వేల జనాభా), సిద్దిపేట (50 వేలు-లక్ష జనాభా) పరిశుభ్రమైన పట్టణాల జాబితాలో నిలిచాయి. జీహెచ్ఎంసీకి అవార్డు రావడం పట్ల హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.

దోస్త్‌కు సర్వీస్

(మొదటిపేజీ తరువాయి)

సర్వే నంబర్లు 575, 580, 581లో నాటి హెచ్ఎండీఏ అధికారులు భూమిని సేకరించారు. ఆయా సర్వే నంబర్లలో సేకరణ అంశాన్ని నాటి పెద్దల అనుయాయులకు అనుకూలంగా మార్చుకున్నారు. హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన హద్దులను తొలగించారు. సర్వే నంబరు 575లో ముందుగా 3.18 ఎకరాలకు డిసెంబరు 2005లో నోటీఫై చేశారు. కానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ పెద్ద నాయకుడి అండతో దాన్ని 3.08 ఎకరాలకు తగ్గించారు. అయితే ఇప్పటికీ 2.29 ఎకరాలు మాత్రమే హెచ్ఎండీఏ అధీనంలో ఉంది. 10 గుంటల స్థలం ప్రైవేట్ పరిశ్రమ అధీనంలోనే ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ కోసం సర్వే నంబరు 580లో 5.17 ఎకరాల స్థలాన్ని నోటిఫై చేశారు. ఇందులో 13 గుంటల స్థలం జాతీయ రహదారికి పోయింది. 1.07 ఎకరాల్లో ఘట్‌కేసర్ నుంచి ఈసీఐఎల్‌కు వెళ్లే రోడ్డు ఉంది. 3.37 ఎకరాలను ఔటర్‌కు సేకరించారు. ప్రొసీడింగ్ నంబరు ఎల్ఏ, ఎల్ఏ(యూనిట్) 4/41-1/2005 ద్వారా స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థలానికి సంబంధించిన పరిహారాన్ని న్యాయస్థానంలో జమ చేశారు. సేకరించిన భూమిలో ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం రైస్‌మిల్లు, ధర్మకాంట, దాబా తదితర వ్యాపార సంస్థలు ఉన్నట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. సర్వే నంబరు 581లో 15 గుంటలు నోటిఫై కాగా ఇందులో 5 గుంటలు జాతీయ రహదారిలోకి వెళ్లింది. మిగతా 10 గుంటల స్థలానికి సంబంధించిన పరిహారాన్ని అప్పటి అధికారులు న్యాయస్థానంలో జమచేశారు. కాగా, సర్వే నంబరు 575లో 29 గుంటలు, 580లో 1.37 ఎకరాలు, 581లో 10 గుంటలు.. మొత్తం 2.26 ఎకరాల (14,036చదరపు గజాలు) భూమి పరిహారం కూడా పొందిన వారి అధీనంలోనే ఉండడం గమనార్హం.

2018 నుంచి క్రయవిక్రయాలు..!

ఔటర్ రింగ్ రోడ్డు కోసం సేకరించిన సర్వే నంబరు 580లోని భూముల క్రయవిక్రయాలు 2018 నుంచి కొనసాగుతున్నాయి. ప్రభుత్వం సేకరించిన ఈ భూములకు బ్యాంకులు సైతం రుణాలు ఇవ్వడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఈ భూములు ఐజీఆర్ఎస్ (రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్) నిషేధిత జాబితాలో లేకపోవడంతో యథేచ్ఛగా క్రయ విక్రయాలు సాగుతున్నాయి. దీంతో అక్రమంగా రుణాలు పొందుతున్నారు. స్పెషల్ కలెక్టర్ భూసేకరణ ప్రొసీడింగ్ నంబరు సీ/ఓఆర్ఆర్/1143/05 డేటెడ్ 30-10-2010తో ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని సూచించారు. అయినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ భూములను ఔటర్ ప్రాజెక్టు కోసం సేకరించినట్లు రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్ చేయాలంటూ మరోసారి 2017లో కూడా ప్రొసీడింగ్స్ జారీ చేశారు. వాటిని రిఫర్ చేస్తూ 2018లో హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ మళ్లీ కలెక్టర్‌కు లేఖ రాశారు. అవసరాలకు సేకరించిన స్థలాన్ని స్నేహితులకు నజరానాగా వదిలివేయడం విచారకరమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ స్థలంలో ఔటర్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా సర్వీస్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. నగరం చుట్టూ ఉన్న ఔటర్‌కు సర్వీస్ రోడ్డు వేశారు. కేవలం ఇక్కడ మాత్రమే నిర్మించలేదు. ఈ జంక్షన్‌లో మూడు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ఒక వైపు వదిలేశారు. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత పురపాలక మంత్రి స్నేహితుడి కోసమే సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్లోవర్ లీఫ్(ఆకు) ఆకారంలో జంక్షన్లు నిర్మించాలని నాటి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వాటన్నింటినీ తుంగలో తొక్కి తమ ఇష్టానుసారం వ్యవహరించినట్లు తెలుస్తోంది. 14,036 చదరపు గజాల ఖరీదైన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, పరిశ్రమలు వెలిశాయి. ఇంకొన్ని నూతన నిర్మాణాలూ చేపడుతున్నారు. మరికొందరు అద్దెకు ఇచ్చి లబ్ధి పొందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ చేపట్టి, సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
PROCEEDINGS OF THE SPECIAL DEPUTY COLLECTOR, L.A. UNIT -IV, ORR, TARNAKA, HYDERABAD.
Present : K.Ma[illegible]

Proc. No. L.A. /Unit -IV/43-1 /2005 Dated: 22-01-2009

Sub :- L.A. ORR- HUDA - R.R. District-Ghatkesar Mandal-Ghatkesar Village Sy. Nos. 69/1, 70, 71, 72, 73, 74, 88, 564, 565, 566, 575, 577, 578 [illegible] General Award passed - Orders issued - Regarding

Ref:- 1. Estate Officer, Begumpet, Lr. No. L.A/5138/2005/HUDA dated: 12-12-2005
2. This Office Lr. No. L.A/Unit-IV/43-1/2005 Dated:14-12-2005.
3. Project Director ORR & Special Collector (L.A) Proc. No. C/ORR/ 1148/2005 dt-14-12-2005 (DN No. 231 dated: 14-12-05).
4. Project Director ORR & Special Collector (L.A) Proc. No. C/ORR/1148/2005 dt. 30-11-2006 (Addm to DN No. 185 Dated: 25-11-06).
5. Project Director ORR & Special Collector (L.A) Proc. No. C/ORR/ 1148/2005 dt: 18-12-2006
6. A.P. Gazette ORR. No. 210 dated: 18-12-2006 (D.D). G.O.Ms.No. 14 Infrastructure & Investment (HD-2) Dept., Dated: 18-12-2006.
7. P.V. approved by P.D. & Spl. Collector, L.A., ORR Proc No. C/1148/05 dated: 21-3-2007.
8. Dy.IOS 's Enjoyment Survey report.

2009లో భూసేకరణకు ఇచ్చిన జీవో

ఔటర్‌కు సేకరించిన భూములను పరిరక్షించాలి



గతంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సేకరించిన భూములను పరిరక్షించాలి. ఏళ్లుగా సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడం విచారకరం. భూసేకరణలో అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- ఎస్.జీవన్‌కుమార్, మానవ హక్కుల వేదిక నేత

ప్రభుత్వ ఆస్తులను స్నేహితులకు ధారాదత్తం చేశారు



ఔటర్‌రింగ్ రోడ్డు మలుపులకు మూల కారణం గత ముఖ్యమంత్రి కార్యాలయమే. వారి స్నేహితుల ఆస్తులను కాపాడేందుకు అనేక కుట్రలు, కుతంత్రాలు జరిగాయి. అందులో భాగంగా ఘట్‌కేసర్‌లో కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. వెంటనే సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలి.

- జె.కిషన్, న్యాయవాది

ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో ఎమ్మెల్యేల కోటా కింద ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికల నిర్వహణ విషయమై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. గత నెల 9న కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు విడివిడిగా ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొంటూ ఈనెల 4వ తేదీన కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటన జారీచేసింది. విడివిడిగా ఎన్నికలు నిర్వహించడం వల్ల తమకు నష్టం జరుగుతుందని పేర్కొంటూ భారత రాష్ట్ర సమితి జాతీయ అధికార ప్రతినిధి పటోళ్ల కార్తీక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (4), ఎన్నికల నియమావళి రూల్ 70 ప్రకారం ఖాళీ అయిన రెండు స్థానాలకు ఒకే ఉప ఎన్నిక (సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓట్) నిర్వహించాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం జారీ చేసింది రాజీనామాల ద్వారా ఏర్పడ్డ ఖాళీల భర్తీకి చెందిన షెడ్యూల్ అని చెప్పారు. గురువారమే నోటిఫికేషన్ జారీ అయినందున కోర్టులు జోక్యం చేసుకోలేవని చెప్పారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం పిటిషన్‌ను తిరస్కరించింది.

ఎమ్మెల్సీల ఉప ఎన్నికకు నోటిఫికేషన్

శాసన మండలిలోని రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటికి సంబంధించి గురువారం ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ 18న ముగియనుంది. 19న నామినేషన్ల పరిశీలన, 22న ఉప సంహరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. 29న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను ప్రకించనున్నారు.

రామాలయం పూర్తయిందని కాంగ్రెస్‌కు కడుపు మంట..!

» ఆహ్వానాన్ని తిరస్కరించడం దివాళాకోరుతనమే:కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర నిర్మాణం ప్రధాని మోదీ హయాంలోనే పూర్తి కావడం కాంగ్రెస్ నాయకత్వానికి కడుపు మంటగా మారిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆ కడుపుమంట నివారణకు ఏ మందూ లేదని వ్యాఖ్యానించారు. అయోధ్యలో ఈనెల 22న జరిగే పవిత్ర కార్యక్రమం రాజకీయపరమైంది కాదని యావత్ జాతికి సంబంధించిందన్నారు. బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమ ముహూర్తం శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు నిర్ణయించిందని, దానికి బీజేపీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ ఆహ్వానాన్ని కాంగ్రెస్ తిరస్కరించడం దివాళాకోరుతనమేనని ఎద్దేవా చేశారు. ఓటు బ్యాంకు, మతతత్వ రాజకీయాల కోసమే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. 'కాంగ్రెస్ డీఎన్ఏలోనే హిందూత్వ వ్యతిరేకత ఉంది. రాముడి ఉనికినే కొట్టివేసిన చరిత్ర ఆ పార్టీది. అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతల పంపిణీని హైదరాబాద్‌లో పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గం.' అని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేఎల్పీపై తేల్చని అధినాయకత్వం!

ఎమ్మెల్యేల్లో అసహనం..తెరపైకి బీసీ నినాదం

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ శాసనసభాపక్ష నేత పదవి(బీజేఎల్పీ)పై అధినాయకత్వం ఎటూ తేల్చకపోవడం.. ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో అసహనానికి దారితీస్తోంది. అసెంబ్లీ తొలి సెషన్ ముగిసినా బీజేఎల్పీ నేత ఎవరో ప్రకటించకపోవడం వల్ల ప్రత్యర్థులకు విమర్శలు చేసే అవకాశం ఇచ్చినట్లవుతోందని పార్టీ ఎమ్మెల్యేలు వాపోతున్నారు. మరోవైపు, బీజేఎల్పీ పదవి కోసం పార్టీలో సమీకరణాలు మారుతున్నాయి. తాజాగా బీసీ నినాదం తెరపైకి వచ్చింది. పార్టీ మెజారిటీ సాధిస్తే బీసీ సీఎం అవుతారని అగ్రనాయకత్వం ఎన్నికల ముందు ప్రకటించిన నేపథ్యంలో, ఇప్పుడు బీసీ నేతకు ఎల్పీ పదవి ఇవ్వాలన్న వాదన వ్యక్తమవుతోంది. దీంతో అధినాయకత్వం వైఖరి ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.బీజేపీ నుంచి గెలిచిన 8 మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురు నేతలు బీజేఎల్పీని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. వరుసగా మూడోసారి గెలిచిన రాజాసింగ్, రెండోసారి శాసనసభలో అడుగుపెట్టిన ఏలేటి మహేశ్వర్ రెడ్డితో పాటు తొలిసారి గెలిచిన పాయల శంకర్ కూడా పోటీ పడుతున్నారు. రెండ్రోజుల కిందట హైదరాబాద్ వచ్చిన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్‌తో పాటు పార్టీ కిషన్‌రెడ్డి.. 8 మంది ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా భేటీ అయ్యి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగానే బీసీ అభ్యర్థికి బీజేఎల్పీ పదవి అంశం చర్చకు వచ్చింది. ఎమ్మెల్యే పాయల శంకర్ పేరు ప్రస్తావనకు వచ్చింది. ఈయనకు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు మద్దతు పలికినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే అధినాయకత్వం ఎవరికి బీజేఎల్పీగా అవకాశం ఇవ్వనుందన్నది చర్చనీయాంశమైంది.

అబద్ధాల ముందు అభివృద్ధి ఓడింది

(మొదటిపేజీ తరువాయి)



మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సత్యవతి రాథోడ్, రావులచంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదంటున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం 6,47,479 రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు 29 లక్షల పింఛన్లను 46 లక్షలకు పెంచినట్టు తెలిపారు. దేశంలో అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలిచ్చింది తమ ప్రభుత్వమేనని, ప్రభుత్వ ఉద్యోగులకు 73శాతం జీతాలు పెంచినది సీఎం కేసీఆర్ అన్నారు. అయినా తాము చెప్పుకోలేదన్నారు. అందుకే కాంగ్రెస్ అబద్ధాల ముందు అభివృద్ధి ఓడిపోయిందని, పనులమీదకన్నా ప్రచారంపై దృష్టిపెట్టి ఉంటే తామే గెలిచే వాళ్లమని తెలిపారు. 'గిరిజనవర్గాలకు ఎంతో చేశాం.. సంక్షేమ పథకాలతోపాటు స్థానిక సంస్థల రిజర్వేషన్, పోడు భూముల పట్టాల పంపిణీ వంటివి చేపట్టాం. అయినా గిరిజనులు ఎక్కువగా ఉన్నచోట బీఆర్ఎస్‌కు పూర్తి మద్దతు ఇవ్వలేదు' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి క్షేత్రస్థాయి అంశాలను సమీక్షించుకుని ముందుకెళ్దామని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. ప్రజలు బీఆర్ఎస్‌ను పూర్తిగా తిరస్కరించలేదన్న ఆయన మూడో వంతు (39) సీట్లు దక్కాయని, 14 స్థానాల్లో కేవలం 6వేల ఓట్ల తేడాతోనే ఓటమి చెందామన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు దాన్ని నెరవేర్చలేక గత ప్రభుత్వంలో అప్పులు, శ్వేతపత్రాల నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. పార్టీ శ్రేణులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, కేసీఆర్ వంటి గొప్ప నాయకుడు మనకున్నారన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో మనం గెలుపు సాధిద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

భవిష్యత్తులో బీఆర్ఎస్‌కే అధికారం : హరీశ్

'పోరాడి సాధించుకున్న తెలంగాణ కేసీఆర్ హయాంలో పురోభివృద్ధి సాధించింది. దురదృష్టవశాత్తు మనం ఓటమి చెందాం. ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమే. భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ గ్లోబల్ ప్రచారంపై పార్టీ శ్రేణులు ప్రజల్లో చర్చ చేయాలని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను దగా చేస్తున్న సర్కారు తీరును ఎండగట్టాలని చెప్పారు. నిరుద్యోగ భృతిపై హామీ ఇవ్వలేదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారన్నారు. కర్ణాటకలో 5 గ్యారంటీలు అమలు చేయడంలేదని జనం రివర్స్ అయ్యారని, ఇక్కడా ఆ పరిస్థితి వస్తుందన్నారు. నెలరోజుల తర్వాత పార్టీ అధినేత కేసీఆర్ తెలంగాణ భవన్‌లో ఉంటారని, ఎవరికి సమస్య వచ్చినా అందరం బస్సు వేసుకొని మీ ముందుకు వస్తామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడటం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు పార్టీ జిల్లా కార్యాలయాల్లో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని, కార్యకర్తలను కాపాడుకునేందుకు ట్రస్ట్ ఏర్పాటు చేస్తామని, అవసరమైతే వారి పిల్లలకూ సహకారం అందిస్తామని చెప్పారు.

కార్యకర్తలే మమ్మల్ని ఓడించారు!

» బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల వ్యాఖ్యలు

» నేతల వైఖరి మారాలి: కడియం

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కార్యకర్తలే తమ ఓటమికి కారణమయ్యారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సన్నాహక సమావేశంలో పార్టీ ముఖ్య నేతల ముందే తమ ఓటమికి కార్యకర్తలు, పార్టీ శ్రేణులే కారణమని వారు విమర్శలకు దిగినట్లు తెలుస్తోంది. ఇల్లందు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసినప్పటికీ.. కొందరు పార్టీ కార్యకర్తలే తనపై దుష్ప్రచారం చేశారని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియనాయక్ ఆవేదన వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. పదేళ్లపాటు కార్యకర్తలను బాయిలర్ కోళ్లలాగా పెంచితే కాంగ్రెస్‌కు ఓటు వేశారంటూ పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. హైదరాబాద్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని, అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు చేశారని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు.. ఇప్పుడైనా తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ బంగ్లా కార్యకర్తలు ఆందోళనకు దిగారు. డోర్నకల్‌లో అభ్యర్థిని మార్చాలని కోరినా పార్టీ అధిష్ఠానం వినలేదని, అందుకే ఓడిపోయామని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదన్న మాట వాస్తవమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. "గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు ముఖ్య నేతలను కలిసేందుకు హైదరాబాద్‌కు వచ్చేవారు. ఇక్కడ కేటీఆర్, హరీశ్‌ను కలిసే అవకాశం దొరక్కపోయినా.. ఊర్లోకి వెళ్లి ఆ ఇద్దరిని కలిశామంటూ గొప్పలు చెప్పుకొనే పరిస్థితి చాలామంది ఎదుర్కొన్నారు. ఎవరు ఔనన్నా.. కాదన్నా ఇది నిజం.. ఇప్పటికైనా మన వైఖరి మార్చుకుందాం... కార్యకర్తలను ఆదరించి.. వారికి దగ్గరవుదాం "అని పేర్కొన్నట్లు తెలిసింది.

శంకరమ్మతో కేటీఆర్, హరీశ్ లంచ్

అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మతో కేటీఆర్, హరీశ్ సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తన మనవడి పుట్టిన రోజు వేడుకకు ఆహ్వానించేందుకు వచ్చిన శంకరమ్మ గురువారం తెలంగాణ భవన్ వద్ద కేటీఆర్, హరీశ్‌తో కలిసి భోజనం చేశారు. అయితే, వారితో ఆమె ఏం చర్చించారన్న విషయం బయటకు రాలేదు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శంకరమ్మకు ప్రభుత్వం కీలక పదవి ఇవ్వనుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆమె కాంగ్రెస్‌వైపు వెళ్లకుండా సంప్రదింపులు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఇతర ఉద్యమకారులు సైతం కాంగ్రెస్ వైపు వెళ్తారన్న ఆందోళన బీఆర్ఎస్ శ్రేణుల్లో నెలకొందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

1000 కోట్ల పార్టీ ఫండ్‌ను కార్యకర్తల సంక్షేమానికి ఖర్చుపెట్టాలి

» బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో డిమాండ్

చేర్యాల: వెయ్యి కోట్ల రూపాయల పార్టీ ఫండ్‌ను కార్యకర్తల సంక్షేమం కోసం ఖర్చు పెట్టి ఐదేళ్లపాటు కాపాడుకోవాలని, అప్పుడే బీఆర్ఎస్ తప్పక అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ చేర్యాల మండల నాయకుడు ఉల్లెంగల ఏకానందం అభిప్రాయపడ్డారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం చేర్యాలలో చేర్యాల, కొమురవెల్లి మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిచినా, తల్లి చనిపోయి బిడ్డ బతికిందన్న చందంగా బీఆర్ఎస్ పరిస్థితి ఉందని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నా.. ఎవరికీ న్యాయం జరగలేదని ఆరోపించారు. మరో నాయకుడు చీపురు మల్లేశం యాదవ్ మాట్లాడుతూ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్‌పవర్‌ను పెట్టడం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వమే కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు ఒడిగట్టిందని విమర్శించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుంటేనే పునర్వైభవం సాధించే అవకాశం ఉంటుందన్నారు.

సాగునీరు ఇస్తారా? లేదా?: నిరంజన్

కృష్ణా బేసిన్‌లో నీళ్లు లేక పంటలకు నీరందడం లేదని, గోదావరి బేసిన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లిఫ్ట్ చేసిన నీళ్లు మాత్రమే ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితిలో సాగునీటిపై ప్రభుత్వ వైఖరి చెప్పాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. గోదావరి బేసిన్‌లో లోయర్ మానేరు, అప్పర్ మానేరు, ఎస్సారెస్పీ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌లో పంటల సాగుకు సరిపడా సాగునీరు అందుబాటులో ఉందన్నారు. అయితే, ప్రభుత్వం యాసంగికి సాగు నీళ్లు ఇస్తుందా? లేదా? అనే విషయమై స్పష్టత ఇవ్వాలని కోరారు.

సీఎం పీఆర్వోలుగా మరో ఇద్దరు


శ్రీనివాస్


శ్రీధర్

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో)లో మరో ఇద్దరు ప్రజా సంబంధాల అధికారులు(పీఆర్వోలు) నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. బొల్లం శ్రీనివాస్, శ్రీధర్ మామిడాల పీఆర్వోలుగా నియమితులయ్యారు. బొల్లం శ్రీనివాస్ ఇది వరకు వెలుగు పత్రిక స్టేట్ బ్యూరో చీఫ్‌గా పని చేశారు.


హార్వర్డ్ యూనివర్సిటీ బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి

రేవంత్‌తో హార్వర్డ్ యూనివర్శిటీ బృందం భేటీ

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలను బలోపేతం, సుసంపన్నం చేయడానికి సహకరించాలని అమెరికాలోని హార్వర్డ్ యూనివర్శిటీ అధ్యాపకుల బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఏడాది పాటు విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకరించాలని వారికి విజ్ఞప్తి చేశారు. గురువారం హార్వర్డ్ యూనివర్శిటీ అధ్యాపకుల బృందం గురువారం సీఎంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఉస్మానియా యూనివర్శిటీలో జనవరి 7 నుంచి 12వరకు నిర్వహిస్తున్న ప్రోగ్రాం ఫర్ సైంటిఫిక్లీ ఇన్‌స్పైర్ లీడర్‌షిప్ (పీఎస్ఐఎల్-24) కార్యక్రమం గురించి సీఎంకు వారు తెలిపారు. ఈ కార్యక్రమం కింద తెలంగాణ పాఠశాల, విద్యాశాఖ సహకారంతో తమ బృందం 40 ప్రభుత్వ పాఠశాలల్లో 10 నుంచి 12వ తరగతి విద్యార్థులకు, 33 జిల్లాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఆంగ్ల ఉపాధ్యాయులకు 5 రోజుల పాటు శిక్షణను ఇస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమ వివరాలను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం కూడా రేవంత్‌కు తెలియజేశారు.

కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశం వాయిదా

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలు కృష్ణా బోర్డుకు నిధులు విడుదల చేయాలనే అంశంపై శుక్రవారం(12వ తేదీ) నిర్వహించ తలపెట్టిన కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ప్రత్యేక సమావేశం వాయిదా పడింది. నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించాలని కేంద్ర జలశక్తి శాఖ ఈనెల 15న న్యూఢిల్లీలో నిర్వహిస్తుంది. ఈ సమావేశం ఎజెండాలో నిధుల విడుదల అంశం కూడా ఉంది. దీంతో శుక్రవారం అనుకున్న సమావేశాన్ని వాయి దా వేశారు. న్యూఢిల్లీలో జరిగే సమావేశంలోనే నిధులు విడుదల అంశంపై కూడా చర్చించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కృష్ణా బోర్డు వార్షిక బడ్జెట్ రూ.23.50 కోట్లకు తెలుగు రాష్ట్రాలు ఆమోదం తెలిపాయి. ఈ మొత్తంలో తెలుగు రాష్ట్రాలు చెరో రూ.11.75 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా ఏపీ ఇప్పటిదాకా రూ.3.35 కోట్లు మాత్రమే ఇచ్చింది.

తెలంగాణ శకటం.. 'మదర్ ఆఫ్ డెమోక్రసీ' !

- గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర ఔన్నత్యాన్ని చాటేలా హంగులు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల్లో దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్య పథ్‌పై ప్రదర్శించేందుకు 'మదర్ ఆఫ్ డెమొక్రసీ' థీమ్‌తో తెలంగాణ శకటం రూపొందుతోంది. ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య విలువలను కాపాడే దిశలో సాగిన తెలంగాణ పోరాటం భారత ప్రజాస్వామ పరిరక్షణలో భాగమనే చరిత్రను ప్రదర్శించనుంది. తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు.. ఉద్యమ నేపథ్యం నుంచి అభివృద్ధి వైపు అడుగులు వేస్తోన్న తెలంగాణ ఔన్నత్యాన్ని చాటనుంది. ఆనాటి నిరంకుశ పాలన, తెలంగాణ ఆడబిడ్డలకు జరిగిన అవమానాల గాథల నుంచి స్వరాష్ట్రం కోసం పుట్టిన ఉద్యమ తీరును దేశ ప్రజల కళ్లకు కట్టేలా శకటాన్ని తీర్చిదిద్దుతున్నారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన ఆదిలాబాద్ గోండు వీరుడు కొమురం భీం, బ్రిటిష్ సైన్యాన్ని ఎదుర్కొన్న రాంజీ గోండు, వీర వనిత చాకలి ఐలమ్మల విగ్రహాలను ప్రధానంగా శకటంపై ప్రదర్శించనున్నారు. మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను స్మరించేలా శకటాన్ని రూపొందిస్తున్నారు.

కరెంట్ చార్జీలను పెంచాల్సిందే!

- ఆదాయ అవసరాలు, టారిఫ్ మధ్య వ్యత్యాసం వద్దు
- తప్పనిసరైతే.. 3 శాతానికి మించి ఉండొద్దు
- ఓపెన్ యాక్సెస్ వినియోగదారులపై చార్జీల బాదుడు వద్దు
- స్పష్టం చేస్తున్న ఎలక్ట్రిసిటీ (సవరణ)-2024 నిబంధనలు



హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లు విద్యుత్తును సరఫరా చేసేందుకు వెచ్చించే మొత్తం వ్యయాన్ని బిల్లుల రూపంలో వినియోగదారుల నుంచి రాబట్టుకోవాల్సిందేనని కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చింది. ఇందుకు సంబంధించిన గెజిట్-ఎలక్ట్రిసిటీ(సవరణ) నిబంధనలు-2024 బుధవారం విడుదలైంది. డిస్కమ్‌లు మొత్తం వ్యయాన్ని రాబట్టుకునేలా కరెంటు చార్జీలను ఎప్పటికప్పుడు పెంచుకోవచ్చని ఈ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. "డిస్కమ్‌లు రాబోయే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్తు సరఫరాకు అవసరమైన ఆదాయానికి సంబంధించిన అంచనాలను నవంబరులోగా రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి సమర్పించాలి. వాటిని ఈఆర్సీ పరిశీలించి, ఆదాయ అవసరాల మొత్తాలను ఆమోదిస్తుంది. ఈ మేరకు ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిన విద్యుత్తు చార్జీలను సైతం తదుపరి ఆర్థిక సంవత్సర ఆరంభానికి ముందే ఈఆర్సీ ప్రకటించాలి" అని ఆనిబంధనలు పేర్కొంటున్నాయి. ఇకపై ఈఆర్సీ ఆమోదించే ఆదాయ అవసరాల మొత్తం, ప్రకటించిన టారీఫ్‌తో వచ్చే ఆదాయ అంచనాల మొత్తం మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండరాదని స్పష్టం చేసింది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వ్యత్యాసం ఉంటే.. అది 3శాతానికి మించకూడదని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే ఈ విషయంలో మినహాయింపు ఉంటుందని తెలిపింది. ఇక గడువులోగా బిల్లులు చెల్లించని వారికి విధించే 'లేట్ పేమెంట్ సర్‌చార్జీ'తో ఈ ఆదాయ వ్యత్యాసాన్ని కలిపి, రాబోయే మూడేళ్లలో మూడు సమ వాయిదాల్లో వసూలు చేసుకోవాలని స్పష్టం చేసింది. అయితే.. ఈ గెజిట్ అమల్లోకి రాక ముందు ఉన్న ఆదాయ వ్యత్యాసాలు, లేట్‌పేమెంట్ సర్‌చార్జీలను మాత్రం వచ్చే ఏడేళ్లలో వసూలు చేసుకోవాలని సూచించింది.

ట్రాన్స్‌మిషన్ లైన్లకు లైసెన్స్ అక్కర్లేదు

ఏదైనా విద్యుదుత్పత్తి కంపెనీ/కాప్టివ్ విద్యుత్తు ప్లాంట్/ఎనర్జీ స్టోరేజీ సిస్టం అవసరాల కోసం ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ లైన్ల ఏర్పాటు, నిర్వహించడం, గ్రిడ్‌కు అనుసంధానం చేయడం కోసం ప్రత్యేకంగా లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదని తాజా సవరణలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, వాటి సామర్థ్యం అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పరిధిలో 25 మెగావాట్లు, రాష్ట్ర అంతర్గత ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పరిధిలో 15 మెగావాట్లలోపు ఉండాలి. దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ వినియోగదారులపై విధించే అదనపు సర్‌చార్జీలతో పోలిస్తే.. స్వల్ప కాలిక ఓపెన్ యాక్సెస్ వినియోగదారులకు 110శాతానికి మించి ఉండరాదని తాజా సవరణలు చెబుతున్నాయి. అన్ని రకాల ఓపెన్ యాక్సెస్ వినియోగదారులపై విధించే అదనపు సర్‌చార్జీలు.. డిస్కంలు కొనుగోలు చేసే విద్యుత్తుకు సంబంధించిన ఫిక్స్‌డ్ ధరలకు మించకుండా ఉండాలని స్పష్టం చేస్తున్నాయి.

సీఎం క్యాంప్ ఆఫీసుగా పాయ్‌గా ప్యాలెస్?

- పరిశీలించిన సీఎస్, ఇతర అధికారులు.. భవన పటిష్ఠత, సౌకర్యాలపై ఆరా..
- ఆరో నిజాం పాలనలో 1900లో నిర్మాణం.. గతంలో యూఎస్ కాన్సులేట్ ఇక్కడే..

హైదరాబాద్ సిటీ, జనవరి11 (ఆంధ్రజ్యోతి): సచివాలయానికి చేరువలో సీఎం క్యాంప్ ఆఫీసుకు అనువైన భవనం కోసం అధికారులు వెతుకుతున్నారు. హైదరాబాద్ నడిబొడ్డునే ఉన్న పాయ్‌గా ప్యాలెస్‌ను క్యాంప్ ఆఫీసుగా మారిస్తే ఎలా ఉంటుందని యోచిస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఆ భవనాన్ని బుధవారం రాత్రి సీఎస్ శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు సందర్శించారు. పాయ్‌గా ప్యాలెస్ మొత్తాన్ని కలియ తిరిగి పరిశీలించారు. ప్యాలెస్ భవన పటిష్ఠత, అందులోని సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాయ్‌గా ప్యాలెస్ నుంచి సచివాలయానికి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రాకపోకలు సాగించడానికి అవకాశాలను పరిశీలించినట్లు సమాచారం. మినిస్టర్ రోడ్డు నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా.. లేదంటే మినిస్టర్ రోడ్డు నుంచి నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా చేరవచ్చని, ట్రాఫిక్ సమస్యలుండవని అధికారులు చెప్పినట్లు తెలిసింది.

పైగా ప్యాలెస్ విశేషాలివే..

బేగంపేటలో చిరాన్‌లేన్‌లోని 4 ఎకరాల విస్తీర్ణంలో పాయ్‌గా ప్యాలెస్ ఇంద్ర భవనంలా ఉంటుంది. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ దగ్గర ప్రధానిగా పనిచేసిన నవాబ్ వికారుల్ ఉమ్రా 1900లో దీన్ని నిర్మించారు. ఆయనది పాయ్‌గా వంశం కావడంతో దీనికి పాయ్‌గా ప్యాలెస్‌గా పేరొచ్చింది. భవనంలో రెండు అంతస్తులను యూరోపియన్ శైలిలో కట్టారు. ఈ ప్యాలెస్‌కు 22 అడుగుల ఎత్తైన పైకప్పు ఉంది. మొదటి అంతస్తులో 20 గదులున్నాయి. రెండో అంతస్తుకు చేరుకోవడానికి కలపతో చేసిన మెట్లుంటాయి. నిజాం పాలన తర్వాత అప్పటి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పాయ్‌గా ప్యాలెస్‌ను హుడా కార్యాలయం కోసం కేటాయించారు. 2008లో హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ కార్యాలయానికి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాయ్‌గా ప్యాలెస్‌ను అప్పగించారు. 15 ఏళ్ల తర్వాత గతేడాది ఏప్రిల్‌లో వారు తిరిగి హెచ్ఎండీఏకు అప్పగించారు. ప్రస్తుతం పాయ్‌గా ప్యాలెస్ ఖాళీగానే ఉంది. శతాబ్దానికి పైగా వయసున్న పాయ్‌గా ప్యాలెస్ ఏమాత్రం కళ చెదరలేదు. అయితే ఈ భవనాన్ని హెచ్ఎండీఏ వాసరత్వ కట్టడంగా కూడా గుర్తించింది. గత ప్రభుత్వంలో ఈ పాయ్‌గా ప్యాలెస్‌ను ఏదైనా ప్రైవేటు సంస్థకు హోటల్ కోసం లీజుకిచ్చి ఆదాయ వనరుగా మార్చేందుకు పెద్ద ఎత్తున సంప్రదింపులు కూడా జరిగాయి.

నిషేధిత జాబితాలో భూములు మాయం!

(మొదటిపేజీ తరువాయి)



కమిషనర్ (సీసీఎల్ఏ), రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, నల్సార్ యూనివర్సిటీకి చెందిన భూ చట్టాల నిపుణుడు సునీల్, మాజీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మధుసుదన్, సీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చిరెడ్డి సమావేశమయ్యారు. "ధరణిలో ఏ రకమైన లావాదేవీలు జరిగాయి? నిషేధిత జాబితాలో ఉన్న భూములను కూడా ధరణి ద్వారా ప్రైవేట్ వ్యక్తుల పరం చేశారా? అసైన్డ్ భూములను ఆ జాబితా నుంచి తొలగించారా!? ప్రభుత్వ భూముల పరిస్థితి ఏమిటి?" అంటూ ఆరా తీశారు. ధరణిలో గత మూడేళ్లలో జరిగిన అనుమానాస్పద లావాదేవీలన్నీ పరిశీలించాలని నిర్ణయించారు. ఇందుకు ధరణికి సంబంధించిన పూర్తి లావాదేవీలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నిజానికి, ధరణి పోర్టల్ రాకముందు రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం విక్రయించడానికి వీల్లేని భూములను 22 (ఏ) కింద నిషేధిత జాబితా (ప్రొహిబిషన్ ఆర్డర్ బుక్- పీవోబీ)లో పెట్టారు. ఆయా భూములు చాలా చోట్ల మాయమైనట్లు ప్రభుత్వం గుర్తించింది. గత ప్రభుత్వ హయాంలో జీవో 59 కింద అన్యాక్రాంతమైన కొన్ని భూములు కూడా ఈ జాబితాలోనివేనని గుర్తించినట్లు తెలుస్తోంది. నిజానికి, పీవోబీలోని నిషేధిత భూములను ధరణి పోర్టల్‌లోకి కూడా యథాతథంగా ఎక్కించారు. ఆ తర్వాత ఆయిన వారి కోసం నిషేధిత జాబితాలోని భూములను ధరణి పోర్టల్‌లో గుట్టుగా తొలగించారని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానంగా శివారు జిల్లాల్లోని కలెక్టర్ల పనితీరుపై ఆరోపణలు బలంగా ఉన్నాయి. దాంతో, నిషేధిత జాబితా నుంచి మాయమైన భూముల చిట్టాను పరిశీలించాలని కమిటీ నిర్ణయించింది. "ఆయా భూములను ఎలా బదలాయించారు? దీని వెనక ఎవరున్నారు? అందుకు సహకరించిన అధికారులు ఎవరు!? ముఖ్యంగా, పెద్దఎత్తున ప్రభుత్వ, ఈనాం, అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా భూములుగా ఎలా మార్చారు!?" తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. అలాగే, ఈనాం భూములకు ఓఆర్సీ (అధీన ధ్రువీకరణ పత్రం) సర్టిఫికెట్ లేకుండా వేల ఎకరాల భూములను కొనుగోలు చేసి పట్టా భూములుగా మార్చుకున్నారు. 1955 తరువాత ఈనాందారుల నుంచి ఓఆర్సీ లేకుండా కొనుగోలు చేసిన ఈనాం భూములు చెల్లవని కోర్టు కూడా పేర్కొంది. అయినా.. ఈ లావాదేవీలు ఆగలేదు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, యాదాద్రి జిల్లాలకు చెందిన వేల కోట్ల విలువైన ఈనాం, అసైన్డ్ భూములను ధరణి ద్వారా రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ లావాదేవీలు అన్నిటినీ పరిశీలించాలని ధరణి కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఇచ్చిన 8,05,618 ఎకరాల ఈనాం భూమికి 92,250 మంది ఈనాందారులు ఉన్నట్లు 1966లో జాతీయ భూ సంస్కరణల అమలు కమిటీ పేర్కొంది. ఈనాం భూములకు ఓఆర్సీ పొందకుండానే దాదాపు 6 లక్షల ఎకరాల భూవి ు చేతులు మారింది. ఇందులో చాలా భూములు ధరణి వచ్చిన తర్వాతనే అన్యాక్రాంతమైనట్లు ప్రభుత్వం భావిస్తోంది.

క్షేత్రస్థాయి కమిటీ సభ్యులు

ధరణి పోర్టల్ ద్వారా రైతులకు, ఇతర భూముల యజమానులకు ఎదురవుతున్న సమస్యలను కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ధరణి పోర్టల్‌లో నమోదైన డాటా వివరాలు కావాలని కోరారు. అదే సమయంలో, ధరణిని సంస్కరించేందుకు చేపట్టాల్సిన మార్గాలను అన్వేషించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లాలని నిర్ణయించారు. ప్రజలు, బాధితులతో నేరుగా మాట్లాడాలని, ఆరోపణలు వచ్చిన చోటకు వెళ్లి పరిశీలించాలని నిశ్చయించారు. అందరికీ అందుబాటులో ఉండేలా సీసీఎల్ఏలోనే కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ధరణిపై లోతుగా అధ్యయనం చేయడం, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం, ఏయే సమస్యలు ఎక్కువగా ఉన్నాయో నమోదు చేసుకోవడం, ఎక్కువ సమస్యలున్న బాధితులు, గ్రామాలను గుర్తించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడానికి రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. అనుమానాస్పద లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించనున్నారు. ధరణి సమస్యలపై దశల వారీగా నివేదికలు ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 17న మరోసారి సమావేశమై ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఏజెండాను రూపొందించనున్నారు.

1966 నాటి జాతీయ భూ సంస్కరణల అమలు కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఇనాం భూమి

ఉమ్మడి జిల్లా	ఇనాం దారులు	భూమి విస్తీర్ణం (ఎకరాలలో)
ఆదిలాబాద్	3,386	59,100
కరీంనగర్	4,415	13,954
ఖమ్మం	2,390	26,949
మెదక్	26,234	1,33,716
నల్గొండ	10,625	1,73,330
వరంగల్	7,356	42,260
నిజామాబాద్	12,343	24,243
మహబూబ్‌నగర్	15,063	2,57,108
హైదరాబాద్	10,435	74,958

దేవాదాయంలో దందా

- గ్రాంట్ ఇన్ ఎయిడ్ జీతాలకు కొత్త పేర్లు!
- దీనికి పెద్దమొత్తంలో డబ్బు వసూలు
- ఆర్థిక శాఖకు 82 మందితో జాబితా
- అభ్యంతరాలతో వెనక్కిపంపిన అధికారులు
- నేడు మంత్రి సురేఖ అత్యవసర సమీక్ష

హైదరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో కొందరు అర్చక, ఉద్యోగులకు జీతాల అంశం వివాదాస్పదంగా మారింది. ఇటీవల గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాల చెల్లింపులో చేర్చాలంటూ 82 మందితో ఓ జాబితాను పంపగా.. ఆర్థిక శాఖ దానిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తిప్పిపంపింది. కొందరు సంఘాల నాయకులు, అధికారులు.. గ్రాంట్ ఇన్ ఎయిడ్ జీతాలు ఇప్పిస్తామటూ పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారం మరింత ముదిరి దేవాదాయ మంత్రి కొండా సురేఖ దృష్టికి వెళ్లింది. శుక్రవారం ఆమె అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ వేతనాలు, అర్హులు, జాబితా, వేతనం పొందుతున్నవారు, పెండింగ్‌లో ఉన్నవారు, ఇప్పటివరకు అర్హులందరికీ ఎందుకు వేతనాలు అందడం లేదు? తదితరాలపై సమీక్ష జరపనున్నారు. కాగా, అర్చక, ఉద్యోగుల వేతన సమస్య పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. ఇది అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అనంతరం 2014 జూన్ వరకు కటాఫ్ తేదీగా 5,625మందికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు చెల్లించేందుకు 2017 సెప్టెంబరు 15న ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో 792 మందిని, పలు దఫాలుగా సుమారు 3,300 మంది దీనికి ఎంపిక చేశారు. కరోనాతో మృతి, పదవీ విరమణ, తదితర కారణాలతో కొంతమందికి వేతనాలు వెళ్లడం లేదు. 2017లో జీవో వచ్చినా ఇంకా పూర్తిజాబితా తయారు చేసి వేతనాలు చెల్లించకపోవడం ఏమిటని అటు ఆర్థికశాఖ, ఇటు అర్చక, ఉద్యోగులు దేవాదాయ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దేవాదాయశాఖలో కొందరు అధికారులు, సంఘాల నాయకులు కుమ్మక్కై ఎప్పటికప్పుడు కొత్త పేర్లు చేర్చి ఇస్తున్నారని, దీంతో అర్హులకు అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

హెచ్ఎండీఏ ప్రక్షాళన

- మార్పులు, చేర్పులు చేపడుతున్న దానకిశోర్
- ఒకేచోట తిష్ఠ వేసినవారిపైన కమిషనర్ దృష్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దాన కిశోర్ తర్వాత మార్క్‌ను చూపిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా.. సుదీర్ఘకాలంగా ఒకే సీటులో తిష్ఠ వేసినవారి పైన దృష్టిసారించారు. ప్రధానంగా వివిధ విభాగాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులను సొంత శాఖలకు పంపుతున్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్‌కు ఓఎస్డీగా ఉన్న రిటైర్డ్ అధికారి ఎం.రాంకిషన్, ఎస్టేట్ ఆఫీసర్ కిషన్‌రావులను గురువారం విధుల నుంచి పూర్తిగా తొలగించారు. వాటర్‌బోర్డు ఎస్టేట్ ఆఫీసర్ నుంచి ఇటీవల డిప్యూటేషన్‌పై హెచ్ఎండీఏకు రిసోర్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా వచ్చిన కె.జ్ఞానప్రసూనాంబను మెట్రోపాలిటన్ కమిషనర్‌కు ఓఎస్డీగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎస్టేట్ అధికారి బాధ్యతలను హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలికి అప్పగించారు. అడ్మినిస్ట్రేషన్, ఇతర నిర్వహణ, ఐటీ బాధ్యతలు చూస్తున్న ఆమ్రపాలికి ఇవి అదనపు బాధ్యతలు. అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ ప్రభాకర్‌ను బదిలీ చేసి ప్రదీప్‌కుమార్‌శెట్టిని నియమించారు. మీడియా సంబంధాల అధికారి రాములును తప్పించి ఓ తహసీల్దార్‌కు ఇంచార్జి బాధ్యతలు కేటాయించారు. మున్ముందు ఇంజనీరింగ్, ప్లానింగ్ తదితర విభాగాల్లో మార్పులు, చేర్పులుంటాయని భారీగా ప్రచారం జరుగుతోంది. పనిచేసే అధికారులు, ఉద్యోగులకు పెద్దపీట వేయడంతో పాటు.. భారంగా మారిన, రాజకీయ పలుకుబడితో వివిధ హోదాల్లో కొనసాగుతున్న, అవినీతి ఆరోపణలున్నవారిపై వేటు వేసేందుకు దాన కిశోర్ కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. కాగా, హుస్సేన్‌సాగర్ తీరాన ఉన్న బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ (బీపీపీఏ) కార్యాలయంలో రెండు రోజులుగా హెచ్ఎండీఏలోని వివిధ విభాగాల అధికారులతో కమిషనర్ దాన కిశోర్ సమీక్షిస్తున్నారు. ప్రస్తుత, భవిష్యత్తు కార్యక్రమాలు, తక్షణమే అమలు చేయాల్సిన పనులపై దిశా నిర్దేశం చేస్తున్నారు. హైదరాబాద్ విస్తరిస్తుండడం, పెద్దఎత్తున లేఅవుట్లు వస్తుండడంతో భూ సమీకరణ గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, వివిధ ప్రాంతాల్లో భూ సమీకరణ లే అవుట్ల అభివృద్ధి పనులు వేగిరం చేయాలని, కొత్త ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించినట్లు తెలిసింది.

సీఎంతో మైక్రాన్ సీఈఓ భేటీ

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సెమీ కండక్టర్ కంపెనీ మైక్రాన్ టెక్నాలజీ ప్రెసిడెంట్, సీఈఓ సంజయ్ మెహ్రోత్రా సీఎం రేవంత్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. మైక్రాన్ టెక్నాలజీ కంపెనీకి పెట్టుబడులు పెట్టడానికి, తయారీ యూనిట్లను స్థాపించడానికి తెలంగాణ ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి సహకారాన్ని అందజేస్తుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మెహ్రోత్రాకు హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్తలు యూనిట్లు స్థాపించి నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ముందుకురావాలని కోరారు. పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. .

రహదారి భద్రతకు గూగుల్

- ఆ సంస్థ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌తో చర్చించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో డిజిటైజేషన్‌కు టెక్ దిగ్గజం సహకారం


సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన గూగుల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తోట

హైదరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతలో తెలంగాణ ప్రజలు టెక్నాలజీని మరింత ఉపయోగించే విధంగా సహకారం అందిస్తామని టెక్ దిగ్గజ సంస్థ గూగుల్ తెలిపింది. గూగుల్ మ్యాప్స్ గూగుల్ ఎర్త్ టెక్నాలజీని కేవలం దారి తెలుసుకోవడం వరకే పరిమితం చేయకుండా అదనంగా మరిన్ని రక్షణ చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం అందిస్తామని గూగుల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తోట తెలిపారు. ఆయన గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రహదారి భద్రతలో గూగుల్ సహకారంపై సీఎం చర్చించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. రహదారి భద్రతకు సంబంధించి గూగుల్ అభివృద్ధి చేసిన పరిజ్ఞానాన్ని చంద్రశేఖర్ సీఎంకు వివరించారు. కృత్రిమ మేధ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని, డిజిటలైజేషన్ ప్రక్రియలో సహకరిస్తామని తెలిపారు.

సీఎంతో 'మైక్రాన్' సీఈవో భేటీ

ప్రముఖ అంతర్జాతీయ సెమీ కండక్టర్ల తయారీ సంస్థ మైక్రాన్ టెక్నాలజీ ప్రెసిడెంట్, సీఈవో సంజయ్ మెహ్రోత్రా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. అమెరికా నుంచి ప్రత్యేకంగా సీఎంను కలిసేందుకు ఆయన వచ్చారు. గురువారం సాయంత్రం సీఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం ఉందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్త పెట్టుబడులకు మైక్రాన్ కంపెనీ ఆసక్తి చూపితే రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపన, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక వృద్ధికి పారిశ్రామికవేత్తలు ముందుకురావాలని సీఎం కోరారు.

వడ్డీ తక్కువ.. షరతులు ఎక్కువ!

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకులు ఇచ్చే గృహ రుణాలకు ఎన్ని రకాల షరతులు పెడతాయో.. అంతర్జాతీయ సంస్థలు కూడా అలాంటి నిబంధనలే విధిస్తాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి రుణాలను దేశంలోని కొన్ని రాష్ట్రాలు తీసుకుంటున్నప్పటికీ తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వీటి జోలికి వెళ్లలేదు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి తక్కువ వడ్డీకి అప్పులు తీసుకోవాలని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ రుణాలు చర్చకు వస్తున్నాయి. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణకు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'జైకా', ఏడీబీ వంటి సంస్థల నుంచి రుణాలు ఇప్పించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని రేవంత్ చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ సందర్భంలోనూ ఈ రుణాల గురించి ప్రస్తావించానని తెలిపారు. తమకు అదనపు అప్పులు అవసరం లేదని, తక్కువ వడ్డీకి రుణాలిచ్చే ఇలాంటి సంస్థల నుంచి రుణాలు ఇప్పించాలని అడిగారు.

నిర్దేశిత పనులకే వినియోగించాలి..

తక్కువ వడ్డీకి అంతర్జాతీయ సంస్థలిచ్చే రుణాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు మళ్లించడానికి వీలుండదని, పక్కాగా నిర్దేశిత పనులకే వినియోగించాలని అధికారులకు చెబుతున్నారు. రోడ్లు, హైవేలు, షిప్పింగ్, బ్రిడ్జిలు, నీటి సరఫరా, శానిటేషన్, పట్టణ రవాణా, పర్యావరణం, అడవుల పెంపకం, పాఠశాలలు, ఆస్పత్రి భవనాల నిర్మాణాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. ఏ మాత్రం దారి మళ్లించినా.. ఆ సంస్థలు నిబంధనల ఉల్లంఘన కింద అప్పులను నిలిపివేస్తాయి. మరోసారి అప్పులు ఇవ్వకుండా దేశాలను బ్లాక్ లిస్ట్ చేస్తాయి. ఒకసారి దేశం బ్లాక్ లిస్ట్‌లో చేరితే ఆ దేశంలోని రాష్ట్రాలకు రుణాలు తీసుకునే పరిస్థితి ఉండదు. అందుకే ఒక రాష్ట్ర ప్రభుత్వ రుణ విజ్ఞప్తులను పరిశీలించేటప్పుడు కేంద్ర ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకుంటుందని అధికారులు వివరిస్తున్నారు. ప్రపంచంలోని పలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు.. పేద దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు రుణాలు ఇస్తుంటాయి. ఇలాంటి సంస్థల్లో 'జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జైకా)', ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ)', 'ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఐబీఆర్‌డీ)' వంటివి ఉన్నాయి. ఇవి ఎక్కువగా పేద దేశాలనే పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉండి, దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్న దేశాలను ఆదుకునే చర్యల్లో భాగంగా రుణాలు ఇస్తున్నాయి.

ఏడీబీ ద్వారా రుణాలు

ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ఉన్న 'ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ)' కూడా ఆసియాలోని దేశాలకు రుణాలు ఇస్తుంటుంది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లోని దేశాల్లో ఆర్థికాభివృద్ధికి, పేదరికాన్ని దూరం చేయాలన్న ఉద్దేశంతో రుణాలను అందిస్తుంది. సహజ వనరుల వినియోగం, విద్య, విద్యుత్తు, ఆర్థికం, ఆరోగ్యం, సామాజిక భద్రత, పరిశ్రమలు, వాణిజ్యం, పబ్లిక్ సెక్టార్ మేనేజ్‌మెంట్, రవాణా, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, నీటి సరఫరా, మౌలిక సదుపాయాలు వంటి వాటి కోసం రుణాలు ఇస్తుంది. దీని రుణాలు దేశాల తలసరి ఆదాయం, అప్పులను తిరిగి చెల్లించే సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి.

మౌలిక సదుపాయాలకు 'జైకా' రుణాలు

జపాన్‌లోని టోక్యోలో గల 'జైకా' ప్రపంచంలోని వివిధ దేశాలకు 'అఫీషియల్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ (ఓడీఏ)' పేర రుణాలు ఇస్తుంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం తక్కువ శాతం వార్షిక వడ్డీతో ఈ రుణాలను అందజేస్తుంది. రుణ గ్రహీత దేశం.. ఏ రాష్ట్రంలోనైనా నిధులను ఖర్చు పెట్టుకునే వెసులుబాటు ఉంటుంది. మన దేశంలోని ఏదైనా రాష్ట్రం 'జైకా' రుణాన్ని తీసుకోవాలంటే.. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలి. కేంద్రం ఇచ్చే భరోసా మేరకు రుణం లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వమే 'జైకా'తో మధ్యవర్తిత్వం నెరపి, రుణాన్ని ఇప్పిస్తుంది. 'జైకా' రుణాల కోసం రాష్ట్రాలు కేంద్ర ఆర్థిక శాఖకు ప్రతిపాదనలను పంపించాలి. మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం జైకా ఈ రుణాలను ఇస్తుంది. ఈ మేరకు లోయర్-మిడిల్ ఇన్‌కమ్ దేశాలు, అప్పర్-మిడిల్ ఇన్‌కమ్ దేశాలుగా వర్గీకరించి వడ్డీ రేట్లను అమలు చేస్తుంది. 2023 జూన్‌లో 'ప్రపంచ బ్యాంకు' విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఇండియా లోయర్-మిడిల్ ఇన్‌కమ్ దేశంగా ఉంది. దీంతో భారత్‌కు 1.45 లేదా 1.20 శాతం వడ్డీ రేట్లు వర్తిస్తాయి. 2014లో కూడా జైకా నుంచి అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం రూ.370 కోట్ల రుణం తీసుకుంది.

మహదేవపూర్‌లో ముగిసిన విజిలెన్స్ విచారణ?

- మూడ్రోజుల పాటు కాళేశ్వరం ఫైళ్ల తనిఖీలు
- మేడిగడ్డ, కన్నెపల్లి, గ్రావిటీ కెనాల్ పత్రాల పరిశీలన

భూపాలపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో విచారణను గురువారం ముగించారు. మూడ్రోజులుగా మహదేవపూర్‌లోని నీటిపారుదల శాఖ కార్యాలయం, మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్ హౌస్‌ల వద్ద తనిఖీలు నిర్వహించిన అధికారులు.. గురువారం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కీలక పత్రాలు, ఎంబీ రికార్డులు, కంప్యూటర్ హార్డ్ డిస్కులను సీజ్ చేశారు. వాటిని హైదరాబాద్‌లోని విజిలెన్స్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. అయితే.. మొత్తం 12 హార్డ్‌డిస్కులకు బదులు ఆరు మాత్రమే లభించాయని, మిగతావాటి గురించి తొలుత తమకు తెలియదని ఇంజనీర్లు చెప్పినా.. విజిలెన్స్ అధికారులు తమదైన శైలిలో వాటి జాడను తెలుసుకున్నట్లు సమాచారం. రికార్డుల నిర్వహణ, ప్రాజెక్టుల నాణ్యత, బిల్లుల చెల్లింపుల తీరుపై అధికారులు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ రమేశ్ విలేకరులతో మాట్లాడుతూ.. విచారణ కొనసాగుతోందని, క్షేత్రస్థాయిలో సీజ్ చేసిన డాక్యుమెంట్లు, హార్డ్‌డిస్కులను హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో విశ్లేషిస్తామని చెప్పారు. విజిలెన్స్ విచారణ పూర్తవ్వగానే.. హైకోర్టు సిటింగ్ జడ్జి విచారణ ప్రారంభం కానుంది.

వ్యూహం సినిమా వివాదంపై తీర్పు రిజర్వు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు జారీచేసిన సర్టిఫికెట్‌ను కొట్టేయాలని కోరుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ నెల 22న తీర్పు వెలువరిస్తామని జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం గురువారం పేర్కొంది. ఈ సినిమాకు మొదట సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరించింది. తర్వాత ఏర్పాటైన రివైజింగ్ కమిటీ సర్టిఫికెట్ జారీచేసింది. వ్యక్తుల పరువుకు, హక్కులకు భంగం కలిగించేలా, కోర్టు ధిక్కరణకు పాల్పడేలా ఉన్న సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ లోకేశ్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 11 వరకు స్టే విధిస్తూ జస్టిస్ నందా ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలపై నిర్మాత డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. సింగిల్ జడ్జి మధ్యంతర ఆదేశాలు మాత్రమే జారీచేసినందున అక్కడే తేల్చుకోవాలని డివిజన్ బెంచ్ పేర్కొంది. ఆ నేపథ్యంలోనే జస్టిస్ నందా ఏకసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై మళ్లీ విచారణ చేపట్టి తీర్పు రిజర్వు చేసింది.

ఎన్నికల విధులకుటీఏ, డీఏలు ఇవ్వాలి: పోలీసులు

తెలంగాణ శాసనసభ ఎన్నికల సమయంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో విధులు నిర్వహించిన తమకు గౌరవ వేతనంతోపాటు టీఏ, డీఏలను తక్షణం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు పోలీసులు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో రాత్రింబవళ్లు విధులు నిర్వహించిన పోలీసులను గుర్తించలేదని, రెమ్యునరేషన్, టీఏ, డీఏలు చెల్లించలేదని పేర్కొన్నారు. తక్షణం చెల్లింపులు పూర్తి చేసే విధంగా జిల్లా ఎన్నికల అధికారి, గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించాలని కోరారు.

గొర్రెల పంపిణీ అక్రమాలపై ఫోకస్!

రూ.2.08 కోట్లు దారి మళ్లింపు కేసు ఏసీబీకి!.. రైతులకు డబ్బు ఎగ్గొట్టి బినామీ ఖాతాల్లో జమ

- నలుగురు అధికారులు, ఇద్దరు దళారులపై కేసు
- ఫైళ్ల మాయం వ్యవహారంలో మాజీ మంత్రి తలసాని ఓఎస్డీపై విచారణ

హైదరాబాద్/రాయదుర్గం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. బినామీ పేర్లతో ఖాతాలు తెరిచి రూ.2.08 కోట్ల నిధుల దారి మళ్లింపు, పశుసంవర్థక భవన్‌లో ఫైళ్లు మాయమైన ఉదంతాలపై విచారణ జరుగుతోంది. నిధుల మళ్లింపు వ్యవహారంలో నలుగురు అధికారులు, ఇద్దరు గొర్రెల దళారులపై ఇప్పటికే గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును ఏసీబీకి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పోలీసులు కొంతమేర దర్యాప్తు చేపట్టినా మరింత లోతైన దర్యాప్తు అవసరమని భావిస్తున్న ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. మరోవైపు ఫైళ్ల మాయం ఘటనపై రాష్ట్ర పశు సంవర్థక శాఖ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేషీలో ఓఎస్డీగా పనిచేసిన కల్యాణ్ కుమార్ ప్రమేయంపైనా పోలీసుల విచారణ కొనసాగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన గొర్రెల పంపిణీ పథకం అవినీతి, అక్రమాలకు కేంద్ర బిందువుగా మారిన విషయం విదితమే. పశుసంవర్థక శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, దళారులు కుమ్మక్కై నిధులను దారి మళ్లించారు. రాష్ట్ర పశుసంవర్థక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న రవికుమార్, ఆదిత్య కేశవ్‌సాయి, రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో ఇద్దరు అధికారులు, కాంట్రాక్టర్లు, దళారులు కలిసి గతేడాది ఆగస్టు 13 నుంచి 23 మధ్యకాలంలో ఏపీలో పర్యటించారు. 18 మంది రైతుల నుంచి 133 యూనిట్లు (2,793 గొర్రెలు) సేకరించారు. వాస్తవానికి గొర్రెలు విక్రయించిన ఏపీ రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేయాల్సి ఉంది. కానీ అలా చేయకుండా దళారులకు చెందిన బినామీ ఖాతాల్లోకి రూ.2.08 కోట్లు మళ్లించారు. డబ్బులు రాకపోవటంతో ఏపీ రైతులు కాంట్రాక్టర్‌ను నిలదీశారు. పశుసంవర్థక శాఖ డైరెక్టరేట్‌లో ఆరా తీయగా డబ్బుల చెల్లింపు పూర్తయినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో కాంట్రాక్టర్ వెళ్లి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పశుసంవర్థక శాఖ ఏడీలు రవికుమార్, ఆదిత్య కేశవ్ సాయి తోపాటు ఇద్దరు దళారులపై ఐపీసీ సెక్షన్లు- 406, 409, 420 ప్రకారం గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కల్యాణ్ కుమార్ మసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర పశుసంవర్థకశాఖ కార్యాలయానికి వెళ్లి కీలక ఫైళ్లను చించేసి, కాగితపు ముక్కలను బస్తాలో మూటగట్టుకొని తన కారులో వేసుకొని వెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనికి, రూ.2.08 కోట్ల నిధులు బోగస్ ఖాతాల్లోకి దారి మళ్లడానికి సంబంధం ఉందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.



మొదటి విడతలో నిధుల దుర్వినియోగం

మొదటి విడత గొర్రెల పంపిణీ పథకంలో కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయి. ఒక్కో గొర్రెల యూనిట్ ధర (20+1) రూ.1.25 లక్షలు కాగా.. ఒక్కో యూనిట్ పేరు మీద రూ.50 వేలు దారి మళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ-సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నారు. బావుపేట శివారులో గొర్రెలు దించి... ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. 2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులు 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి మోసం చేశారు. నర్సింహులపల్లె గ్రామానికి చెందిన తడుక రామక్కకు 14, అమ్మక్కపేటకు చెందిన అగ్గ రాజన్నకు 16 గొర్రెలు మాత్రమే ఇచ్చారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా సింహభాగం యూనిట్ల విషయంలో ఇదే తరహాలో దందా జరిగింది. దీనిలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్థకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, దళార్లు భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల-కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో ఒప్పందం చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా చిన్నవి, నాణ్యత లేని, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ-సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్థక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరి కొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అయితే గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. విచిత్రమేమిటంటే... రాష్ట్రంలో గొర్రెల సంపద సృష్టించామని, మాంసం దిగుమతులు తగ్గించామని, పింక్ రెవెల్యూషన్ తీసుకొచ్చామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసుకుంది. గొర్రెలు, వాటికి పుట్టిన పిల్లల లెక్కలు చెప్పి వాటి జనాభా కోట్లలో పెరిగినట్లు సభలు, సమావేశాల్లో ప్రకటించారు. కానీ రాష్ట్రంలో మాంసం ధర మాత్రం తగ్గలేదు. మటన్ రేటు కిలోకు రూ.900 నుంచి రూ.వెయ్యికి పైగా పలుకుతోంది.

రహస్య విచారణపై కాగజ్‌నగర్ సెగ!

- అనుమానంతో ఆరుగురు పశువుల కాపర్లు అదుపులోకి
- నేరం ఒప్పుకోవాలని ఒత్తిడి.. భగ్గుమన్న ఆదివాసీలు

కాగజ్‌నగర్, జనవరి 11: వరుసగా పెద్ద పులులు మృత్యువాత పడిన ఘటనకు సంబంధించి అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న ఆరుగురు నిందితుల కుటుంబసభ్యులు గురువారం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ అటవీకార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. గత శని, సోమవారాల్లో రెండు పెద్ద పులులు మృతిచెందిన ఘటనకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేగడంతో అటవీ శాఖ అధికారులు విచారణ వేగవంతం చేశారు. మృతి చెందిన ఎస్-9 పులి విషప్రయోగం వల్ల చనిపోయినట్లు నిర్ధారణకు వచ్చారు. పులుల మృతిపై పశువుల యాజమానులకు సంబంధం ఉంటుందనే అనుమానంతో వాంకిడి మండలం రింగారెటి, సర్కపల్లి గ్రామాలకు చెందిన ఆత్రం జలపతి, జంగు, కుమరం చందు, మడావి నాగు, మరో ఇద్దరిని (వీరు మైనర్లు) బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి వదిలి వేస్తామని చెప్పిన అధికారులు వదిలిపెట్టలేదు. ఆందోళనకు గురైన అనుమానితుల కుటుంబసభ్యులు తమ వారిని విడిచిపెట్టాలని కోరుతూ గురువారం ఉదయం కాగజ్‌నగర్ డివిజన్ అటవీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న ఆరుగురు ఆదివాసీలేనన్నారు. అధికారులు తమపై వస్తున్న ఒత్తిడిని తగ్గించుకునేందుకు అమాయకులను బలిచేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వారికి జడ్పీ మాజీ చైర్మన్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి నేతృత్వంలోని ఆదివాసీ సంఘాల నేతలు మద్దతు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని వెంటనే విడుదల చేయక పోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలను చేపడుతామంటూ హెచ్చరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు అక్కడికి వస్తున్నట్టు తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అటవీ కార్యాలయానికి చేరుకుని ఆదివాసీలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన విరమించలేదు. దీంతో మైనర్లయిన పశువుల కాపర్లను విడిచిపెట్టారు. ఫారెస్టు ఆఫీసర్లు తమను తీసుకుపోయారని పశువుల కాపర్లు చెప్పారు. కాగితాలపై వేలిముద్ర తీసుకున్నారని, నేరం ఒప్పుకోవాలని కొట్టారని చెప్పారు.

మంత్ర ముగ్గులైన వేళ!

- కనుల పండువగా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్'
- ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్
- ప్రథమ బహుమతి అందుకున్న విజయనగరం జిల్లాకు చెందిన మొలుగు రాజు

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నింగిలోని నక్షత్రాలు నేలకు రాలాయి. మహిళల మునివేళ్ల నుంచి జాలువారి ముత్యాల ముగ్గులై అవనిని ముద్దాడాయి. చుక్కలతో అందంగా తీర్చిదిద్దిన రంగవల్లులు సంక్రాంతి శోభను ముందే తీసుకొచ్చాయి. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ గురువారం విజయవాడలో జరిగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. విజేతలకు ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, తెలుగు ప్రజలకు అతిపెద్ద పండుగ సంక్రాంతి అని చెప్పారు. తాము చిన్నతనంలో బియ్యం పిండిలో ఇసుకను కలిపి ముగ్గులు వేసేవాళ్లమని, ఆ పిండిని చీమలు తినేవని, ఇది ఒకవిధంగా అన్నదానంతో సమానమని తన తల్లి చెప్పారని వివరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికి 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' చేస్తున్న కృషిని పురందేశ్వరి ప్రశంసించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సామాజిక కార్యకర్తలు అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. మొదటి బహుమతిని విజయనగరం జిల్లాకు చెందిన మొలుగు రాజు సాధించారు. ఆమెకు రూ.30వేల చెక్కును పురందేశ్వరి అందజేశారు. గుంటూరు జిల్లాకు చెందిన ఎ.సునీత, అనంతపురం జిల్లాకు చెందిన కె.ఉమాదేవి, తమిళనాడుకు చెందిన కె.రాధ రెండో బహుమతిని సాధించి ఒక్కొక్కరు రూ.10వేల చెక్కులు అందుకున్నారు. కన్సొలేషన్ బహుమతులను కెనరా బ్యాంక్ ఏజీఎం జీవీ నరసింహారావు అందజేశారు.





మొదటి బహుమతి పొందిన ముగ్గు, మొలుగు రాజుకు బహుమతిని అందజేస్తున్న పురందేశ్వరి

పిల్లోడిని చూస్తే భర్త గుర్తుకొస్తున్నాడని..

- బంధువులు, స్నేహితులకు తెలిపిన బెంగళూరు సీఈవో
- కోర్టు ఆదేశించినా బిడ్డను భర్త వద్దకు పంపని వైనం
- దర్యాప్తులో వెలుగులోకి మరిన్ని విషయాలు



న్యూఢిల్లీ, జనవరి 11: భర్తపై కోపంతో నాలుగేళ్ల కుమారుడిని చంపేసిన 'మైండ్‌ఫుల్ ఏఐ ల్యాబ్' స్టార్టప్ సీఈవో సుచనా సేథ్.. తన కుమారుడి ముఖం తన భర్తను పోలి ఉందని స్నేహితులు, బంధువులు, ఇతర కుటుంబసభ్యులతో అన్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. ఎప్పుడు బిడ్డ ముఖం చూసినా భర్త గుర్తుకొస్తున్నాడని ఆమె పేర్కొన్నట్టు తెలిసింది. బెంగళూరులో నివసించే సుచనా సేథ్ కుమారుడితో గోవాకు వెళ్లి, అక్కడి సర్వీసు అపార్ట్‌మెంట్‌లో బిడ్డను చంపేసి, మృతదేహాన్ని బ్యాగులో కుక్కేసి ట్యాక్సీలో కర్ణాటకకు ప్రయాణమైన విషయం తెలిసిందే. ఆమె గదిలో రక్తపు మరకలను గమనించిన సర్వీసు అపార్ట్‌మెంట్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హత్య గుట్టు రట్టయ్యింది. దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కాగా, ఆమె కుమారుడి మృతదేహానికి బెంగళూరులోని రాజాజీనగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల మేరకు విభేదాలు రావడంతో సుచనా సేథ్, వెంకటరామన్ దంపతులు 2020లో విడాకులకు దరఖాస్తు చేశారు. ప్రతి శనివారం కుమారుడితో గడిపే అవకాశాన్ని కోర్టు వెంకటరామన్‌కు కల్పించింది. అయినప్పటికీ కుమారుడిని భర్త వద్దకు పంపడం ఆమెకు ఇష్టం లేదు. గతవారం సుచనా సేథ్‌కు వెంకటరామన్ ఫోన్ చేసి ఆదివారం కుమారుడిని బెంగళూరులోని తన ఇంటికి తీసుకురావాలని కోరగా, నిరాకరించిన ఆమె తనను నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కలవాలని స్పష్టం చేశారు. దీంతో వెంకటరామన్ ఓ బహిరంగ ప్రదేశంలో రెండు గంటలకుపైగా వేచి చూసినా ఆమె రాలేదు. దీంతో ఉద్యోగ విధులకు హాజరయ్యేందుకు వెంకటరామన్ ఇండోనేసియాకు వెళ్లిపోయారు. అనంతరం తన కుమారుడిని వెంకటరామన్ కలవ కూడదని భావించిన ఆమె కుమారుడితో గోవాకు వెళ్లిపోయింది. కుమారుడిని ఊపిరి అందకుండా చేసి చంపేసినట్టు పోస్టుమార్టంలో వెల్లడైంది. అయితే, తానేమీ హత్యకు కుట్రపన్నలేదని, కుమారుడితోనే తిరిగి ఇంటికి వెళ్లాలనుకున్నానని ఆమె చెబుతుండటంతో, దర్యాప్తు అధికారులు ఆమెను మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. తన తల్లి మరణం తర్వాత సుచనా చాలా ఏళ్ల వరకు తండ్రితో మాట్లాడలేదని మానసిక వైద్యులు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వెల్లడైంది. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మంది వాంగ్మూలాలను దర్యాప్తు అధికారులు రికార్డు చేశారు.

'ఓపెన్'గా వింటా..!

- ఓపెన్ ఎయిర్ జైలు అధికారి తీరు
- ఖైదీ చేతికి సెల్‌ఫోన్ ఇచ్చి, దారుణాలు
- మహిళా అధికారుల వద్ద.. ఆ ఫోన్‌ను పెట్టేలా ఖైదీకి తర్ఫీదు
- వారు మాట్లాడుకునే మాటల రికార్డింగ్
- జైళ్లశాఖ డీజీకి బాధితుల ఫిర్యాదు
- విచారణకు ఆదేశాలు.. చంచల్‌గూడకు ఖైదీ



హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): "యాక్చువల్‌గా.. ప్రపంచంలో ప్రతి మనిషికి తన గురించి అవతలి వారు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటుంది. అది సహజం" మన్మథుడు సినిమాలో స్ప్రై మైక్ విక్రయించే సమయంలో నాగార్జునతో ధర్మవరపు సుబ్రమణ్యం అనే మాటలివి. అయితే.. జైళ్ల శాఖలో పనిచేసే ఓ అధికారికి కూడా అచ్చంగా ఇలాగే అనిపించింది. తమతో కలిసి పని చేసే ఇద్దరు మహిళా అధికారులు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనుకున్నాడు. అంతే.. ఖైదీ చేతికి ఓ సెల్‌ఫోన్ ఇచ్చాడు. ఆ ఇద్దరు మహిళా అధికారులు ఒకచోట కూర్చొని మాట్లాడుకునే టేబుల్ వద్ద కనిపించకుండా ఆ ఫోన్‌ను పెట్టించి, ఏం మాట్లాడుకుంటున్నారో వినేవాడు. ఈ ఘటన సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు నిలయమైన చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలు(వ్యవసాయ క్షేత్రం)లో చోటుచేసుకుంది. సదరు అధికారి, ఖైదీ ఇప్పుడు ఉన్నతాధికారుల క్రమశిక్షణ చర్యలను ఎదుర్కోనున్నారు.

ఏం జరిగిందంటే..?

చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలులో ఉద్యానశాఖ, వైద్య శాఖ తరఫున ఇద్దరు అధికారులు పనిచేస్తారు. ప్రస్తుతం ఇద్దరు మహిళలు ఉద్యాన అధికారిగా.. వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరు రోజూ మధ్యాహ్నం ఒకేచోట కూర్చుని భోజనం చేసేవారు. ఆ సమయంలో వారు ఏం మాట్లాడుకుంటున్నారో తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఓ అధికారి తన దొంగబుద్ధికి పనిచెప్పాడు. అంతే.. ఓ ఖైదీకి ఫోన్ ఇచ్చి.. మహిళా అధికారులు ఇద్దరూ భోజనానికి వెళ్లడానికి ముందే.. అక్కడ ఫోన్ పెట్టించేవాడు. ఆ ఫోన్‌తో తన నంబర్‌కు ఫోన్ చేయించి, ఎవరికీ కనబడని చోట పెట్టేలా జాగ్రత్త తీసుకునేవాడు. ఈ తంతంగమంతా రెండు నెలలుగా సాగినట్లు జైళ్ల శాఖలో సిబ్బంది చెప్పుకొంటున్నారు. మహిళా అధికారులిద్దరూ మాట్లాడుకుంటున్నప్పుడు సెల్‌ఫోన్ బీప్, మెసేజ్ వచ్చిన శబ్దం వినిపించేది. వారిద్దరూ తమ ఫోన్లను చూసుకున్నా.. వేరే ఫోన్ ఉందనే విషయం అర్థమయ్యేది కాదు. ఇటీవల వీరిద్దరూ మాట్లాడుతుండగా.. ఖైదీ సీక్రెట్‌గా పెట్టిన ఫోన్ రింగ్ అయ్యింది. దాంతో వారు అలెర్ట్ అయ్యారు. ఆ ఫోన్‌ను తీసుకెళ్లి.. తమ మాటలు వింటున్న అధికారి చేతికే ఇచ్చి, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే.. సదరు అధికారి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా పలు సమావేశాల్లో తామిద్దరు మాట్లాడుకున్న మాటలను సదరు అధికారి ఏదో ఒక సందర్భంలో చెబుతుండేవాడు. ఆ అధికారే తమ మాటలు వింటున్నట్లు నిర్ధారించుకుని, జైళ్ల శాఖ డీజీకి ఫిర్యాదు చేశారు. డీజీ కూడా మహిళా అధికారి కావడంతో.. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని, విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఆ అధికారికి సహకరించిన ఖైదీని ఓపెన్ ఎయిర్ జైలు నుంచి చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.

ఓపెన్ ఎయిర్ జైలులో ఫోన్ల హవా?

ఖైదీలు సెల్‌ఫోన్లను వాడుతున్న ఉదంతాలు గతంలో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.! చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలులో 70 మంది దాకా ఖైదీలుంటే.. 30-40 ఫోన్లు వారి చేతుల్లో ఉంటాయనే ఆరోపణలున్నాయి. మిగతా జైళ్లలో సెల్‌లో తనిఖీ చేస్తే ఫోన్లు దొరుకుతాయి. కానీ, ఓపెన్ ఎయిర్ జైలులో.. వ్యవసాయ క్షేత్రమంతా తిరిగే స్వేచ్ఛ ఖైదీలకు ఉంటుంది. వారు సెల్‌ఫోన్లను ఎక్కడ దాచుతారనేది పసిగట్టడం కష్టమని అధికారులు చెబుతున్నారు.

వచ్చే నెల 26 నుంచి బయో ఏషియా-2024

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బయో ఏషియా- 2024 సదస్సు ఫిబ్రవరి 26 నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సదస్సు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 'డేటా, ఏఐ రీడిఫైనింగ్ పాజిబిలిటీస్' అంశంతో ఈసారి సదస్సు జరగనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 50 దేశాల నుంచి దాదాపు 3 వేలకు పైగా ప్రతినిధులు రానున్నారని ఆయన తెలిపారు. నోబెల్ విజేత ప్రొఫెసర్ గ్రెగ్ సెమెన్జాతో పాటు పారిశ్రామిక దిగ్గజాలు హాజరయి ప్రసంగించనున్నారని చెప్పారు. ఈ సదస్సులో దాదాపు 200 కంపెనీలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నాయని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ అభివృద్ధిలో బయో ఏషియా అత్యంత కీలకపాత్ర పోషిస్తోందని, ఈ సదస్సుతో ఈ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

టెన్త్ పరీక్షల్లో పాల్గొన్న సిబ్బందికి డీఏ

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి డీఏ, టీఏలను విడుదల చేశారు. మొత్తం రూ.73.57 లక్షల నిధులను విడుదల చేసి, పరీక్షల్లో పాల్గొన్న సిబ్బందికి టీఏ, డీఏల కింద చెల్లించాలని ఆయా జిల్లాల విద్యాధికారులను ఆదేశించారు.



పట్నం వదిలి పల్లెకు పయనం

సంక్రాంతి పండుగకు వరుస సెలవులు రావడంతో ప్రజలు పట్టణాన్ని వదిలి పల్లెలకు పయనమయ్యారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజలు తమ వాహనాల్లో సొంతూళ్లకు బయలుదేరారు. దీంతో యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ లోని 65వ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం నుంచి వాహనాల రద్దీ ప్రారంభమైంది. జాతీయ రహదారిపై ఉన్న జంక్షన్ల వద్ద పాదచారులు, ద్విచక్రవాహనదారులు రోడ్డు దాటేందుకు అవస్థలు పడ్డారు. జంక్షన్ల వద్ద వాహనాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులను అదనంగా నియమించారు.

\- చౌటుప్పల్ టౌన్, జనవరి 11:



తనిఖీలతోనూ తంటా..


హైదరాబాదు-విజయవాడ జాతీయ రహదారిపై సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. రహదారిపై గల టోల్‌గేట్లను దాటేందుకు సాధారణంగానే ఆలస్యం అవుతుండగా.. పోలీసుల తనిఖీలతో మరింత ఆలస్యం అవుతోంది. దీంతో పండగ కోసం సొంతూళ్లకు ఉత్సాహంగా బయలుదేరిన ప్రయాణికులు ట్రాఫిక్ జామ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

\- కంచికచర్ల, జనవరి 11

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 12 జనవరి 2024

హైదరాబాద్ నార్మ్‌లో పీజీడీఎం



హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)- 'పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 66 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, అనుభవం, క్యాట్/సీమ్యాట్ స్కోర్, అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల డిగ్రీ(అగ్రికల్చర్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్/కమర్షియల్ అగ్రికల్చర్/అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/డెయిరీ సైన్స్/ఫిషరీస్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్/ఫారెస్ట్రీ/హార్టికల్చర్/సెరీకల్చర్/వెటర్నరీ సైన్సెస్/హోం సైన్స్/కమ్యూనిటీ సైన్స్/అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకూ ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: ఇందులో భాగంగా అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అభ్యర్థులు ఇచ్చిన అంశంపై ఇంగ్లీష్‌లో వ్యాసం రాయాల్సి ఉంటుంది. ఇరవై నిమిషాల సమయం ఇస్తారు. తరవాత గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి సీటుకు అయిదుగురిని ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

- క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్‌కు 30 శాతం, స్కిల్ టెస్ట్ స్కోర్‌కు 10 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 10 శాతం, అనుభవానికి 5 శాతం, డైవర్సిటీ ఫాక్టర్‌కు 5 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు; క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ కార్డ్; టీసీ; కులం, ఆదాయం, వైకల్యం, అనుభవం సంబంధిత ధ్రువపత్రాలు; దరఖాస్తు ఫీజు రిసీట్; అభ్యర్థి ఫొటో.
- **వెబ్‌సైట్:** naarm.org.in

జేఎన్ టాటా లోన్ స్కాలర్‌షిప్

విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకొనే భారతీయ అభ్యర్థుల కోసం ఉద్దేశించిన 'జేఎన్ టాటా ఎండోమెంట్ లోన్ స్కాలర్‌షిప్ 2024' నోటిఫికేషన్ వెలువడింది. ఏ విభాగంలోనైనా ఫుల్ టైం పీజీ, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్, రీసెర్చ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లలో చేరదలచుకొన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దేశవ్యాప్తంగా 5,700 మందికి పైగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అప్లయిడ్ సైన్సెస్, ప్యూర్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, ఐటీ అండ్ కంప్యూటింగ్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లా, కామర్స్, ఫైన్‌ఆర్ట్స్ విభాగాల్లో ప్రోగ్రామ్‌లు ఎంచుకొన్నవారు అత్యధికంగా ఈ లోన్ స్కాలర్‌షిప్ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.



అర్హత: గుర్తింపు పొందిన ఇండియన్ యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు, విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ కోసం ప్రయత్నిస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు ప్రవేశం పొందిన విదేశీ యూనివర్సిటీ వివరాలను నిర్దేశిత సమయంలోపు ఈమెయిల్ ద్వారా తెలపాలి. జీఆర్ఈ/జీమ్యాట్/టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/పీటీఈ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు సబ్మిట్ చేసే 'స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్ఓపీ)'కు ప్రాధాన్యం ఉంటుంది. ఎంచుకొన్న కోర్సు వ్యవధి రెండేళ్లు ఉండాలి. గతంలో లోన్ స్కాలర్‌షిప్ కోసం ప్రయత్నించి విఫలమైనవారు, వచ్చినా వినియోగించుకోనివారు, ఇప్పటికే విదేశాల్లో రెండో ఏడాది కోర్సు చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థి వయసు 2024 జూన్ 30 నాటికి 45 ఏళ్లు మించకూడదు. సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు, వర్క్‌షాప్‌లు, పేపర్ ప్రెజంటేషన్‌ల కోసం విదేశాలకు వెళ్లేవారు; డిగ్రీ స్థాయి కోర్సులు ఎంచుకొన్నవారు; ఆన్‌లైన్/దూరవిద్య విధానంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ/డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. ఇప్పటికే లోన్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని పూర్తిగా చెల్లించినవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, అనుభవం ఆధారంగా స్ర్కీనింగ్ చేసి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి మాత్రమే థింకింగ్ స్కిల్స్ అసెస్‌మెంట్ కోసం ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారికి టెక్నికల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థి చూపిన ప్రతిభ ఆధారంగా ఫైనల్ సెలెక్షన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

లోన్ స్కాలర్‌షిప్ వివరాలు: అభ్యర్థి ఎంచుకొన్న ప్రోగ్రామ్‌ను అనుసరించి రూ.1,00,000 నుంచి రూ.10,00,000ల మధ్య లోన్ స్కాలర్‌షిప్ అందిస్తారు. ట్రావెల్ అసిస్టెన్స్ కింద గరిష్ఠంగా రూ.50,000 ఇస్తారు. ప్రోగ్రామ్ సమయంలో అభ్యర్థి చూపిన ప్రతిభ ఆధారంగా గిఫ్ట్ అవార్డ్ కింద రూ.2,00,000 నుంచి రూ.7,50,000 వరకు చెల్లిస్తారు. ప్రోగ్రామ్‌లో చేరిన మూడో ఏడాది నుంచి ఏడో సంవత్సరంలోపు అభ్యర్థులు ఈ లోన్ స్కాలర్‌షిప్‌ను అయిదు ఇన్‌స్టాల్‌మెంట్‌లలో తిరిగి చెల్లించాలి. ఈ మేరకు సంబంధిత ట్రస్టీతో లీగల్‌గా ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సినవి:** అభ్యర్థి ఫొటో, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, డిగ్రీ/పీజీ సర్టిఫికెట్‌లు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్; వర్కింగ్ ప్రొఫెషనల్స్ అయితే అనుభవ ధ్రువీకరణ పత్రం, అపాయింట్‌మెంట్ లెటర్, ఐటీఆర్/మూడు నెలల పే స్లిప్స్‌ను కూడా నిర్దేశిత సైజ్‌లో అప్‌లోడ్ చేయాలి.
- దరఖాస్తు సబ్మిట్ చేసిన తరవాత ఏవైనా మార్పులు చేయదలచుకుంటే ఈ-మెయిల్ ద్వారా సంస్థకు సమాచారమివ్వాలి.
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 1
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థులు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** రెజ్యూమె; డిగ్రీ/పీజీ మార్కుల పత్రాలు; జీఆర్ఈ/జీమ్యాట్/టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/పీటీఈ స్కోర్ కార్డ్; ఇప్పటి వరకు పొందిన స్కాలర్‌షిప్‌లు, బహుమతుల వివరాలు; రీసెర్చ్ వర్క్/ప్రాజెక్ట్ వర్క్‌లు; విదేశీ విశ్వవిద్యాలయం నుంచి అడ్మిషన్ లెటర్; హామీదారుకు సంబంధించిన ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఐటీఆర్/మూడు నెలల పే స్లిప్స్, ఫొటో
- **ఫైనల్ సెలెక్షన్‌కి ఎంపికైన అభ్యర్థులు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పాన్ కార్డ్, బ్యాంక్ స్టేట్‌మెంట్, హామీదారుకు సంబంధించిన ఐటీఆర్, ఫొటో, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్.
- **వెబ్‌సైట్:** jntataendowment.org

జ్యోతిబా పూలే గురుకులాల బ్యాక్‌లాగ్ ఎంట్రెన్స్ టెస్ట్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్ఎస్) - రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకోసం బ్యాక్‌లాగ్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీసీ బాల బాలికల పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రంలోని పాత జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తారు. యోగా, వ్యాయామం, క్రీడలు, ఆటపాటలకు ప్రాధాన్యం ఉంటుంది. కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతులు ఉంటాయి. విద్య, భోజనం, వసతి ఉచితం. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.



ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. తెలుగులో 15, లెక్కల్లో 30, సామాన్యశాస్త్రంలో 15, సాంఘిక శాస్త్రంలో 15, ఇంగ్లీష్‌లో 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రవేశం పొందే తరగతిని అనుసరించి ముందు తరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఇస్తారు. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్న పత్రం తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

మిగిలిన సీట్ల వివరాలు

ఆరోతరగతిలో: మొత్తం సీట్లు 2152. బాలురకు 1015, బాలికలకు 1137 సీట్లు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో 100, రంగారెడ్డిలో 170, హైదరాబాద్‌లో 225, మెదక్‌లో 311, నిజామాబాద్‌లో 366, ఆదిలాబాద్‌లో 55, కరీంనగర్‌లో 317, వరంగల్‌లో 96, ఖమ్మంలో 390, నల్లగొండలో 132 సీట్లు ఉన్నాయి.

ఏడోతరగతిలో: మొత్తం సీట్లు 976. బాలురకు 448, బాలికలకు 528 సీట్లు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో 49, రంగారెడ్డిలో 97, హైదరాబాద్‌లో 24, మెదక్‌లో 167, నిజామాబాద్‌లో 176, ఆదిలాబాద్‌లో 28, కరీంనగర్‌లో 120, వరంగల్‌లో 46, ఖమ్మంలో 234, నల్లగొండలో 35 సీట్లు ఉన్నాయి.

ఎనిమిదోతరగతిలో: మొత్తం సీట్లు 1095. బాలురకు 501, బాలికలకు 594 సీట్లు ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో 47, రంగారెడ్డిలో 104, హైదరాబాద్‌లో 59, మెదక్‌లో 154, నిజామాబాద్‌లో 175, ఆదిలాబాద్‌లో 73, కరీంనగర్‌లో 138, వరంగల్‌లో 47, ఖమ్మంలో 255, నల్లగొండలో 43 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఆరోతరగతిలో ప్రవేశానికి అయిదో తరగతి, ఏడోతరగతిలో ప్రవేశానికి ఆరోతరగతి, ఎనిమిదో తరగతిలో ప్రవేశానికి ఏడోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. విద్యార్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి ఆరోతరగతికి 12 ఏళ్లు, ఏడోతరగతికి 13 ఏళ్లు, ఎనిమిదోతరగతికి 14 ఏళ్లు మించకూడదు. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ విద్యార్థులకు రూ.1,50,000; పట్టణ ప్రాంతాల విద్యార్థులకు రూ.2,00,000 మించకూడదు.

దరఖాస్తు నిబంధనలు: ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి వివరాలు పూర్తిగా నింపాలి. విద్యార్థి ఫొటో; పుట్టిన తేదీ, కులం, ఆదాయం, ప్రత్యేక కేటగిరీ ధృవీకరణ పత్రాలు; బోనఫయిడ్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్‌లను అప్‌లోడ్ చేయాలి. సొంత జిల్లాకు చెందిన పరీక్ష కేంద్రాలను మాత్రమే ఎంచుకోవాలి. సంస్థ వెబ్‌సైట్‌లో ఇచ్చిన పాఠశాలల పట్టికను పరిశీలించి పాఠశాల ప్రాధాన్యక్రమాన్ని సూచించాలి. దరఖాస్తును అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు వీలు లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. విద్యార్థులకు సొంత జిల్లా పాఠశాలల్లో మాత్రమే ప్రవేశం లభిస్తుంది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీలు ఉండవు. పూర్తి వివరాలకోసం విద్యార్థులు దగ్గరలోని సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని సంప్రదించవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 15
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 26 నుంచి
- **బ్యాక్‌లాగ్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మార్చి 3
- **అడ్మిషన్ ప్రక్రియకు ముగింపు:** జూలై 31
- **చిరునామా:** మహాత్మా జ్యోతిబా పూలే వెనకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయం, రూం నెం. 206, రెండో అంతస్తు, డీఎస్ఎస్ భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

జాబ్ కార్నర్

బీఐఎస్‌లో కన్సల్టెంట్స్



బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న విభాగాల్లో కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీగా ఖాళీలు

1. సివిల్ ఇంజనీరింగ్: 15
2. కెమికల్: 6
3. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: 3
4. ఎలక్ట్రోటెక్నికల్: 6
5. ఫుడ్ అండ్ అగ్రికల్చర్: 6
6. మెకానికల్ ఇంజనీరింగ్: 7
7. మెడికల్ ఎక్విప్‌మెంట్ అండ్ హాస్పిటల్ ప్లానింగ్: 2
8. మెటలర్జికల్ ఇంజనీరింగ్: 9
9. పెట్రోలియం, కోల్ అండ్ రిలేటెడ్ ప్రొడక్ట్స్: 5
10. ప్రొడక్షన్ అండ్ జనరల్ ఇంజనీరింగ్: 10
11. టెక్స్‌టైల్: 8
12. ట్రాన్స్‌పోర్ట్ ఇంజనీరింగ్: 7
13. వాటర్ రీసోర్సెస్: 6
14. సర్వీస్ సెక్టార్: 8
15. మేనేజ్‌మెంట్ అండ్ సిస్టమ్: 5
16. ఆయూష్: 4

అర్హత: పోస్టును అనుసరించి టింబర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/టెక్నాలజీ ఫారెస్ట్, సివిల్/ఫైర్/మెటలర్జీ, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, కెమికల్, పాలిమర్ ఇంజనీరింగ్/ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ ఎంటెక్‌తో పాటు సంబంధిత రంగంలో 5 నుంచి 10 ఏళ్ల పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 65 ఏళ్లు మించరాదు
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 19
వెబ్‌సైట్: www.bis.gov.in/

'సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్'లో సైంటిస్టులు

సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 12
అర్హత: సైన్స్/ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్/సెరామిక్ టెక్నాలజీ/మెటీరియల్స్ ఇంజనీరింగ్/మెటీరియల్స్ సైన్స్/మెటలార్జికల్ అండ్ మెటీరియల్ ఇంజనీరింగ్/ఫిజిక్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 32 ఏళ్లకు మించకూడదు.
దరఖాస్తు ఫీజు: రూ.500
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 24
వెబ్‌సైట్: https://www.cgcri.res.in/

ఓఎంసీలో మేనేజర్లు

ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎంసీ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: మేనేజర్(కార్పొరేట్ కమ్యూనికేషన్) ఈ-3 గ్రేడ్
అర్హత: పీజీ, డిగ్రీ, జర్నలిజమ్ డిప్లొమా, మాస్ కమ్యూనికేషన్‌తో పాటు నాలుగేళ్ల సంబంధిత పని అనుభవం ఉండాలి.
ఎంపిక: షార్ట్‌లిస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా
వయోపరిమితి: 38 ఏళ్లు మించరాదు
జీతం: నెలకు రూ.67,700 - రూ.2,08,700
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 30
వెబ్‌సైట్: https://omcltd.in/

ఐఎంయులో ఫ్యాకల్టీ

చెన్నైలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్(బ్యాక్‌లాగ్) నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 16

1. ప్రొఫెసర్(నాటికల్ సైన్స్): 1 పోస్టు
2. అసోసియేట్ ప్రొఫెసర్(నేచురల్ సైన్స్/మెరైన్ ఇంజనీరింగ్): 8 పోస్టులు
3. అసిస్టెంట్ ప్రొఫెసర్(నేచురల్ సైన్స్/మెరైన్ ఇంజనీరింగ్): 7 పోస్టులు

అర్హతలు: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 50 సంవత్సరాలు మించకూడదు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 24
దరఖాస్తు హార్డ్ కాపీ సమర్పణకు చివరి తేదీ: జనవరి 29
వెబ్‌సైట్: www.imu.edu.in/imunew/

లిటిల్స్



నక్క కొంగ స్నేహం

ఒక అడవిలో కొంగ ఉండేది. దానికి అనుకోకుండా ఓ స్నేహితుడు పరిచయమైంది. అదో నక్క. సంబరంగా నక్క స్నేహితుడని పక్షులకంతా చెప్పుకునేది. అయితే నక్కను మాత్రం నమ్మకు అంటూ పక్షులు హితబోధ చేశాయి. అప్పటి నుంచి జాగ్రత్తగానే ఉంది కొంగ.


ఆ నక్క విషయానికొస్తే టక్కరి. పక్షులను, చేపలను తినటంలో అందెవేసిన చేయి. నమ్మించి మోసం చేయటంలో ముందుంటుంది. పక్షులను తిని రుచి మరిగిన నక్క ఈ కొంగను కూడా తినాలనుకుంది. అయితే కొంగ మంచితనం చూసి నక్కకు దుర్బుద్ధి పోయింది. ఒక మంచి స్నేహంగా చూసింది. తను ఆపదలో ఉంటే ఆదుకోవాలి. తద్వారా తన మంచితనాన్ని చాటుకోవాలనే ఆలోచనలోకి పడింది నక్క.



నక్క ఒక రోజు సింహం తినగా మిగిలిన మాంసాన్ని తినింది. ఆశతో తినటంతో చూసుకోలేదు. ఒక ముక్క తన నోటిలో గుచ్చుకుంది. బాధతో విలవిలలాడింది. ప్రాణం పోతుందేమోనని భయపడింది. వెంటనే ఆ ముక్కను ఎలాగైనా బయటకు తీయించుకోవాలని పరిగెత్తింది. నక్కలూ పట్టించుకోలేదు. దారిలో ఓ నెమలి కనపడింది. నోటిలో ఇరుక్కున ఎముకను తీయమని బతిమలాడింది. నీ మాటలు నమ్మలేనంది నెమలి. కోతి కనపడింది. నక్క సంతోషడింది. కోతి బావా ఎలాగైనా నా బాధనుంచి విముక్తి కలిగించు అని వేడుకుంది. నక్క బావా నీ మాటలు నమ్మలేను. నీ జాతి గురించి నాకు తెలీదా? అన్నది భయంతో. ఇక చావే శరణ్యం అనుకున్న సమయంలో కొంగ వచ్చింది. కొంగకు తన బాధచెప్పింది. వెంటనే నక్క నోటిలోని ఎముకను తీయటానికి ఇష్టపడలేదు. స్నేహితుడిని కాపాడలేవా? అన్నది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన పొడవైన ముక్కుతో ఆ ఎముక ముక్కను క్షణాల్లో తీసేసింది. నక్కకు ఉపశమనం కలిగింది.

అసలు నన్ను ఎవరూ నమ్మలేదు. నీలాంటి స్నేహితురాలు ఉండటం అదృష్టమంటూ సంతోషపడింది నక్క. నిన్ను నమ్మలేకపోయా.. నీ స్నేహం గురించి ఇప్పుడే అర్థమైందన్నది కొంగ.

దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



చుక్కలు కలపండి



రంగులు వేయండి



డైలీ సుడోకు - 202

	7		8					9
5		1			7			
		8		1			3	7
	4		3		5			
	5						8	
			1		4		9	
3	9			5		2		
			7			9		3
6					9		1	

సుడోకు - 201 సమాధానం

5	4	3	6	7	8	9	1	2
7	2	9	1	4	3	6	5	8
6	1	8	2	5	9	3	7	4
3	5	4	8	1	7	2	6	9
9	7	1	3	2	6	4	8	5
8	6	2	5	9	4	1	3	7
4	9	6	7	8	1	5	2	3
1	8	5	9	3	2	7	4	6
2	3	7	4	6	5	8	9	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.